www.bharathasakthi.com

# భారత శక్తి ®

VOICE OF INDIAN

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి : 21 | సంచిక : 30 | హైదరాబాద్ | శనివారం,జులై 4 , 2026 | పేజీలు : 12 | వెల : 1.00

## ప్రధాని మోదీకి 'చిన్న చెల్లెలు' వచ్చింది!



భారత్, జపాన్ దేశాల మధ్య వ్యూహాత్మక సంబంధాలు నూతన శిఖరాలకు చేరుతున్నాయి. కేవలం అధికారిక చర్చలకే పరిమితం కాకుండా, ఇరు దేశాల అధినేతల మధ్య నెలకొన్న బలమైన వ్యక్తిగత అనుబంధానికి నిదర్శనంగా నిలిచి ఒక అరుదైన సన్నివేశం న్యూఢిల్లీలో ఆవిష్కృతమైంది. జపాన్ ప్రధానమంత్రి సనాయ్ తకాయిచిని భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎంతో ఆత్మీయంగా తన 'చెల్లెలు' అని సంబోధించారు.న్యూఢిల్లీ వేదికగా జరిగిన 16వ భారత్–జపాన్ వార్షిక శిఖరాగ్ర సదస్సు సందర్భంగా ఈ ఆసక్తికర సంభాషణ

2లో..




## రాయలసీమ పారిశ్రామిక
# అభివృద్ధికి నాంది..!!

- జేఎస్‌డబ్ల్యూ రాయలసీమ స్టీల్ ప్రాజెక్టు పనులకు శ్రీకారం
- రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి చేతుల మీదుగా ప్రారంభం
- రూ.16,350 కోట్ల పెట్టుబడి తో రెండు దశల్లో 20 లక్షల టన్నుల సామర్థ్యంతో నిర్మాణం కానున్న ఉక్కు కర్మాగారం
- జమ్మల మడుగు,జేఎస్ డబ్ల్యూ ఇండస్ట్రీయల్

**పార్క్, జూలై 3(భారత శక్తి ) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికే ప్రతిష్ఠాత్మకంగా రూపుదిద్దుకుంటున్న జేఎస్‌డబ్ల్యూ స్టీల్ సంస్థ.. వైఎస్ఆర్ కడప జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గంలోని సున్నపురాళ్లపల్లె వద్ద రాయలసీమ సమీకృత ఉక్కు కర్మాగారం నిర్మాణ పనులను నాంది పలికింది. శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జమ్మల మడుగు మండలం సున్నపు రాళ్ళ పల్లె వద్ద ఈ బృహత్తరమైన అభివృద్ధి కార్యక్రమాలకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో కేంద్ర ఉక్కుపరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ,జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ ఛైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ సజ్జన్ జిందాల్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ జాయింట్ మేనేజింగ్

2లో..

# జీహెచ్ఎంసీలో 'డీజిల్' దందా




- ▶ కమిషనర్ సర్క్యులర్ నం. 4089 గాల్లోకి.. ఫోర్‌మెన్ల చేతుల్లో కూపన్ల ఇష్యూ!
- ▶ జీపీఎస్ డేటాకు, ఇంధన వినియోగానికి పొంతన లేదు
- ▶ కవాడిగూడ టు చార్మినార్.. జోన్లు దాటుతున్న డీజిల్ మతలబులు!
- ▶ దొంగ కూపన్లు, అని తెలియపరుస్తూ ఆధారాలు పొందుపరిచి వార్తలు రాసినా శాఖా పరమైన చర్యలు ఎక్కడ..!
- ▶ కవాడిగూడ ట్రాన్స్‌పోర్ట్ స్టేషన్ను టార్గెట్ చేసుకొని 16 సంవత్సరాల నుండి దిష్ఠ వేసుకుని దోచుకుంటున్న ఫోర్ మెన్ ఫారూఖ్..!
- ▶ జి.హెచ్.ఎం.సి కమిషనర్ ఆర్.వి కర్ణన్ కు చిత్తశుద్ధి ఉంటే ఫోర్ మెన్లను వెంటనే సస్పెండ్ చేయాలి..
- ▶ జిహెచ్ఎంసి విజిలెన్స్ సెంట్రల్ విజిలెన్స్ ఏసీబీ, ఈ అవినీతి పై విచారణ జరిపి నిగ్గు తేల్చాలి:
- ▶ మున్సిపల్ సెక్రెటరీ జయేష్.రంజన్, మున్సిపల్ శాఖ మంత్రి సీఎం రేవంత్ రెడ్డి దృష్టి సారించాలి..!




పాలన గాడితప్పితే లూటీగాళ్లకు పండగే! జీహెచ్ఎంసీ ఖజానాను కొల్లగొడుతూ, కమిషనర్ సర్క్యులర్లను గాల్లోకి లేపేస్తూ 'డీజిల్' దందా కోట్లలో సాగుతోంది. ఆధారాలున్నా చర్యల్లేని వింత రాజ్యంలో.. ఉన్నతాధికారుల అండతో ఫోర్‌మెన్లు చక్రం తిప్పుతున్నారు. వాహనాలు షెడ్డులో ఉన్నా నకిలీ రిపేర్ బిల్లులు, జీపీఎస్ డేటాకు పొంతనలేని దొంగ కూపన్ల మాయాజాలం నడుస్తోంది. ఈ దోపిడీపై ఏసీబీ విచారణ జరిపి, అవినీతి తిమింగలాలకు సంకెళ్లు వేయాల్సిందే!"ఫోరం ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ అందిస్తున్న పరిశోధనాత్మక కథనం"

2లో..

## అప్పుల లెక్కల్లో పొంతన లేదు.. మంత్రి చెప్పింది ఒకటి..
### - సీఎం చెప్పింది మరొకటి: హరీశ్ రావు



2లో..

# ఎస్ఐఆర్ నిలిపేయండి
## - సుప్రీంకోర్టుకు విపక్షాల వినతి

- ▶ సుప్రీంకోర్టుకు 23 మంది విపక్ష నేతల లేఖ
- ▶ ఓటర్ల తొలగింపుపై తీవ్ర అభ్యంతరం
- ▶ ఈవీఎంలపై ప్రజా చర్చ కోరిన విపక్షాలు
- ▶ కేంద్ర సంస్థలను దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపణ
- ▶ ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందని వ్యాఖ్య




**న్యూఢిల్లీ (భారత శక్తి)** దేశ ఎన్నికల ప్రక్రియపై తీవ్ర ఆందోళనలు వ్యక్తం చేస్తూ విపక్షాలు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాశాయి. ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని కోరాయి. ప్రజాస్వామ్య వ్యవస్థకు ముప్పు ఏర్పడిందని ఆరోపించాయి. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే,

2లో..

### పేద పిల్లలకు ప్రపంచ స్థాయి విద్య అందించడానికే
## ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ఏర్పాటు
### మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**సూర్యాపేట (భారత శక్తి ప్రతినిధి) జూలై 3:** గ్రామీణ ప్రాంతాలలోని పేద పిల్లలకు నాణ్యమైన ప్రపంచ స్థాయి ఇంగ్లీష్ బోర్డింగ్ విద్యను అందించడానికి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు చేస్తున్నామని రాష్ట్ర నీటిపారుదల ఱ ఆహార పౌరసరఫరాల శాఖ మంత్రి నల్లమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం గరిడేపల్లి మండలం గడ్డిపల్లి లో రూ 250 కోట్లతో నిర్మాణంలో ఉన్న ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులను జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తో కలిసి పరిశీలన చేశారు.ఈ సందర్భంగా విలేకరులతో

2లో..

## తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమానికి
# సర్కార్ ముందడుగు!




### - ఈ నెల 6 నుంచి విస్తృత సంప్రదింపులు..
### - తొలి ఆహ్వానం ఉస్మానియా విద్యార్థి నేతలకే!

**హైదరాబాద్ జూలై 3 భారత శక్తి :**తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారులను గుర్తించి, వారి సంక్షేమానికి చేపట్టాల్సిన చర్యలపై ప్రభుత్వానికి సిఫార్సులు చేయడానికి ఏర్పాటైన ఉన్నత స్థాయి కమిటీ తన కార్యాచరణను వేగవంతం చేసింది.

ప్రభుత్వ ఉత్తర్వుల సంఖ్య 679 ద్వారా ఏర్పడిన ఈ కమిటీ, ఈ నెల 6వ తేదీ నుండి ఉద్యమకారులతో విస్తృత స్థాయి సంప్రదింపుల కార్యక్రమాన్ని ప్రారంభించనుంది.

#### తొలి ప్రాధాన్యం ఉస్మానియా పోరాట యోధులకు..

మలిదశ తెలంగాణ ఉద్యమానికి ప్రధాన కేంద్రంగా నిలిచి, ఉద్యమాన్ని ఉరకలెత్తించిన ఉస్మానియా విశ్వవిద్యాలయ విద్యార్థి సంయుక్త కార్యాచరణ సమితి (జేఏసీ) నాయకులతో కమిటీ తన తొలి సమావేశాన్ని నిర్వహించనుంది. నాటి పోరాటంలో అగ్రభాగాన నిలిచిన విద్యార్థి నాయకులను ఈ సమావేశానికి ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఉద్యమకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టాల్సిన విధానాలు, అమలు చేయాల్సిన పథకాలపై వారి నుంచి కమిటీ సూచనలు, సలహాలను స్వీకరించనుంది.

#### అమరవీరుల సాక్షిగా ఆలోచనల మథనం:

ఈ కీలక సమావేశానికి వేదికగా సచివాలయం ఎదురుగా ఉన్న తెలంగాణ అమరవీరుల స్మారక చిహ్నాన్ని ఖరారు చేయడం విశేషం. ఉద్యమకారుల త్యాగాలకు ప్రతీక అయిన ఈ ప్రాంగణంలోనే భవిష్యత్తు కార్యాచరణపై చర్చలు జరగనున్నాయి.


**తేది: 6 జూలై, 2026 (సోమవారం)**
**సమయం: ఉదయం 10 గంటలకు**
**వేదిక: అమరవీరుల స్మారకం, సచివాలయం ఎదురుగా, హైదరాబాద్.**

#### కమిటీ సభ్యుల పిలుపు:

నాటి ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న విద్యార్థి నాయకులంతా ఈ సమావేశానికి విచ్చేసి, ఉద్యమకారుల సంక్షేమం కొరకు ప్రభుత్వం ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలో తమ అమూల్యమైన ప్రతిపాదనలను అందించాలని కమిటీ సభ్యులు కె. కేశవరావు, పొన్నం ప్రభాకర్, ఎమ్. కోదండరామ్, అద్దంకి దయాకర్, రాములు నాయక్, మోతె శోభన్ రెడ్డి సంయుక్త ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

### క్రిస్టియన్ మైనారిటీల స్వయం ఉపాధికి
## టీ కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట

- సంక్షేమ పథకాల ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియను ప్రారంభించిన మంత్రి మహమ్మద్ అజారుద్దీన్
- జూలై 18 వరకు దరఖాస్తుకు అవకాశం
- కుట్టు మిషన్లు, ద్విచక్ర వాహనాలు, చిన్న వ్యాపారాలకు ఆర్థిక సహాయం
- సచివాలయంలో లబ్ధిదారుల నిర్వహణ, పర్యవేక్షణ వ్యవస్థ (ఓబీఎంఎంఎస్) పోర్టల్ ఆవిష్కరణ




**హైదరాబాద్, జూలై 3 (భారత శక్తి ):** తెలంగాణలోని క్రిస్టియన్ మైనారిటీల ఆర్థిక సాధికారత, స్వయం ఉపాధి, జీవనోపాధి అవకాశాలను మెరుగుపరిచే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. క్రిస్టియన్ మైనారిటీల ఆర్థిక సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన 'ఆన్‌లైన్ లబ్ధిదారుల నిర్వహణ మరియు పర్యవేక్షణ వ్యవస్థ' (OBMMS) పోర్టల్‌ను రాష్ట్ర మైనారిటీల సంక్షేమ, ప్రభుత్వ రంగ సంస్థల శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ శుక్రవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలోని తన కార్యాలయంలో అధికారికంగా ప్రారంభించారు.ఈ సరికొత్త డిజిటల్ వ్యవస్థ ద్వారా క్రిస్టియన్ మైనారిటీ

2లో..

# రాయలసీమ పారిశ్రామిక అభివృద్ధికి నాంది..!!



డైరెక్టర్ & సీఈఓ జయంత్ ఆచార్య,జిల్లా ఇంచార్జి మంత్రి శ్రీమతి ఎస్.సవిత,రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టి పాటి రవికుమార్,రాష్ట్ర పరిశ్రమల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ డా. యువరాజ్,జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి,రాష్ట్ర ప్రభుత్వ విప్,జమ్మలమడుగు ఎమ్మెల్యే చదిపిరాళ్ల ఆదినారాయణ రెడ్డి,ప్రజా ప్రతినిధులు, పాల్గొన్నారు.

### రెండు దశల్లో రూ.16,350 కోట్ల పెట్టుబడి

జేఎస్‌డబ్ల్యూ రాయలసీమ స్టీల్ లిమిటెడ్ ఆధ్వర్యంలో పూర్తిగా అనుబంధ సంస్థగా ఈ ప్రాజెక్టు అమలవుతోంది. మొత్తం 20 లక్షల టన్నుల (2 మీ్టూ) వార్షిక ఉత్పత్తి సామర్థ్యంతో కర్మాగారాన్ని రెండు దశల్లో నిర్మించనున్నారు.

మొదటి దశలో రూ.4,500 కోట్ల పెట్టుబడితో సంవత్సరానికి 10 లక్షల టన్నుల సామర్థ్యమున్న సమీకృత ఉక్కు కర్మాగారాన్ని ఏర్పాటు చేస్తారు.

రెండో దశలో మరో రూ.11,850 కోట్ల పెట్టుబడితో సామర్థ్యాన్ని 20 లక్షల టన్నులకు పెంచనున్నారు.

దీంతో మొత్తం పెట్టుబడి వ్యయం రూ.16,350 కోట్లకు చేరనుంది.

### అత్యాధునిక సాంకేతికతతో పర్యావరణహిత ఉత్పత్తి.

ఈ ప్రాజెక్టులో అత్యాధునిక ఎలక్ట్రిక్ ఆర్క్ ఫర్నేస్ (EAF) సాంకేతికతను వినియోగించనున్నారు. పునర్వినియోగ ఉక్కు (స్క్రాప్, డైరెక్ట్ రిడ్యూస్డ్ ఐరన్ (DRI)ను ముడి పదార్థాలుగా ఉపయోగించి తక్కువ కార్బన్ ఉద్గారాలతో అత్యుత్తమ నిర్మాణ ఉక్కును తయారు చేయనున్నారు. పునరుత్పాదక విద్యుత్ వినియోగం, ఇంధన పొదుపు సాంకేతికతలు, వనరుల సమర్థ వినియోగం ద్వారా దేశంలోనే అత్యంత సుస్థిర ఉక్కు తయారీ కేంద్రాల్లో ఒకటిగా ఈ కర్మాగారాన్ని తీర్చిదిద్దనున్నారు.

### రాయలసీమకు పారిశ్రామికంగా భారీ ఊతం.

ఈ ప్రాజెక్టు ద్వారా రహదారి, రైల్వే, విద్యుత్, నీటి వసతులు మరింత అభివృద్ధి చెందనున్నాయి. అనుబంధ పరిశ్రమలు, లాజిస్టిక్స్ రంగం, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు కొత్త అవకాశాలు ఏర్పడనున్నాయి. రాయలసీమను పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దడంలో ఈ ప్రాజెక్టు కీలక పాత్ర పోషించనుంది. రాష్ట్రంలో భారీ పెట్టుబడులను ఆకర్షించేందుకు ఇది బలమైన పునాదిగా మారనుంది.

### రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వం పై జేఎస్‌డబ్ల్యూ ప్రశంసలు.


రాయలసీమ స్టీల్ ప్రాజెక్టు ప్రారంభం ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక భవిష్యత్తుపై జేఎస్‌డబ్ల్యూ నమ్మకానికి నిదర్శనమని జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ ఛైర్మన్ ు మేనేజింగ్ డైరెక్టర్ సజ్జన్ జిందాల్ ప్రశంసించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రంలో తయారీ రంగం, మౌలిక సదుపాయాలు, పెట్టుబడులకు అనుకూల వాతావరణం ఏర్పడుతోందని కొనియాడారు. ప్రపంచ స్థాయి




పారిశ్రామిక సామర్థ్యాల నిర్మాణంలో భాగస్వాములు కావడం తమకు గర్వకారణమని తెలిపారు.

### దేశ ఉక్కు రంగానికి కొత్త బలం.

తయారీ, మౌలిక సదుపాయాల విస్తరణలో భారతదేశం కీలక దశలో ఉందని, ఆంధ్రప్రదేశ్ ఈ అభివృద్ధికి కేంద్రబిందువుగా మారుతోందని జేఎస్‌డబ్ల్యూ స్టీల్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ ు సీఈఓ జయంత్ ఆచార్య పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు దేశీయ ఉక్కు తయారీ సామర్థ్యాన్ని



మరింత బలోపేతం చేయడంతో పాటు రాయలసీమ ప్రాంత ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు.

### జేఎస్‌డబ్ల్యూ లక్ష్యం -- సుస్థిర అభివృద్ధి.

2030 నాటికి ఉక్కు తయారీ కేంద్రాల్లో కార్బన్ ఉద్గారాలను 42 శాతం తగ్గించడం, 2050 నాటికి నికర కార్బన్ తటస్థత సాధించడం జేఎస్‌డబ్ల్యూ లక్ష్యంగా పెట్టుకుంది. జీవవైవిధ్య పరిరక్షణ, నీటి వినియోగ నియంత్రణ, జీరో లిక్విడ్ డిశ్చార్జ్ వంటి పర్యావరణ ప్రమాణాలను ఈ ప్రాజెక్టులో అమలు చేయనుంది.

### రాష్ట్ర పారిశ్రామిక చరిత్రలో మరో మైలురాయి.

రాయలసీమ స్టీల్ ప్రాజెక్టు ప్రారంభం కేవలం ఒక కర్మాగార నిర్మాణానికి మాత్రమే కాకుండా, రాయలసీమను జాతీయ పారిశ్రామిక పటంలో మరింత బలంగా నిలబెట్టే కీలక అడుగుగా నిలవనుంది.భారీ పెట్టుబడులు, ఆధునిక సాంకేతికత, పర్యావరణహిత ఉత్పత్తి, ఉపాధి అవకాశాలు, అనుబంధ పరిశ్రమల అభివృద్ధితో ఈ ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక పురోగతిలో ఒక మైలురాయిగా నిలుస్తుందనడంలో ఈ శంకుస్థాపన ఘట్టం ప్రత్యక్ష సాక్ష్యంగా నిలుస్తోంది. ఈ కార్యక్రమంలో డీఐజీ కోయ ప్రవీణ్, జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్,జేసీ డా. నిధీమీనా, సబ్ కలెక్టర్ హెచ్.ఎస్. భావన, కమలాపురం,మైదుకూరు ఎమ్మెల్యేలు పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి, పుట్టా సుధాకర్ యాదవ్,నాయకులు పి వి ఎన్ మాధవ్,భూపేష్ రెడ్డి సంబంధిత అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## క్రిస్టియన్ మైనారిటీల స్వయం ఉపాధికి
# టీ కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట
### పారదర్శక పాలనే లక్ష్యం: మంత్రి మహమ్మద్ అజారుద్దీన్




మహిళల కోసం కుట్టు మిషన్ల పంపిణీ, నిరుద్యోగుల కోసం మోటార్ బైక్, ఈ-బైక్, స్కూటీ, ఈ-స్కూటర్ల సరఫరా, అలాగే చిన్న వ్యాపారాల (పెట్టీ బిజినెస్) నిర్వహణకు అందించే సంక్షేమ పథకాల ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ అందుబాటులోకి వచ్చింది.

ఈ సందర్భంగా మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం మైనారిటీల సంక్షేమానికి, ఆర్థికాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని స్పష్టం చేశారు. పూర్తి పారదర్శకతతో, ఆధునిక సాంకేతికతను ఉపయోగించుకుంటూ ప్రజలకు సులభంగా సేవలు అందించడమే లక్ష్యంగా ఈ ఆన్‌లైన్ విధానాన్ని తెచ్చినట్లు పేర్కొన్నారు. ఈ పథకాలు మైనారిటీ యువత, మహిళలు స్వయం ఉపాధి సాధించి, ఆర్థికంగా స్థిరపడటానికి ఎంతో దోహదపడతాయన్నారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ మైనారిటీల సలహాదారు మహ్మద్ షబ్బీర్ అలీ, క్రిస్టియన్ మైనారిటీల ఆర్థిక సంస్థ అధ్యక్షుడు దీపక్ జాన్, మైనారిటీల సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శి బి. షఫీయుల్లా, మైనారిటీల సంక్షేమ శాఖ సంచాలకుడు అబ్దుల్ హమీద్, ఆర్థిక సంస్థ నిర్వాహక సంచాలకురాలు పి. సబిత, హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### దరఖాస్తుల స్వీకరణ వివరాలు

అర్హులైన క్రిస్టియన్ మైనారిటీ అభ్యర్థులు జూలై 3 నుండి జూలై 18 సాయంత్రం 5:00 గంటల వరకు tsobmms.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు.

### అర్హత ప్రమాణాలు:

లివయోపరిమితి: కుట్టు మిషన్, చిన్న వ్యాపారాల పథకాలకు 21 నుండి 55 సంవత్సరాలు; ద్విచక్ర వాహనాల (మోటార్ బైక్/స్కూటర్) పథకానికి 21 నుండి 50 సంవత్సరాల లోపు ఉండాలి.

**కుటుంబ వార్షిక ఆదాయం:** పట్టణ ప్రాంతాల వారికి రూ. 2 లక్షలు, గ్రామీణ ప్రాంతాల వారికి రూ. 1.50 లక్షల లోపు ఉండాలి.


### సహాయ కేంద్రం:

అభ్యర్థులు మరిన్ని వివరాల కోసం 040-23391067 నంబర్‌ను సంప్రదించవచ్చు లేదా tscmfc.in అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు.

# జీహెచ్ఎంసీలో 'డీజిల్' దందా నిబంధనలు బేఖాతరు.. కోట్లలో కుంభకోణం!?




**హైదరాబాద్, జులై 3 భారత శక్తి:** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) రవాణా విభాగంలో అక్రమాల పుట్ట బద్దలైంది. ఉన్నతాధికారుల ఆదేశాలను తుంగలో తొక్కుతూ, నిబంధనలకు విరుద్ధంగా కోట్ల రూపాయల ప్రజాధనాన్ని కొల్లగొడుతున్న భారీ డీజిల్ కుంభకోణం వెలుగుచూసింది.




కవాడిగూడ ట్రాన్స్‌పోర్ట్ స్టేషన్ వేదికగా సాగుతున్న ఈ అక్రమ లీలలపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. పూర్తి ఆధారాలతో ఫిర్యాదులు అందినప్పటికీ, బాధ్యులపై చర్యలు తీసుకోవడంలో జాప్యం జరుగుతుండటంతో ప్రజలు, సామాజిక కార్యకర్తలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

### జోన్లు దాటిన 'కూపన్ల' మతలబు!


నిబంధనల ప్రకారం ఏ జోన్‌కు సంబంధించిన వ్యయ ప్రయోజనాలు ఆ జోన్ పరిధికే పరిమితం కావాలి. కానీ, సికింద్రాబాద్ జోన్ పరిధిలోని కవాడిగూడ ట్రాన్స్‌పోర్ట్ స్టేషన్ ఇన్చార్జిగా వ్యవహరిస్తున్న ఫోర్‌మెన్ ఫారుక్, చార్మినార్ జోన్ పరిధిలోని మలక్పేట్ ట్రాన్స్‌పోర్ట్ స్టేషన్ వాహనాలకు (బొలెరో తదితర వాహనాలకు) డీజిల్ కూపన్లు జారీ చేయడం ఇప్పుడు అనేక అనుమానాలకు తావిస్తోంది. ఈ వ్యవహారంలో పెద్ద ఎత్తున నిధుల మళ్ళింపు జరిగినట్లు ఆరోపణలు వస్తున్నాయి. అంతర్గత పరిశోధనల ప్రకారం.. ఇలా జారీ అవుతున్న కూపన్లలో దాదాపు 50 శాతం కూపన్లను ప్రైవేటు బంకుల్లో నగదుగా మార్చుకుంటున్నట్లు విశ్వసనీయ సమాచారం.

### కమిషనర్ సర్క్యులర్ నెం. 4089 బేఖాతరు!

జీహెచ్ఎంసీ పరిధిలోని మున్సిపల్ వాహనాలకు ఇంధనాన్ని కేటాయించే ప్రక్రియలో పారదర్శకత కోసం మున్సిపల్ కమిషనర్ స్పష్టమైన సర్క్యులర్ (నెం. 4089/GHMC/HDN/2025) జారీ చేశారు. దీని ప్రకారం కేవలం అసిస్టెంట్ ఇంజనీర్లు (AE), డివిజనల్ ఇంజనీర్లు (DE) లాంటి ఉన్నతాధికారులు మాత్రమే ఆన్‌లైన్ ద్వారా డీజిల్ కూపన్లను పరిశీలించి జారీ చేయాల్సి ఉంటుంది. కానీ క్షేత్రస్థాయిలో ఎలాంటి అధికారిక ఉత్తర్వులు లేని కొందరు ఫోర్‌మెన్లు, తామే ఉన్నతాధికారులుగా అవతారమెత్తి ఇష్టారాజ్యంగా కూపన్లు జారీ చేస్తూ ఖజానాకు కోట్లలో గండి కొడుతున్నారు.

### 16 సంవత్సరాల నుండి మరమ్మత్తుల పేరిట 'మాయాజాలం'.. నెలకు రూ. 35 లక్షలు!

కవాడిగూడ వర్క్‌షాప్‌లో వాహనాలు సుస్థితిలో ఉన్నా, లేదా షెడ్డులోనే మూలన పడి ఉన్నా.. వాటికి నిరంతరం మరమ్మత్తులు జరుగుతున్నట్లు నకిలీ బిల్లులు సృష్టిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రతి నెలా సుమారు మేజర్ మైనర్ నుండి రూ. 35 లక్షల మేర తప్పుడు రిపేర్ బిల్లులను తయారు చేసి నిధులను దారి మళ్లిస్తున్నట్లు తెలుస్తోంది.




### జీపీఎస్ డేటాకు.. కూపన్లకు పొంతన లేదు!

మున్సిపల్ వాహనాల కదలికలను పర్యవేక్షించేందుకు లాగ్‌బుక్‌లతో పాటు జీపీఎస్ (GPS) ట్రాకింగ్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. అయితే, క్షేత్రస్థాయిలో వాహనం తిరిగిన కిలోమీటర్లకు మరియు వినియోగించినట్లు చూపుతున్న ఇంధనానికి అస్సలు పొంతన కుదరడం లేదు. కేవలం కాగితాల్లోనే వాహనాలు తిరిగినట్లు చూపిస్తూ, డీజిల్ కూపన్లను పక్కదారి పట్టిస్తున్న వైనం స్పష్టమవుతోంది.

### 'ఏసీబీ' విచారణ చేపట్టాలి: ఫోరమ్ ఫర్ యాంటీ కరప్షన్ డిమాండ్

గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న ఈ భారీ కుంభకోణంపై 'ఫోరమ్ ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్' తీవ్రంగా స్పందించింది.ఈ మొత్తం వ్యవహారంపై తక్షణమే ప్రత్యేక ఫోరెన్సిక్ ఆడిట్‌నిర్వహించాలి.లభ్యమైన పూర్తి ఆధారాలను స్టేట్ విజిలెన్స్ మరియు అవినీతి నిరోధక శాఖ (ACB)కు అప్పగించి సమగ్ర విచారణ జరిపించాలి.


నకిలీ కూపన్లు, తప్పుడు బిల్లులు సృష్టించిన సిబ్బందిపై, వారికి సహకరించిన ఉన్నతాధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

కమిషనర్ ఆదేశాలనే లెక్కచేయని సదరు సిబ్బందిపై ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకోవడంలో ఎందుకు జాప్యం చేస్తున్నారనే ప్రశ్నలు ఇప్పుడు నగరంలో వెల్లువెత్తుతున్నాయి.

### ఈ అవినీతిలో మాకు భాగం ఉంటుంది అంటున్నా: కవాడిగూడ డిప్యూటీ ఇంజనీర్ వినయ్ భూషణ్:

జిహెచ్ఎంసి కమిషనర్ సర్కులర్ నంబర్ 4089/2025 ను ధిక్కరిస్తూ కవాడిగూడ డిప్యూటీ ఇంజనీర్ వినయ్ భూషణ్ ఫోర్ మెన్ ఫారుక్ కు మేమే అప్రూవల్ ఇచ్చామని చెప్పడం ఫోర్ మెన్ ఫరూక్ అవినీతిలో డి.ఈ వినయ్ భూషణ్ పాత్ర ఎంత ఉందో నీగావిభాగాలు దృష్టి సారించాలి..అలాంటప్పుడు కమిషనర్ ఆర్డర్ ఎందుకు..? డిప్యూటీ ఇంజనీర్ అవినీతి ఫోర్ మెన్ కు సపోర్ట్ ఎందుకు..? రూల్స్ అన్ని అవినీతికి అదునుగా మార్చుకుంటూ అవినీతేపరమావధిగా జిహెచ్ఎంసి ఖజానాను కొల్లగొట్టి కోట్లు లూటీ చేసి విలాస జీవనంలో తులతూవుతూ ప్రభుత్వ రూల్స్ ని రాజ్యాంగాన్ని హేళన చేస్తూ నవ్వడం అవినీతిపరులకు పరిపాటిగా మారిపోయింది.. ఈ విషయంపై జిహెచ్ఎంసి విజిలెన్స్, ఏసీబీ నిఘా విభాగాలు దృష్టిస్తారించి క్రిమినల్ చర్యలు తీసుకోవాలని స్థానిక జనం డిమాండ్ చేస్తున్నారు.

**2007,2008 సంవత్సరంలో 27 కోట్ల ఆటోమొబైల్ స్పేర్ పార్ట్స్ స్కామ్ జిహెచ్ఎంసి కమిషనర్ జనార్దన్ రెడ్డి సీసీఎస్ కు ఫార్వర్డ్ చేసిన ఎఫ్ ఆర్ నెంబర్ 127/2016.. ఈ స్కామ్ లో ప్రధాన నిందితుడు ఈ ఫోర్ మెన్ ఏ విధంగా తప్పించుకున్నాడు అనే కథనంతో రేపటి కథనంలో..**




# ప్రధాని మోదీకి 'చిన్న చెల్లెలు' వచ్చింది!

చోటుచేసుకుంది. హైదరాబాద్ హౌస్‌లో నిర్వహించిన సమావేశంలో, దివంగత మాజీ ప్రధాని షింజో అబేను తాను సొంత అన్నయ్యలా భావించేదాన్నని తకాయిచి గుర్తుచేసుకున్నారు. అబేకు ప్రధాని మోదీ అత్యంత సన్నిహితులు కావడంతో, తనూ ఆయనను అదే దృష్టితో చూస్తున్నానని ఆమె పేర్కొన్నారు. దీనికి స్పందించిన మోదీ, ఆమెను 'చిన్న చెల్లెలు' అని సంబోధించారు. ఈ అనుబంధంతోనే ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళతామని ఇరు నేతలు ఆకాంక్షించారు.జపాన్ తొలి మహిళా ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తకాయిచి భారత్‌లో జరిపిన తొలి అధికారిక పర్యటన ఇది. ఈ పర్యటనలో భాగంగా ఇరు దేశాల మధ్య చరిత్రాత్మక ఒప్పందాలు కుదిరాయి. ముఖ్యంగా రక్షణ రంగంలో సంయుక్త అభివృద్ధి కోసం తొలిసారిగా ఒప్పందం కుదుర్చుకున్నారు. ఆర్థిక, ఇంధన భద్రతపై ఒక స్పష్టమైన రోడ్‌మ్యాప్‌ను ఆవిష్కరించడంతో పాటు, రానున్న పదేళ్లలో జపాన్ నుంచి 10 ట్రిలియన్ యెన్ల పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా నిర్దేశించుకున్నారు.ఈ సదస్సు ఇరు దేశాల మధ్య నెలకొన్న ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యంలో ఒక నూతన అధ్యాయానికి నాంది అని ప్రధాని మోదీ అభివర్ణించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సెమీకండక్టర్లు, ఇంధన రంగాల్లో పరస్పర సహకారంపై ఇరువురు నేతలు సుదీర్ఘంగా చర్చించారు. స్వేచ్ఛాయుతమైన, నియమ నిబంధనలతో కూడిన ఇండో-పసిఫిక్ ప్రాంతం కోసం కలిసి పనిచేయాలని ఇరు దేశాల అధినేతలు నిర్ణయించారు.

# అప్పుల లెక్కల్లో పొంతన లేదు.. మంత్రి చెప్పింది ఒకటి..

### - సీఎం చెప్పింది మరొకటి: హరీశ్ రావు

రాష్ట్ర అప్పుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధాలు చెబుతోందని, ప్రభుత్వ పెద్దల మధ్యే లెక్కల్లో పొంతన లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు తీవ్రంగా విమర్శించారు.

సంగారెడ్డిలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అధ్యక్షతన 'ఎస్ఐఆర్'పై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పడిన తర్వాత రాష్ట్రం చేసిన అప్పు రూ. 1,77,058 కోట్లు అని మంత్రి జూపల్లి కృష్ణారావు స్వయంగా తనకు లేఖ రాశారని తెలిపారు. అయితే, ఇదే అంశంపై నాలుగు నెలల క్రితం అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రం చేసిన అప్పు రూ. 3,45,294 కోట్లు అని చెప్పారని ఆయన గుర్తుచేశారు.ఒకే ప్రభుత్వంలోని మంత్రి ఒక లెక్క, ముఖ్యమంత్రి మరో లెక్క చెప్పడం గందరగోళానికి దారితీస్తోందని హరీశ్ రావు అన్నారు. అప్పుల విషయంలో ప్రభుత్వ పెద్దలు పరస్పర విరుద్ధ ప్రకటనలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఈ లెక్కల్లో ఏది నిజమో ప్రభుత్వం స్పష్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# ఎస్ఐఆర్ నిలిపేయండి

లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో పాటు 23 మంది విపక్ష నేతలు ఈ లేఖపై సంతకం చేశారు. ఎన్నికల ప్రక్రియలో ప్రజల అసలు తీర్పు ప్రతిబింబించడం లేదని ఆరోపించారు. స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికల సూత్రాలు దెబ్బతింటున్నాయని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియ రాజకీయ ఉద్దేశాలతో జరుగుతోందని విపక్షాలు ఆరోపించాయి. సరైన పత్రాలు లేని పేదలు, దళితులు, ఆదివాసీలు, మైనారిటీల ఓటు హక్కు ప్రమాదంలో పడుతోందని పేర్కొన్నాయి. లక్షలాది మంది నిజమైన ఓటర్లు జాబితాల నుంచి తొలగింపునకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశాయి.

పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల సమయంలో 27 లక్షల మంది ఓటర్ల పేర్లు తొలగించారని లేఖలో పేర్కొన్నారు. 'లాజికల్ డిస్క్రిపెన్సీస్' పేరుతో ఈ తొలగింపులు జరిగాయని తెలిపారు. ఒక న్యాయ ట్రైబ్యునల్ పరిశీలించిన 1,777 కేసుల్లో 1,717 తొలగింపులు తప్పుగా జరిగాయని గుర్తించినట్లు వెల్లడించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై కూడా ప్రజల్లో అనుమానాలు పెరుగుతున్నాయని విపక్షాలు తెలిపాయి. అవసరమైతే బ్యాలెట్ పేపర్ విధానాన్ని తిరిగి పరిశీలించాలని సూచించాయి. దీనిపై విస్తృత ప్రజా చర్చ జరగాలని కోరాయి. సీబీఐ, ఈడీ, ఎన్ఐఏ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలను విపక్షాలపై రాజకీయ అస్త్రాలుగా ఉపయోగిస్తున్నారని ఆరోపించాయి. ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసేలా వ్యవస్థలను వినియోగిస్తున్నారని పేర్కొన్నాయి. రాజ్యాంగ పరిరక్షణ బాధ్యత సుప్రీంకోర్టుదేనని లేఖలో పేర్కొన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు తక్షణ జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని సుప్రీంకోర్టును కోరారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను
# పరిశీలించిన డిఆర్వో

కడప, జూలై 3(భారత శక్తి ) : ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా జిల్లా రెవెన్యూ అధికారి మల్లికార్జునుడు శుక్రవారం కడప నగర పరిధిలోని కొండాయపల్లె స్వర్ణ వార్డు సచివాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్‌వోలు నిర్వహిస్తున్న కుటుంబ సభ్యుల ఓటరు వివరాల నమోదు, మ్యాపింగ్, ఎన్ రోల్మెంట్ ఫారాల ఫిల్లింగ్, డిజిటలైజేషన్ ప్రక్రియను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా నిర్వహించాలని బిఎల్ఓ లకు పలు సూచనలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో కడప ఆర్డీవో మురళి, కేఎంసి అధనపు కమిషనర్ రాకేష్ చంద్రం, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## పేద పిల్లలకు ప్రపంచ స్థాయి విద్య అందించడానికే
# ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ఏర్పాటు

మంత్రి మాట్లాడుతూ హుజుర్నగర్ నియోజకవర్గంలోని కొన్ని వేల మంది గ్రామీణ స్థాయి పిల్లలకు ప్రపంచ స్థాయి ఇంగ్లీష్ స్టాండర్డ్ బోర్డింగ్ హాస్టల్ సదుపాయంతో విద్యను అందించడానికి రూ. 250 కోట్ల రూపాయలతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు చేస్తున్నామని, ఇందులో 2,500 మందివిద్యార్థులు ఆహ్లాదకరమైన వాతావరణంలో చదువుకోవడానికి అన్ని వసతులు ఈ స్కూల్ లో ఏర్పాటు చేయడం జరిగినదని తెలిపారు. గుత్తందారులు, ఇంజనీర్లు నిరంతరం పనులు చేస్తున్నారని, అట్టి పనులు పరిశీలించడానికి ఇక్కడికి వచ్చానని వచ్చే సంవత్సరం 2027 నాటికి పనులు పూర్తయి,2027 అకాడమిక్ సంవత్సరంలో క్లాసులు ప్రారంభిస్తామని మంత్రి అన్నారు.సమావేశంలో హుజుర్నగర్ ఆర్డీవో శ్రీనివాసులు, ఇంచార్జ్ తాసిల్దార్ స్రవంతి, ఆర్ అండ్ బి ఎస్సి సీతారామయ్య, గుతేదారులు, ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.



# సంపాదకీయం

భారత శక్తి
VOICE OF INDIAN

## పార్లమెంట్‌లో వ్యూహాత్మకంగా కార్యాచరణ

2029 లోక్‌సభ ఎన్నికలకు ముందే డీలిమిటేషన్ బిల్లు, మహిళా రిజర్వేషన్ బిల్లుల ఆమోదింపజేసుకోవాలన్న కృతనిశ్చయంతో ఉంది కేంద్రం. రెండింటికి పార్లమెంట్‌లో ఆమోదం పొందేలా?ప్రభుత్వం వ్యూహాత్మకంగా కార్యాచరణను సిద్ధం చేస్తోంది. వర్షాకాల సమావేశాల్లో డీలిమిటేషన్ బిల్లును పునఃప్రవేశపెట్టేందుకు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ సన్నాహాలు చేస్తోంది. మహిళా కోటా విషయానికొస్తే.. 2023లో ఆమోదించిన మహిళా రిజర్వేషన్ చట్టం ప్రకారం.. పునర్విభజన తర్వాతే 33 శాతం కోటా అమల్లోకి రావాలి. ఎస్సీ, ఎస్టీ రిజర్వ్‌డ్ స్థానాల్లో కూడా వన్-థర్డ్ కోటాను మహిళలకు కేటాయించనున్నారు. దీంతో అదే దామాషాలో ఆయా వర్గాల మహిళలకూ లబ్ధి చేకూరుతున్నట్టే. 2023లో ఆమోదం పొందిన మహిళా రిజర్వేషన్ల బిల్లుతో లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు లభిస్తాయి. నియోజకవర్గాల పునర్విభజన కాకపోవడంతో ఈ చట్టం అమల్లోకి రాలేదు. నియోజకవర్గాల పునర్విభజనకు ముందుగానే ఈ చట్టాన్ని అమలు చేయాలంటే మరో రాజ్యాంగ సవరణ తప్పనిసరి. చట్టం ఏర్పడిన తర్వాత వచ్చే మొదటి జనాభా లెక్కల సేకరణ అనంతరం చేపట్టే నియోజకవర్గాల పునర్విభజన తర్వాతే మహిళలకు రిజర్వేషన్‌ను అమలుచేయాలని చట్టం నిర్దేశిస్తోంది. నియోజకవర్గాల పునర్విభజనకు అతీతంగా ఇది అమలు చేయాలంటే ఈ చట్టంలోని సెక్షన్ 5ని ప్రభుత్వం సవరించాల్సి ఉంటుంది. ఇది పార్లమెంట్ ఉభయ సభల్లో హాజరైన సభ్యుల్లో మూడింట రెండు వంతుల మంది ఆమోదంతోనే చట్ట సవరణ చేయాల్సి ఉంటుందని? రాజ్యాంగంలోని 368(2) అధికరణ నిర్దేశిస్తోంది.నియోజకవర్గాల పునర్విభజన జరగాలంటే పలు రాజ్యాంగ సవరణలు చేయాల్సి ఉంటుంది. అలా రాజ్యాంగ సవరణ కోసం ప్రవేశపెట్టే బిల్లులకు ఉభయ సభల్లో ప్రత్యేక మెజారిటీ అవసరం. సభలో సభ్యుల హాజరు సగానికిపైగా ఉండాలి. హాజరైన వారిలో మూడింట రెండు వంతుల మంది ఆ బిల్లుకు మద్దతు తెలుపాలి. అప్పుడే ఆ బిల్లు ఆమోదం పొందుతుంది. లోక్‌సభలో ప్రస్తుతం ఉన్న 540 మంది ఎంపీలు సభకు హాజరైతే.. వారిలో 360 మంది తప్పనిసరిగా బిల్లుకు మద్దతు తెలపాలి. లోక్‌సభలో ఆమోదం పొందిన బిల్లు రాజ్యసభ ముందుకు వస్తుంది. రాజ్యసభలో ప్రస్తుతం ఉన్న 244 మంది సభ్యులు సభకు హాజరైతే.. 163 మంది బిల్లుకు మద్దతు తెలపాలి. అప్పుడే ఆ బిల్లు రాష్ట్రపతి ఆమోదం అనంతరం చట్టంగా మారుతుంది. కానీ అధికార ఎన్డీయే కూటమికి ఉభయ సభల్లో ఇప్పుడు అంత బలం లేదు. అందుకే ఆ బలం కూడగట్టానికి రకరకాల రాజకీయ వ్యూహాలకు పదును పెడుతున్నారు.ఏప్రిల్‌లో మహిళా రిజర్వేషన్ ప్యాకేజీలో భాగంగా వచ్చిన డీలిమిటేషన్‌కు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో 54 ఓట్ల తేడాతో ఆమోదం పొందలేదు. అయితే తాజా రాజకీయ పరిణామాల తరుణంలో అదే బిల్లు మళ్లీ ప్రవేశపెడితే ఆమోదం పొందే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ప్రస్తుతం లోక్‌సభలో బలాబలాలు చూస్తే.. మొత్తం సభ్యుల సంఖ్య 543గా ఉంది. మూడు సీట్లు ఖాళీగా ఉన్నాయి. అంటే ప్రస్తుత సభ్యుల సంఖ్య 540 మాత్రమే. మూడింట రెండొంతుల మెజార్టీ అంటే 360 మంది మద్దతు కావాలి. ఎన్డీఏకు ప్రస్తుతం 318 మంది సభ్యులున్నారు. ప్రతిపక్షానికి 184 మంది సభ్యుల బలం ఉంది. ఇతరులు 38 మంది ఉన్నారు. బడ్జెట్ సమావేశాల్లో మహిళా రిజర్వేషన్, రాజ్యాంగ సవరణ బిల్లుల ఓటింగ్ సమయంలో 528 మంది సభ్యులు హాజరయ్యారు. అప్పుడు బిల్లు ఆమోదానికి 352 ఓట్లు అవసరమయ్యాయి. ఎన్డీయే కు అనుకూలంగా 298 ఓట్లు మాత్రమే రావడంతో 54 ఓట్ల తేడాతో బిల్లు ఆగిపోయింది. కానీ అప్పటికి, ఇప్పటికి పరిస్థితులు మారిపోయాయి. ప్రస్తుతం టీఎంసీ రెబల్ ఎంపీలు 20 మంది, ఉద్ధవ్ థాక్రే శివసేన ఎంపీలు ఆరుగురు కలిపి ఎన్డీఏ ఖాతాలోకి 26 ఓట్లు అదనంగా వస్తాయని అంచనా. అప్పుడు లోక్‌సభలో ఎన్డీఏ బలం 318 నుంచి 344కు పెరుగుతుంది.స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే కాంగ్రెస్‌తో విభేదాల తరుణంలో ఇండి కూటమికి దూరమైంది. ఇప్పటికే బీజేపీ డీఎంకేను ఎన్డీఏలోకి ఆహ్వానించిందనే ప్రచారం జరుగుతోంది. డీఎంకే ఎన్డీఏలో చేరకపోయినా.. లోక్‌సభలో ఎన్డీఏకు జై కొడితే.. ఆ పార్టీకి చెందిన 22 మంది ఎంపీల బలం కూడా జత కలుస్తుంది. అప్పుడు ఎన్డీఏ బలం ఏకంగా 344 నుంచి 366కు పెరుగుతుంది. ఇప్పటికే ఈ మేరకు స్టాలిన్ నుంచి హామీ ఉందని కూడా బీజేపీ వ్యూహాత్మకంగా ప్రచారం చేసుకుంటోంది. సరే ఇక్కడివరకు లోక్‌సభలో పరిస్థితి ఓకే. కానీ కీలకమైన రాజ్యసభ సంగతేంటి అనే ప్రశ్న వస్తుంది. రాజ్యసభలో రెండొంతుల మెజారిటీకి 164 మంది సభ్యుల మద్దతు అవసరం. ప్రస్తుతం ఎన్డీఏ దగ్గర 150 మంది సభ్యులు ఉన్నారు. ఇక్కడ కూడా డీఎంకేకు చెందిన 8 మంది సభ్యుల మద్దతు లభిస్తే సంఖ్య 158కు చేరుతుంది. అప్పుడు మరో ఆరుగురు సభ్యుల మద్దతు అవసరం అవుతుంది. అయితే వచ్చే సెషన్‌లో మహిళా, డీలిమిటేషన్ బిల్లులు వచ్చే సమయానికి.. ఏదో రకంగా ఈ బలం సమకూర్చుకోవచ్చనేది బీజేపీ ఆలోచనగా ఉంది. పైగా ఒక్కసారి బిల్లులు లోక్‌సభ ఆమోదం పొందితే.. రాజ్యసభలో అనుకోని విధంగా మద్దతు లభిస్తుందనే లెక్కలు కూడా లేకపోలేదు.ఇప్పటికే టీఎంసీ, శివసేన యూబీటీ నుంచి ఎంపీల్ని ఆకర్షించి మద్దతు కూడగట్టడంలో సఫలమైన బీజేపీ..ఇప్పుడు శరద్ పవార్ ఎన్సీపీ, నవీన్ పట్నాయక్ బిజూ జనతాదళ్, పంజాబ్‌లో ఆప్ మీద కూడా కన్నేసినట్టు చెబుతున్నారు. త్వరలో ఈ ఆపరేషన్లు కూడా కొలిక్కి వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. కొన్ని చిన్న పార్టీలతో చర్చలు పూర్తయ్యాయని, పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు మొదలయ్యాక విపక్షానికి మరిన్ని షాకులిచ్చే ఉద్దేశంతో బీజేపీ ఉందనే చర్చ జరుగుతోంది. ఏదే?నా ప్రస్తుతం హస్తిన వేదికగా రాజకీయ వ్యూహాలు జోరుగా సాగుతున్నాయి. నయానో భయానో ఎంపీల బలం పెంచుకోవటానికి బీజేపీ అన్ని ప్రయత్నాలు చేస్తోంది. కుదిరితే రాష్ట్ర స్థాయి నేతలు, పార్టీ సీఎంలు, అవసరమైతే అగ్రనేతలే నేరుగా రంగంలోకి దిగి పని పూర్తిచేయాలనే కార్యాచరణ సిద్ధమైంది. అన్నింటికీ మించి డీలిమిటేషన్ బిల్లును తిప్పికొట్టామనే ఆత్మవిశ్వాసంతో తొణికిసలాడుతున్న ప్రతిపక్ష కూటమిని నైతికంగా చావుదెబ్బ కొట్టాలనేది కాషాయ పార్టీ లక్ష్యంగా ఉంది. అందుకే ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు రాగానే రాజకీయ సమీకరణాలు మార్చే పని మొదలుపెట్టారనే అభిప్రాయాలు వస్తున్నాయి.లోక్ సభ నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించి కేంద్రం మరో ప్రతిపాదనను కూడా పరిశీలిస్తోంది. లోక్ సభ నియోజకవర్గాలను ప్రస్తుతం ఉన్న 543 నుంచి 824కి పెంచాలని ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి ఇప్పటికే సూచన చేసింది. . అంటే ప్రతీ రాష్ట్రంలో ఉన్న సీట్లలో మరో యాభై శాతం పెంచే బదులుగా?మరో కొత్త ఫార్ములాతో ఈ మండలి ప్రతిపాదనలు ఉండడం ఆసక్తిని పెంచుతోంది.

మూడో వంతు పార్లమెంట్ సీట్లను మాత్రమే పెంచాలని ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి సిఫార్సు చేసినట్లుగా తెలుస్తోంది. అంటే 170 పార్లమెంట్ నియోజకవర్గాలలోనే పునర్ విభజన ఉండనుంది. 59 పార్లమెంట్ నియోజకవర్గాలను రెండుగా విభజించాలని? మరో 111 సీట్లను మూడుగా చేయాలని మండలి సూచించినట్లు ప్రచారం జరుగుతోంది. మరి ఇప్పుడు వర్షాకాల సమావేశాల్లో పార్లమెంట్ ముందుకొచ్చే బిల్లు ఇలాగే ఉంటుందా.. మరేదైనా మార్పు చేస్తారా అనేది చూడాల్సి ఉంది.మోడీ ప్రధాని అయ్యాక పార్లమెంట్‌లో ఏ బిల్లు ఆమోదం విషయంలోనూ ఎన్డీఏ సర్కారు ఇబ్బంది పడలేదు. అందుకే రెండు నెలల క్రితం మహిళా రిజర్వేషన్ బిల్లు, డీలిమిటేషన్ బిల్లులు వచ్చినప్పుడు కూడా సర్కారు పకడ్బందీ ప్లాన్‌తోనే వచ్చుంటుందనే చర్చ జరిగింది. కానీ అధికార పక్షానికి షాకిస్తూ ఒక్కతాటిపైకి వచ్చిన విపక్షం.. ఆ రెండు బిల్లుల్ని తిప్పికొట్టింది. దీంతో ఎక్కడైనా అతివిశ్వాసానికి పోయామా అని ఎన్డీఏలో అంతర్గత చర్చ జరిగింది. ఆ సందర్భంగా పార్లమెంట్‌లో అనుసరించిన వ్యూహం.. విపక్షాల్ని ఎందుకు ఒప్పించలేకపోయామనే ప్రశ్నలకు సమాధానాలపై సమీక్ష జరిగింది. అప్పుడు జరిగిన పొరపాట్లు మరోసారి జరగకుండా.. అన్ని జాగ్రత్తలు తీసుకుని.. ఇంకా చెప్పాలంటే ప్లాన్ బీ కూడా రెడీగా పెట్టుకుని మరీ ఈసారి కేంద్రం రంగంలోకి దిగుతోందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.ఇక్కడ డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లుల మద్దతే అసలు ఉద్దేశం కాదు. ప్రధానంగా 2/3 వ వంతు మెజార్టీ కూడగట్టడమే అసలు లక్ష్యం. అప్పుడే ఈ బిల్లులతో పాటు భవిష్యత్తులో యూనిఫామ్ సివిల్ కోడ్ అయినా.. వన్ నేషన్ వన్ ఎలక్షన్ బిల్లులైనా సాఫీగా ఆమోదం పొందుతాయనేది బీజేపీ దూరాలోచనగా ఉంది. అందుకే ఈ లక్ష్యాన్ని తేలిగ్గా తీసుకోవటానికి కాషాయ పార్టీ సిద్ధంగా లేదు. ఈసారి విపక్షానికి పైచేయి సాధించే అవకాశం లేదని ఇప్పటికే జరుగుతున్న పరిణామాలు తేటతెల్లం చేస్తున్నాయి. ఓ రకంగా విపక్షాలే స్వయంగా తొలుత బీజేపీకి ఛాన్స్ ఇచ్చాయి. వచ్చిన అవకాశాన్ని రెండుచేతులా అందిపుచ్చుకోవటమే తమ కర్తవ్యమన్నట్టుగా బీజేపీ రాజకీయ వ్యూహరచన చేస్తోంది. ఇక్కడ రాజకీయ వ్యూహం, పార్లమెంట్‌లో అనుసరించాల్సిన వ్యూహాలపై ప్లానింగ్ సమాంతరంగా జరుగుతున్న పరిస్థితి కనిపిస్తోంది.

# భూ సర్వే ప్రక్రియలో రెవెన్యూ గ్రామాల హద్దుల నిర్ధారణతో సమస్యల పరిష్కారం

### - అమృత్ 2.0 పథక పనుల పరిశీలన - జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాల ప్రతినిధి, జులై 3 ( భారత శక్తి ): ప్రభుత్వ ఆదేశం ప్రకారం జిల్లాలో భూ సర్వే ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని, రెవెన్యూ గ్రామాల హద్దుల నిర్ధారణతో సమస్యల పరిష్కారానికి వెసులుబాటు కలుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని చెన్నూర్ మండలం కిష్టంపేట గ్రామంలో ఏర్పాటు చేసిన సమగ్ర భూ సర్వే అవగాహన సదస్సుకు మండల తహసిల్దార్ మల్లికార్జున్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి మోహన్ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూభారతి రెవెన్యూ సదస్సులలో వచ్చిన భూ సంబంధిత దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి రికార్డులను చూసి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ నేపథ్యంలో రికార్డులు, మోకా, పట్టాదారుల వివరాలు ఇతర అంశాలను పరిగణలోకి తీసుకొని ప్రభుత్వ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మొదటగా గ్రామంలోని భూములకు సంబంధించి హద్దులు నిర్ధారించడం జరుగుతుందని, తద్వారా గ్రామానికి సంబంధించిన భూమి స్పష్టత వస్తుందని, ప్రభుత్వ భూములు సైతం నిర్ధారణ అవుతాయని తెలిపారు. పట్టా కలిగి ఉండి మోకాపై లేకపోవడం, మోకాపై ఉండి పట్టా కలిగి ఉండకపోవడం అంశాలపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ప్రభుత్వం భూములను ఆక్రమించినట్లయితే చర్యలు తీసుకుంటామని తెలిపారు. భూ సర్వే సమగ్రంగా నిర్వహించి మ్యాపింగ్ చేయడం జరుగుతుందని,ఈ క్రమంలో భూ సమస్యలు తలెత్తినట్లయితే న్యాయపరమైన చర్యలకు సులభతరమవుతుందని, మ్యాపింగ్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ చర్యలలో భాగంగా నిబంధనల ప్రకారం సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేయడం జరుగుతుందని,న్యాయపరంగా రావలసిన భూమి అందుతుందని తెలిపారు.భూములలో కబ్జాదారుల జాబితా తయారు చేయడం జరుగుతుందని, పట్టా భూముల సర్వే అనంతరం రికార్డులను సరి చూసి సర్వే నెంబర్ల ప్రకారం హద్దుల నిర్ధారణ జరుగుతుందని, పట్టాలో ఒక సర్వే నెంబరు, మోకాలో ఒక సర్వే నెంబరు అంశాలపై మ్యాపింగ్ ప్రకారం పకడ్బందీగా చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. మ్యాపింగ్ తయారు తర్వాత మార్పులు కష్టతరమని, భవిష్యత్తులో వివాదాలు తలెత్తకుండా ప్రస్తుతం మోకాలో వినియోగిస్తున్న రోడ్డు (దారిని) సైతం మ్యాపింగ్ లో నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. సర్వేయర్లు, ప్రజల సహకారంతో సమస్యల పరిష్కారం వేగవంతం అవుతుందని తెలిపారు. మండలంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి అదనపు గదులు, భోజనశాల నిర్మాణ పనులను పరిశీలించి పనులు వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. వంటశాల, తరగతి గదులను పరిశీలించి విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలతో కూడిన ఆహారం అందించాలని, నాణ్యమైన విద్య అందించే దిశగా ఉపాధ్యాయులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు.

అనంతరం కోటపల్లి మండల కేంద్రంలో కొనసాగుతున్న అమృత్ 2.0 పథకం పనులను మండల తహసిల్దార్ రాఘవేంద్ర, మండల పరిషత్ అభివృద్ధి అధికారి నాగేశ్వర్ రెడ్డి లతో కలిసి సందర్శించి పనులు త్వరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో కొనసాగుతున్న అదనపు గదులు, భోజనశాల పనులను పరిశీలించి విద్యార్థులకు అందిస్తున్న మెనూ, విద్య బోధన తీరును పరిశీలించారు. మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి భూభారతి రెవెన్యూ సదస్సులను అందిన దరఖాస్తుల ప్రక్రియను పరిశీలించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి, రెవెన్యూ రికార్డులతో సరి చూసి దరఖాస్తులను త్వరగా పరిష్కరించే విధంగా కృషి చేయాలని అధికారులకు సూచించారు. వివిధ ధ్రువపత్రాల కొరకు కార్యాలయానికి వచ్చిన దరఖాస్తులను నిబంధనలకు లోబడి పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

# మత్తు వద్దు... ఉజ్వల భవిష్యత్తు ముద్దు

### - డీసీపీ ఏ.భాస్కర్

మంచిర్యాల ప్రతినిధి, జూలై 3 (భారత శక్తి): రామగుండం పోలీస్ కమిషనరేట్, మంచిర్యాల జోన్ పరిధిలోని తాండూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ బీసీ వెల్ఫేర్ బాలుర పాఠశాల, తాండూర్‌ను మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్ సందర్శించారు.ఈ సందర్భంగా విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడి వారి సమస్యలు, అవసరాలు, పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.విద్యార్థులను ఉద్దేశించి డీసీపీ మాట్లాడుతూ, గంజాయి,డ్రగ్స్‌తో పాటు ఇతర మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు.మత్తు పదార్థాల వల్ల వ్యక్తిగత జీవితం, కుటుంబం, సమాజంపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతుందని, అలాంటి అలవాట్లకు దూరంగా ఉంటూ మంచి భవిష్యత్తు కోసం కృషి చేయాలని అవగాహన కల్పించారు.విద్యార్థులకు ఏదైనా సమస్య ఎదురైనా లేదా ఇబ్బందులు ఉన్నా వెంటనే ఉపాధ్యాయులు, హాస్టల్ వార్డెన్ లేదా తల్లిదండ్రులకు తెలియజేయాలని సూచించారు.ఎవరికీ సమాచారం ఇవ్వకుండా పాఠశాల లేదా హాస్టల్ నుంచి వెళ్లిపోవడం వంటి తొందరపాటు నిర్ణయాలు ఎట్టి పరిస్థితుల్లోనూ తీసుకోరాదని హెచ్చరించారు. కష్టపడి చదువుకోవడం ద్వారానే ఉన్నత విద్యను అభ్యసించి మంచి ఉద్యోగాలు సాధించవచ్చని, తద్వారా ఆర్థికంగా ఎదగడంతో పాటు సమాజంలో గౌరవం,గుర్తింపు పొందవచ్చని తెలిపారు. విద్యార్థులు తమ విజయాలతో తల్లిదండ్రులు, పాఠశాల, స్వగ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి ఏసీపీ ఎస్.వి. కిరణ్ కుమార్, తాండూర్ సీఐ దేవయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.






# పారదర్శక ఓటర్ల జాబితాయే లక్ష్యం!

- బడంగ్‌పేట్ సర్కిల్ కార్యాలయంలో ముమ్మర సవరణపై అవగాహన సదస్సు.
- అర్హులందరికీ ఓటు హక్కు కల్పించడమే ధ్యేయం;
- కాలనీ సంఘాలు, పొదుపు మహిళల భాగస్వామ్యంతోనే 'నిష్పాక్షిక' జాబితా రూపకల్పన.




బడంగ్‌పేట్, జూలై 3: భారత శక్తి, బడంగ్‌పేట్ సర్కిల్ పరిధిలో ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించేందుకు సర్కిల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శుక్రవారం ఒక ముఖ్యమైన అవగాహన సదస్సు నిర్వహించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే ధ్యేయంగా సాగుతున్న ఈ సవరణ ప్రక్రియపై అధికారులకు, వివిధ సంఘాల ప్రతినిధులకు ఈ సమావేశంలో దిశానిర్దేశం చేశారు.

### - తప్పుల్లేని జాబితాకు కసరత్తు

ఈ అవగాహన సదస్సుకు ఉప ముఖ్య ఎన్నికల అధికారి జయచంద్ర రెడ్డి, రెవెన్యూ డివిజనల్ అధికారి జగదీశ్వర్ రెడ్డి, ఉప కమిషనర్ వి.సమ్మయ్య, ఉప తహశీల్దార్ నరేష్ హాజరై, సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై క్షుణ్ణంగా వివరించారు. క్షేత్రస్థాయిలో ఓటర్ల నమోదు/గణన పత్రాలను ఎటువంటి తప్పులు లేకుండా ఏ విధంగా భర్తీ చేయాలో అధికారుల బృందం సిబ్బందికి ప్రాక్టికల్‌గా వివరించింది.




### - కాలనీ అసోసియేషన్లు, పొదుపు సంఘాలదే కీలక పాత్ర

స్థానిక కాలనీలలో అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు లభించేలా మరియు ఓటర్ల జాబితా నిష్పాక్షికంగా ఉండేలా చూసేందుకు కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, పొదుపు సంఘాల మహిళలు క్రియాశీలక పాత్ర పోషించాలని అధికారులు పిలుపునిచ్చారు. ప్రస్తుతం క్షేత్రస్థాయిలో కొనసాగుతున్న గణన పత్రాల పంపిణీ ప్రక్రియపై సమావేశానికి హాజరైన వారి నుంచి అధికారులు ఫీడ్‌బ్యాక్ (అభిప్రాయాలు) సేకరించారు. ఈ ప్రక్రియలో ఎలాంటి లోపాలు లేకుండా చూసేందుకు తమ పూర్తి సహకారాన్ని అందించాలని కోరారు.

### - పెద్ద సంఖ్యలో హాజరైన ప్రతినిధులు

ఈ సమన్వయ సమావేశానికి స్వయం సహాయక బృందాల (పొదుపు సంఘాల) సభ్యులు, బడంగ్‌పేట్ పరిధిలోని వివిధ కాలనీల సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ప్రజాస్వామ్యానికి పునాది అయిన ఓటు హక్కు నమోదు ప్రక్రియను, ఈ సవరణ కార్యక్రమాన్ని బాధ్యతగా విజయవంతం చేయాలని అధికారులు ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# మా జీవితం ప్రజాసేవకు అంకితం

### - ఎర్రబెల్లి ఉషా దయాకర్ రావు.




జనగామ(భారత శక్తి)జులై 3: శుక్రవారం పాలకుర్తి మండల కేంద్రంలో నేడు సొంత నిలయం, పార్టీ కార్యాలయం కు భూమి పూజ కార్యక్రమాన్ని శాస్త్రోక్తం నిర్వహించిన ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉషా దయాకర్ రావు అన్నారు. పాలకుర్తిని వదిలి పెట్టే ప్రసక్తే లేదు, ప్రజల మధ్యే ఉంటాం తెలిపారు.పార్టీ కార్యాలయం, సొంత నిలయం రెండూ పాలకుర్తి మండల కేంద్రంలోనే నిర్మిస్తున్నాం అని అన్నారు.ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తున్నాం అని తెలిపారు.పాలకుర్తి ప్రజలతో మా బంధం రాజకీయాలకు అతీతం వారి ప్రేమ, ఆదరణే మా బలంప్రతి కార్యకర్తకు అండగా, ప్రతి కుటుంబానికి తోడుగా నిలవడమే మా లక్ష్యం ప్రజాసేవే మా ధ్యేయం – పాలకుర్తి అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తాం అన్నారు.పాలకుర్తి నుంచే పార్టీ కార్యక్రమాలు, ప్రజాసేవా కార్యక్రమాలు మరింత విస్తృతంగా కొనసాగిస్తాం అన్నారు.ఈ కార్యక్రమంలోబీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, యువజన నాయకులు సోషల్ మీడియా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు బడంగ్‌పేట్ సర్కిల్ కార్యాలయంలో ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (SIR) అవగాహన సమావేశం

బడంగ్‌పేట్, జూలై 3 : బడంగ్‌పేట్ సర్కిల్ పరిధిలో ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (Special Intensive Revision - SIR) కార్యక్రమంపై నేడు (శుక్రవారం, జూలై 3, 2026) బడంగ్‌పేట్ సర్కిల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఒక ముఖ్యమైన అవగాహన సమావేశం విజయవంతంగా నిర్వహించబడింది .ఈ సమావేశానికి గౌరవ డిప్యూటీ సీఈఓ (Dy.CEO) జయచంద్ర రెడ్డి, ఆర్డీఓ (RDO) జగదీశ్వర్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ వి.సమ్మయ్య మరియు డిప్యూటీ తహశీల్దార్ నరేష్‌లు ముఖ్య అతిథులుగా హాజరై, అధికారులకు మరియు ప్రతినిధులకు దిశానిర్దేశం చేశారు

.ఈ సమావేశం ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (SIR) కార్యక్రమం ఎలా నిర్వహించాలి మరియు క్షేత్రస్థాయిలో ఎన్యుమరేషన్ ఫారాలను (Enumeration Forms) ఎటువంటి తప్పులు లేకుండా ఏ విధంగా భర్తీ చేయాలో అధికారుల బృందం సమావేశంలో పాల్గొన్న వారికి క్షుణ్ణంగా వివరించారు.

స్థానిక కాలనీలలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా, ఓటర్ల జాబితా నిష్పాక్షికంగా ఉండేలా చూసేందుకు కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు, పొదుపు సంఘాల మహిళలు క్రియాశీలక పాత్ర పోషించాలని మరియు ఈ ఎన్యుమరేషన్ ప్రక్రియను విజయవంతం చేయడానికి తమ పూర్తి సహకారాన్ని అందించాలని అధికారులు కోరారు. ఇప్పటికే క్షేత్రస్థాయిలో జరుగుతున్న ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ ప్రక్రియపై సమావేశానికి హాజరైన వారి నుండి ఫీడ్‌బ్యాక్ స్వీకరించడమైనది.

ఈ సమన్వయ సమావేశానికి ఎస్‌హెచ్‌జీ (SHG) గ్రూపుల పొదుపు సంఘాల సభ్యులు మరియు బడంగ్‌పేట్ పరిధిలోని కాలనీల అసోసియేషన్ ప్రతినిధులు (Colony Association Members) పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

స్థానిక కాలనీలలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా, ఓటర్ల జాబితా నిష్పాక్షికంగా ఉండేలా చూసేందుకు కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు, పొదుపు సంఘాల మహిళలు క్రియాశీలక పాత్ర పోషించి ఈ సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

# జనగామలో ఊరడమ్మ తల్లి ప్రతిష్ఠాపన, కళ్యాణ మహోత్సవం

**బోనాల వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ రాష్ట్ర యువజన నాయకుడు మహమ్మద్ ఇలియాస్**



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) జులై 03: కామారెడ్డి జిల్లా బీబీపేట్ మండలం జనగామ గ్రామంలో ఊరడమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన, కళ్యాణ మహోత్సవం, బోనాల పండుగ వేడుకలు శుక్రవారం భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన నాయకుడు మహమ్మద్ ఇలియాస్ ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహమ్మద్ ఇలియాస్ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ ఒక విశిష్టమైన గుర్తింపు అని అన్నారు. గ్రామ దేవతల ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. గ్రామాల్లో నిర్వహించే ఇటువంటి ఆధ్యాత్మిక, సాంస్కృతిక వేడుకలు సామాజిక ఐక్యతను, పరస్పర సోదరభావాన్ని మరింత బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు మహమ్మద్ ఇలియాస్‌ను ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, మండల కాంగ్రెస్ నాయకులు పాత రాజు, సుతారి రమేష్, ఇంద్రసేనారెడ్డి, మట్ట శీను, ఆశ బోయిన శ్రీనివాస్, అనంత్ రెడ్డి, సంజీవ్, శ్రీకాంత్, సంతోష్ రెడ్డి, నరేందర్ రెడ్డి, బల్యాల సుదర్శన్, ఐరేని సందీప్, వెంకటేష్, తుడుం ప్రదీప్, జీవన్, శంకర్, లింగారెడ్డి, లక్కపతిని గంగాధర్, భరత్ టింకు, డేవిడ్, విలియం, సోహెల్ తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జులై 10న రాష్ట్ర వ్యాప్త విద్యాసంస్థల బంద్




కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) జులై 03: విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఌ2026 జూలై 10న తెలంగాణ రాష్ట్ర వ్యాప్త విద్యాసంస్థల బంద్ఌ ను జయప్రదం చేయాలని కోరుతూ వామపక్ష విద్యార్థి సంఘాల ఐక్య కార్యాచరణ తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. జూలై 10న జరుగు విద్యాసంస్థల బంద్ఌ ను విద్యార్థులు, ప్రభుత్వ, ప్రైవేటువిద్యాసంస్థలు, ప్రజాస్వామికవాదులు, అన్ని వర్గాల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరుతూ కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఆర్ అండ్ బి అతిథి గృహంలో వామపక్ష విద్యార్థి సంఘ నాయకుల ముఖ్య సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,

1) తెలంగాణ రాష్ట్రంలో 27 వేల ప్రభుత్వ పాఠశాలల మూసివేతను విరమించుకోవాలి, ప్రభుత్వ విద్య వ్యవస్థను బలోపేతం చేయాలి.
2) ప్రైవేట్ , కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజులను నియంత్రిస్తూ సమగ్ర చట్టం రూపొందించాలి.
3) పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్, ఫీజు రియంబర్స్మెంట్, బెస్ట్ అవైలబుల్ స్కిం బకాయిలను తక్షణమే విడుదల చేయాలి.
4) విద్యా హక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి.
5) ప్రభుత్వ నియమ, నిబంధనలు పాటించని ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలను మూసివేయాలి.
6) విద్య రంగానికి అధిక నిధులు కేటాయించాలి.
7) మెగా డీఎస్సీ నోటిఫికేషన్ వేసి ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను శాశ్వత ప్రతిపాదికన భర్తీ చేయాలి.
8) ప్రభుత్వ విద్యా సంస్థల్లో మౌలిక వసతులు కల్పించాలి.

ఈ కార్యక్రమంలో పిడిఎస్యూ, రాష్ట్ర కార్యదర్శి జి. సురేష్, ఏఐఎఫ్డిఎస్ రాష్ట్ర కార్యదర్శి జబ్బర్, ఏఐఎస్ఎఫ్ కామారెడ్డి ఏరియా అధ్యక్ష కార్యదర్శులు శివ, సంపత్, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు నితిన్, ఏ ఐ ఎస్ బి జిల్లా నాయకులు నిఖిల్ గౌడ్, రోహిత్, పిడిఎస్యూ జిల్లా నాయకులు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# వేములవాడలో భారీ వర్షం.

**-గంటకు పైనుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం.**

రాజన్న సిరిసిల్ల, భారత శక్తి, జూలై 03:వేములవాడ పట్టణంతో పాటు పరిసర గ్రామాల్లో శుక్రవారం గంటకు పై నుండి భారీ వర్షం కురుస్తుంది. ఒక్కసారిగా కుండపోతగా వాన పడటంతో ప్రధాన రహదారులు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలుచోట్ల వర్షపు నీరు రోడ్లపై నిలిచి వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మరోవైపు ఈ వర్షంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తూ సాగు పనులను వేగవంతం చేస్తున్నారు. అధికారులు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# బోడుప్పల్ సర్కిల్‌లో నూతన వెయింగ్ బ్రిడ్జిని ప్రారంభించిన మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్



మేడిపల్లి, భారత శక్తి ప్రతినిధి, జూలై 03:బోడుప్పల్ సర్కిల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన వెయింగ్ బ్రిడ్జిని మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా తోటకూర అజయ్ యాదవ్ మాట్లాడుతూ, ఆధునిక సాంకేతికతతో ఏర్పాటు చేసిన ఈ వెయింగ్ బ్రిడ్జి రవాణా, పారిశ్రామిక రంగాలకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. ఇటువంటి సంస్థల ఏర్పాటుతో స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి కూడా దోహదపడుతుందని పేర్కొన్నారు. సంస్థ యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రజలకు నాణ్యమైన సేవలు అందిస్తూ సంస్థ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గం బి-బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, బోడుప్పల్ డివిజన్ అధ్యక్షుడు బొమ్మకు కళ్యాణ్, మాజీ కార్పొరేటర్లు రసాల వెంకటేష్ యాదవ్, చీరాల నరసింహ, కుంభం కిరణ్ కుమార్ రెడ్డి, గుర్రాల వెంకటేష్ యాదవ్, తోటకూర రవీందర్ యాదవ్, వల్లపు ఐలేష్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, సంస్థ యాజమాన్యం, ప్రముఖులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ప్రజల సహకారంతో పారదర్శకంగా భూ సర్వే పూర్తి చేయాలి.

**-నాడు ఇందిరమ్మ ఇళ్ల పైలెట్ గ్రామం..నేడు లింగాల గ్రామం నుంచి భూ సర్వేకు శ్రీకారం.-ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**




రేగొండ,జులై 3 (భారత శక్తి): రైతుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం చేపడుతున్న భూ సర్వే ప్రజల సహకారంతో పారదర్శకంగా అది సంబంధిత అధికారులు పూర్తి చేయాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. కాంగ్రెస్ ప్రజా పాలన ప్రభుత్వంలో అర్హులైన వేదింటి వారి కలలు నిజం చేసే ఇందిరమ్మ ఇళ్ల పథకంలో నియోజకవర్గంలో లింగాల పైలెట్ గ్రామంగా ఎంపిక కావడం, తిరిగి భూ సర్వేకు లింగాల ఎంపిక కావడం లింగాల గ్రామ ప్రజలు, రైతులు సర్పంచి మొర్రి సురేష్ ఎమ్మెల్యే గండ్రకు ముందుగా అభినందనలు తెలిపారు. రేగొండ మండలం లింగాల గ్రామంలో శుక్రవారం నిర్వహించిన రెవిన్యూ భూ సర్వే అవగాహన సమావేశంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రేగొండ మండలంలో మొట్టమొదటగా ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ లింగాల గ్రామంలోనే జరిగిందని, ఇప్పుడు భూ సర్వే కార్యక్రమానికి కూడా లింగాలనే ఎంపిక చేయడం సంతోషకరమని ఎమ్మెల్యే గండ్ర అన్నారు. ఈ గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. భూ సర్వే కార్యక్రమంలో గ్రామ ప్రజలు పూర్తిస్థాయిలో సహకరించాలని, ఏవైనా సమస్యలు లేదా సందేహాలు ఉంటే సంబంధిత రెవెన్యూ అధికారులు, సర్పంచ్ దృష్టికి తీసుకువచ్చి సర్వేను పారదర్శకంగా, విజయవంతంగా పూర్తి చేసుకోవాలని సూచించారు. అలాగే భూపాలపల్లి నియోజకవర్గంలోని రేగొండ మండలంలో ఉన్న కొడవటంచ గ్రామ దేవాలయాన్ని మరో యాదాద్రి లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం తరహాలో అభివృద్ధి చేసే దిశగా చర్యలు చేపడుతున్నామని ఎమ్మెల్యే గండ్ర వెల్లడించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మొర్రి సురేష్ , తాసిల్దార్ శ్వేతా రావు, ఎంపీడీవో యం వెంకటేశ్వర్ రావు, జిల్లా ఏడి కుసుమ కుమారి, మార్కెట్ కమిటీ చైర్మన్ గూటోజు కిష్టయ్య, కోటంచ ఆలయ చైర్మన్ నాయినేని సంపత్ రావు, డిప్యూటీ తాసిల్దార్ మహమ్మద్ రజాక్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ ( ఆర్ ఐ) బొమ్మకంటి వెంకటేశ్వర్లు, సబ్ ఇన్స్పెక్టర్ హేమలత, సంబంధిత అధికారులు, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు ఇప్పకాయల నరసయ్య, టౌన్ అధ్యక్షులు ఏనుగు రవీందర్ రెడ్డి, పున్నం రవి, కేసిరెడ్డి ప్రతాపరెడ్డి, కోసరి నరేందర్, బండి మల్లయ్య, రైతులు వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# భైంసాలో ప్రత్యేక ఎన్యూమరేషన్, పంపిణీ కేంద్రాల తనిఖీ

**ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వేగంగా సేవలు అందించాలి: సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్**



నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూలై 03(భారత శక్తి ): భైంసా పట్టణంలో ఏర్పాటు చేసిన రెండు ప్రత్యేక ఎన్యూమరేషన్ (గణన/సర్వే) మరియు పంపిణీ కేంద్రాలను శుక్రవారం భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్ ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. కేంద్రాల్లో జరుగుతున్న గణన, పంపిణీ ప్రక్రియను క్షుణ్ణంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కేంద్రాలకు వచ్చిన ఓటర్లతో సబ్ కలెక్టర్ నేరుగా మాట్లాడి, వారికి అందుతున్న సేవలు, ఎదురవుతున్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఓటర్‌కు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, సకాలంలో సేవలు అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. పంపిణీ ప్రక్రియలో ఎలాంటి జాప్యం చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలని, ప్రతి ఓటర్‌కు వేగంగా సేవలు అందేలా కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు సౌకర్యవంతమైన వాతావరణంలో సేవలు అందించడంతో పాటు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని పేర్కొన్నారు. ఈ తనిఖీలో స్థానిక రెవెన్యూ అధికారులు, ఎన్యూమరేషన్ సిబ్బంది పాల్గొనగా, కేంద్రాలకు వచ్చిన ప్రజలు తమ వివరాలను నమోదు చేసుకుని సేవలను పొందారు.

# కల్లుగీత కార్మికులకు 'కాటమయ్య రాక్ష'కిట్లను పంపిణీ చేసిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి.



జనగామ జిల్లా(భారత శక్తి)జులై 3: తెలంగాణ రాష్ట్రంలో కల్లుగీత కార్మికుల(గౌడ సోదరులు)రక్షణ కోసం ఉద్దేశించిన 'కాటమయ్య రక్ష'కిట్లను వివిధ జిల్లాల్లో ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు పంపిణీ చేశారు. అందులో భాగంగానే పాలకుర్తి మండలకేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి దేవరుప్పుల మండల గీత కార్మికులకు 'కాటమయ్య రక్ష' కిట్లను దేవరుప్పుల గ్రామ సర్పంచ్ పెద్ది కృష్ణమూర్తి గౌడ్ సమక్షంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు కారు పోతుల యాదయ్య, లబ్ధిదారులు కారుపోతుల పాపయ్య, రాములు, రాజు, మహేష్, సతీష్, మహేందర్, దర్గయ్య, ఆకుల వెంకటయ్య, లక్ష్మయ్య, బబ్బూరి కిష్టయ్య, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

# నూతన మండల పార్టీ అధ్యక్షులు పెసరు రమేష్ ను కలిసి శుభాకాంక్షలు తెలిపిన మండల యూత్ కాంగ్రెస్ నాయకులు.



జనగామం(భారత శక్తి)జులై 3: ధర్మసాగర్ మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షులుగా నియమితులైన పెసరు రమేష్ ను వారి నివాసంలో మండల యూత్ కాంగ్రెస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి శాలువతో సన్మానించి పూల మొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ బలోపేతం కోసం పనిచేయడంలో మీ యూత్ కాంగ్రెస్ సహకారం చాలా ఉంటుంది అని పార్టీ కార్యక్రమాల్లో మండల కమిటీ కి యూత్ కాంగ్రెస్ నాయకులు ఎల్లప్పుడూ సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు అడిగొప్పుల ప్రవీణ్, కాంగ్రెస్ పార్టీ మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ రాజారపు ప్రశాంత్, తాటికాయల గ్రామ ఉప సర్పంచ్ పెసరు శివ మరియు యూత్ కాంగ్రెస్ నాయకులు కోతి సాంబరాజు, వక్కల సుమన్, ఎండీ ముజ్జు, బోల్లం సాంబరాజు, కృష్ణ, కొలిపాక రాజేష్, రఘుపతి రెడ్డి, నక్క సిద్దు, రొండి రోహిత్, సుమన్, సతీష్, అలీ తదితరులు పాల్గొన్నారు.

# బ్యాంకులో డబ్బులు లేవు... కుర్చీల్లో సిబ్బంది లేరు.

**- కోనరావుపేట యూనియన్ బ్యాంకులో రైతుల అరిగోస!**
**- రైతులపై మేనేజర్ యాదగిరి దురుసు ప్రవర్తన...**
**- గంటల తరబడి పడిగాపులు కాస్తున్న వృద్ధులు, మహిళలు!**




భారత శక్తి న్యూస్, రాజన్న సిరిసిల్ల, జూలై 03: కష్టపడి పండించిన వడ్ల పైసలు చేతికొచ్చాయన్న సంతోషం ఆ రైతన్నల్లో ఎంతోసేపు నిలవలేదు. బ్యాంకుకు వెళ్తే రూపాయి చేతికి అందక, అడిగితే సమాధానం చెప్పే నాథుడు లేక కోనరావుపేట మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంకులో రైతులు, వృద్ధులు, మహిళలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇటీవలే వడ్ల డబ్బులు బ్యాంకు ఖాతాల్లో జమ కావడంతో, వాటిని విత్‌డ్రా చేసుకునేందుకు శుక్రవారం భారీ సంఖ్యలో ఖాతాదారులు బ్యాంకుకు చేరుకున్నారు. అయితే, తీరా బ్యాంకు లోపలికి వెళ్లాక "డబ్బుల కొరత ఉంది" అంటూ సిబ్బంది చేతులెత్తేయడంతో రైతులు షాక్‌కు గురయ్యారు. మధ్యాహ్నం 12:30 గంటల సమయానికే బ్యాంకులో కనీసం సిబ్బంది కూడా సీట్లలో లేకపోవడం గమనార్హం. కుర్చీలన్నీ ఖాళీగా దర్శనమిస్తుండడంతో "అసలు స్టాఫ్ అంతా ఎటు వెళ్లారు?" అని ఖాతాదారులు ప్రశ్నిస్తే, అక్కడ ఉన్న కొద్దిమంది సిబ్బంది "ఏమో చూడు" అంటూ అత్యంత బాధ్యతారాహిత్యంగా, నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడం గమనార్హం. దూరప్రాంతాల నుండి ఆశతో వచ్చిన వృద్ధులు, మహిళలు, రైతులు బ్యాంకు చుట్టూ గంటల తరబడి పడిగాపులు కాస్తున్నారు. తమ సమస్యను చెప్పుకుందామని వెళ్లిన ఖాతాదారుల పట్ల బ్యాంకు మేనేజర్ యాదగిరి అత్యంత దురుసుగా, అహంకారంతో ప్రవర్తిస్తున్నాడని బాధితులు కన్నీరుమున్నీరవుతున్నారు. కనీస మర్యాద లేకుండా, కష్టమర్లను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్న ఈ మేనేజర్ తీరుపై స్థానికంగా తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రైతులకు, వృద్ధులకు సేవలు అందించాల్సిన బ్యాంకు అధికారులు.. ఇలా ఇష్టారాజ్యంగా వ్యవహరించడంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి, కోనరావుపేట యూనియన్ బ్యాంకులో నెలకొన్న నగదు కొరతను తీర్చడంతో పాటు, ఖాతాదారులను మానసిక క్షోభకు గురిచేస్తున్న మేనేజర్ యాదగిరిపై, విధులను నిర్లక్ష్యం చేసిన సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని మండల రైతాంగం, ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# పేదలకు అండగా - సంధిపూడి హెల్పింగ్ హేండ్స్ యువకులు.

**- ప్రతినెల ఒక నిరుపేద కుటుంబానికి నిత్యావసర సరుకులు అందజేత**




ఆలమూరు,భారత శక్తి ప్రతినిధి, జూలై 03: ఆలమూరు మండల పరిధిలోని సంధిపూడి గ్రామానికి చెందిన కొంతమంది యువకులు హెల్పింగ్ హాండ్స్ఌ పేరున ప్రతీ నెల ఒక నిరుపేద కుటుంబానికి నిత్యవసర సరుకులు పంపిణీ చేస్తున్నారు. 3500 /- రూపాయలు విలువచేసే నిత్యవసర సామాగ్రి నిరుపేద కుటుంబాలకు అందిస్తున్న యువకులను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలి. ప్రతి గ్రామంలో యువకులు ఇటువంటి కార్యక్రమాలు చేపడితే నిరుపేదలకు అండగా ఉండవచ్చు. అలాగే ఇలాంటి యువకులు దేశానికి ఆదర్శం. దీనిలో భాగంగా ఈనెల ఉంగరాల సత్యవతి,అన్నదేవుల నాగమణి కుటుంబాలకు నిత్యవసర వస్తువులు సామాగ్రిని అందజేశారు. గ్రామంలో ప్రతి నిరుపేద కుటుంబానికి అండగా ఉంటామని యువత తెలియజేశారు. ఈ మేరకు హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులను పలువురు గ్రామస్తులు అభినందించారు.

## ప్రజల సమస్యలు మా దృష్టికి తీసుకురండి తీరుస్తాం

### ఎంపీడీవో ఉపేందర్ రెడ్డి తాసిల్దార్ విజయ్ కుమార్



**(భారత శక్తి)**పోరుమామిళ్ల పోరుమామిళ్ల మండలంలోని శుక్రవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి మండల అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొని మండలంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి అన్ని శాఖల అధికారులు వివరించడం జరిగింది ఇందులో భాగంగా ఎమ్మార్వో విజయ్ కుమార్ మాట్లాడుతూ ఎస్ ఐ ఆర్ లో భాగంగా ప్రతి సచివాలయంలో ఒక హెల్ప్ లైన్ సెంటర్ ను ఏర్పాటు చేస్తామని ఏమైనా సమస్యలు ఉంటే మా దృష్టికి తేవాలని తెచ్చిన వాటిని వెంటనే పరిష్కరిస్తామని ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు అంతేకాకుండా పోరుమామిళ్ల మండలంలోని రెవెన్యూ సమస్యలు ఏమైనా ఉన్న మా దృష్టికి తేవాలని ఆయన తెలిపారు ఎంపీడీవో ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు బాధ్యతాయుతంగా పనిచేసి మండలానికి మంచి పేరు తేవాలని ప్రజలు కూడా అన్ని శాఖల అధికారులకు సహకరించాలని వారు తెలిపారు జెడ్పీటిసి ముత్యాల ప్రసాద్ మరియు వైస్ ఎంపీపీ సీఎం భాష గారి ద్వారా కూడా సుమారు మూడు కోట్ల రూపాయలు వారి ఐదు సంవత్సరాల తెప్పించి ఇవ్వడం జరిగిందని వారు తెలిపారు డాక్టర్ జయరాం మాట్లాడుతూ ప్రస్తుతం వస్తున్న సీజనల్ వ్యాధులకు అప్రమంతంగా ఉండాలని ఎవరికైనా జరాలు వస్తే భయపడవద్దని అవి వైరల్ ఫీవర్ మాత్రమే అని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో పంచాయతి రాజ్ ఏఈ ప్రతాప్ , వెటర్నరీ డాక్టర్ భరద్వాజ్ , ఆర్ బ్ల్యూఎస్ ఓబయ్య, ఏవో చంద్రమోహన్, కరెంటు ఏఈ మహేష్, ఇరిగేషన్ ఏఈ సృజన, ఐ సి డి సి ఐ సిడిపిఓ లక్ష్మి, మండల సర్వేర్ సందీప్ రెడ్డి, ఎంపీడీవో ఆఫీస్ ఏవో రమణ, ఆర్ఐ సుధాకర్ రెడ్డి , రంగసముద్రం ఈఓ ప్రసాద్ రెడ్డి , ఎంపీటీసీలు రవి, ఎంఈఓ ఓబులేసు , పంచాయతీ సెక్రటరీలు మాబురెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు

## రంపచోడవరంలో నేడు జనసేన సమావేశం

### ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ నాగబాబు



**(భారత శక్తి)**రంపచోడవరం దేవీపట్నం జనసైనికులకు మండల అధ్యక్షుడి పిలుపు రంపచోడవరం కేంద్రంగా శనివారం, జూలై 4న జనసేన పార్టీ సమాచార సేకరణ కమిటీ సమావేశం జరగనుంది. ఈ కార్యక్రమానికి జనసేన పార్టీ ఎమ్మెల్సీ, అగ్ర నేత కొణిదెల నాగబాబు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ సందర్భంగా దేవీపట్నం మండల జనసేన పార్టీ అధ్యక్షులు చారపు వెంకటరాయుడు ఒక ప్రకటన విడుదల చేశారు. మండలంలోని జనసేన నాయకులు, జనసైనికులు, వీరామహిళలు అందరూ శనివారం ఉదయం 9 గంటలకు రంపచోడవరం ఆర్కా రెస్టారెంట్ వద్దకు చేరుకోవాలని కోరారు. సామాన్య కార్యకర్త నుంచి నాయకులుగా ఎదిగేందుకు మన అధినేత పవన్ కళ్యాణ్ గారు గొప్ప అవకాశం కల్పించారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలి. సమావేశానికి వచ్చే వారు పార్టీ సభ్యత్వ ఐడి కార్డు, ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో, పార్టీ కార్యక్రమాల్లో పాల్గొన్న ఆధారాలను తప్పనిసరిగా వెంట తెచ్చుకోవాలి" అని వెంకటరాయుడు తెలిపారు. రేపు 04-07-2026 శనివారం ఉదయం 9 గంటలకు రంపచోడవరం ఆర్కా రెస్టారెంట్‌లో జనసేన సమాచార సేకరణ కమిటీ సమావేశం. దేవీపట్నం మండల జనసైనికులు, నాయకులు, వీరామహిళలు అందరూ హాజరుకావాలి.

## వనపర్తి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిద్దాం.

### ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి.



**వనపర్తి.(భారత శక్తి)** పట్టణంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో వచ్చే ఏడాది మార్చి నెలలో నిర్వహించనున్న బ్రహ్మోత్సవాలను కనీవినీ ఎరుగని రీతిలో అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి తెలిపారు.శుక్రవారం వనపర్తి వెంకటేశ్వర స్వామి ఆలయంలో దాదాపు ఏడు కోట్ల రూపాయలతో చేపట్టిన అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు.ఈ బ్రహ్మోత్సవాలు కేవలం ఆధ్యాత్మిక వేడుకలుగా మాత్రమే కాకుండా, వనపర్తి పట్టణ ప్రతిష్టను చాటిచెప్పే 0మహోత్సవాలుగా నిలిచేలా అన్ని వర్గాల ప్రజల భాగస్వామ్యంతో నిర్వహించాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.భక్తి భావం, సేవా తత్పరత కలిగిన పెద్దలు, రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు, ప్రముఖులు, ఉద్యోగస్తులు, అధికారులు, అనధికారులు, యువత, మహిళలు సహా ప్రతి ఒక్కరూ ఈ మహోత్సవాల్లో భాగస్వాములు కావాలని ఆయన ఆకాంక్షించారు.

ఈ బ్రహ్మోత్సవాలకు రాష్ట్ర ముఖ్య ఎనుముల రేవంత్ రెడ్డి దంపతులు హాజరయ్యే అవకాశముందని ఎమ్మెల్యే తెలిపారు.ఇప్పటికే ఆలయ అభివృద్ధి కోసం రూ.6 కోట్లకు పైగా నిధులతో వివిధ అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని వెల్లడించారు.వచ్చే మార్చిలో బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్న నేపథ్యంలో మనకు ఇంకా సుమారు ఏడు నెలల సమయం ఉన్నందున ప్రతి నెలా ఒక సమీక్షా సమావేశం నిర్వహిస్తూ, కార్యక్రమాలను దశలవారీగా ప్రణాళికాబద్ధంగా అమలు చేయాలని ఎమ్మెల్యే సూచించారు.బ్రహ్మోత్సవాల నిర్వహణకు తన వంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని, గతంలో ఎన్నడూ లేని విధంగా "నా భూతో న భవిష్యత్" అన్న స్థాయిలో ఈ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహిద్దామని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పిలుపునిచ్చారు.భక్తి, సంప్రదాయం, సంస్కృతి, సామూహిక సేవా భావాలకు ప్రతీకగా నిలిచే ఈ బ్రహ్మోత్సవాలను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు.కార్యక్రమంలో వెంకటేశ్వర స్వామి ఆలయ ధర్మకర్త రఘునాథచార్యులు, వనపర్తి మున్సిపల్ వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్ మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కదిరే రాములు, పట్టణ కౌన్సిలర్లు, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ఏదుల రిజర్వాయర్ ముంపు బాధితులకు రూ.2.34 కోట్ల చెక్కుల పంపిణీ.

### 47 మంది లబ్ధిదారులకు చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి.

**వనపర్తి(భారత శక్తి)** వనపర్తి నియోజకవర్గంలోని ఏదుల రిజర్వాయర్ నిర్మాణంలో ముంపుకు గురైన కొంకలపల్లి గ్రామానికి చెందిన 47 మంది లబ్ధిదారులకు ఇండ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.2 కోట్ల 34 లక్షలను మంజూరు చేసింది.ఈ మేరకు శుక్రవారం వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డివనపర్తి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు సత్తి చేసిన కార్యక్రమంలో సంబంధిత లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు.ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఏదుల రిజర్వాయర్ నిర్మాణం చేపట్టి తమ పొలాలు, ఇండ్లు కోల్పోయి పునరావాస కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చిందని, ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ గత పాలకులు తమ సమస్యలను పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు.అయితే నేడు కాంగ్రెస్ ప్రభుత్వం తమ కష్టాలను గుర్తించి ప్రతి కుటుంబానికి నష్టపరిహారం అందజేయడం ఆనందదాయకమని, తమకు న్యాయం జరుగుతోందనే నమ్మకం కలిగిందని లబ్ధిదారులు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ ముంపు బాధితుల సమస్యల పరిష్కారానికి తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని అన్నారు.పొలాలు, ఇండ్లు కోల్పోయిన ప్రతి ఒక్కరికీ పూర్తి స్థాయిలో నష్టపరిహారం అందేలా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.ప్రజల సమస్యల పరిష్కారమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, ముంపు బాధిత కుటుంబాలకు న్యాయం జరిగే వరకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.కార్యక్రమంలో వనపర్తి మార్కెట్ యార్డ్ అధ్యక్షులు, మున్సిపల్ వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, గోపాల్పేట ఉమ్మడి మండల మార్కెట్ యార్డ్ ఉపాధ్యక్షులు



సత్య శీలా రెడ్డి, రేవల్లి మండల అధ్యశులు సుల్తాన్ గ్రామ సర్పంచ్ బాలనాగయ్య, కాంగ్రెస్ పార్టీ మాజీ మండలాధ్యక్షులు పర్వతాలు, లోడి రఘు, ఆర్డిఓ ఎంఆర్ఓ, పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## కోకస్ మన్నూర్ గ్రామంలో SmF ఎన్యూమరేషన్ ప్రక్రియను పరిశీలించిన బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్



**(భారత శక్తి)**నేడు ఇచ్చోడ మండలంలోని కోకస్ మన్నూర్ గ్రామంలో బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (SmF) ఎన్యూమరేషన్ ప్రక్రియను స్థానిక సర్పంచ్ షామిమ్ యూసఫ్‌తో కలిసి పరిశీలించి, క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనులను పర్యవేక్షించారుఅడిగిన వెంటనే బోర్ మంజూరు చేసిన ఆడే గజేందర్ గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపిన కోకస్ మన్నూర్ గ్రామస్తులుఈ సందర్భంగా ఆడే గజేందర్ మాట్లాడుతూ, ప్రతి అర్హులైన ఓటరు వివరాలు ఖచ్చితంగా నమోదు కావాలని, ప్రజలు కూడా ఎన్యూమరేషన్ ప్రక్రియలో చురుకుగా పాల్గొని అవసరమైన వివరాలను అందించి తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని కోరారు అనంతరం గ్రామస్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకొని, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ తెలిపారు ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ షామిమ్ యూసఫ్,ఉప సర్పంచ్ విష్ణు,ఇచ్చోడ మండల అధ్యక్షుడు కళ్ళెం నారాయణ రెడ్డి, నియోజకవర్గ మైనారిటీ చైర్మన్ ముస్తఫా,నియోజకవర్గ ఎస్సి సెల్ చైర్మన్ కొత్తూరి లక్ష్మణ్,మాజీ ఎంపీటీసీ జాహిద్,ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు పట్ల గోవర్ధన్,మండల మైనారిటీ అధ్యక్షుడు అబ్దుల్ రషీద్, మాజీ నియోజకవర్గ అధికార ప్రతినిధి యండి సద్దాం,చోలే ప్రభాకర్,షేక్ ఫరూఖ్, మల్లేష్,పాముల మనోజ్,విశ్వనాథ్,రాజు తదితరులు ఉన్నారు

## తప్పిపోయిన బాలుడిని గంటలోనే గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించిన 2-టౌన్ పోలీసులు




**మహబూబ్ నగర్(భారత శక్తి)** మహబూబ్నగర్ పట్టణంలోని శ్రీ చైతన్య హై స్కూల్, లో 9 వ తరగతి చదువుతున్న సాయి సుధీర్ (14), తండ్రి: అశోక్, నివాసం: అభంగపట్నం, కోయిల్కొండ మండలం, మహబూబ్నగర్, తేది 02-07-2026 ఉదయం స్కూల్ నుండి ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లిపోయాడు. బాలుడి తల్లి మ్యాన్రే లావణ్య తన కుమారుడు కనిపించడం లేదని తేది 02-07-2026 రాత్రి 8:15 గంటలకు మహబూబ్నగర్ 2-టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.తల్లిదండ్రుల ఫిర్యాదు అందుకున్న వెంటనే 2-టౌన్ పోలీసులు అప్రమత్తమై, పోలీసులు సేకరించిన సీసీ కెమెరా ఫుటేజ్ ను క్షుణ్ణంగా పరిశీలించి బాలుడి కదలికలను గుర్తించారు. సీసీ కెమెరాల ఆధారంగా బాలుడి ఆచూకీ తెలుసుకున్న పోలీసులు, 2-టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎర్ర సత్యం చౌరస్తా వద్ద బాలుడు కూర్చుని ఉండగా గుర్తించి, సురక్షితంగా పోలీస్ స్టేషన్కు తీసుకువచ్చారు. అనంతరం తల్లిదండ్రులను పిలిపించి బాలుడిని వారికి అప్పగించారు.

## పాఠశాల బస్సు డ్రైవర్ కోటి కు అభినందన వెల్లువ




నరసరావుపేట,**(భారత శక్తి)** పాఠశాల బస్సు డ్రైవర్ కోటి సమయస్ఫూర్తితో పెను ప్రమాదం తప్పింది. బస్సులో అకస్మాత్తుగా మంటలు చెలరేగిన సమయంలో డ్రైవర్ కోటి అసాధారణ సమయస్ఫూర్తిని ప్రదర్శించి, విద్యార్థులందరినీ వెంటనే సురక్షితంగా బస్సు నుంచి బయటకు తరలించారు. అనంతరం ఫైర్ ఎక్స్టింగ్విషర్లు మరియు నీటిని ఉపయోగించి మంటలను అదుపులోకి తీసుకువచ్చి ప్రశంసనీయమైన సేవలు అందించారు. సమాచారం అందుకున్న వెంటనే జిల్లా రవాణా అధికారి సంజీవ్ కుమార్, ఎం వి ఐ కరుణాకర్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ఆయనతో పాటు రవాణా శాఖకు చెందిన ఇతర సిబ్బంది కూడా సంఘటన స్థలంలో పాల్గొని అవసరమైన చర్యలు చేపట్టారు.డ్రైవర్ కోటి చూపిన చాకచక్యం, ధైర్య సాహసాలతో విద్యార్థులు క్షేమంగా బయటపడటంతో అందరూ ఆయనను అభినందించారు.

## కృష్ణలంక పీఎస్ టెర్రస్పై ఎముకలు, బూడిద

**విజయవాడ (భారత శక్తి)** గాదె సాయికృష్ణ కేసులో వెలుగులోకి సంచలన విషయాలు బయటపడ్డాయి. కృష్ణలంక పోలీస్ స్టేషన్లో అనుమానాస్పద మరకలను సిట్ అధికారులు గుర్తించారు. కృష్ణలంక పీఎస్ టెర్రస్పై ఎముకలు, బూడిద గుర్తించారు. కాలిన హ్యాండ్ గొలుసు, లాఠీ సీజ్ చేసారు. కస్టడీలో తీవ్రగాయాలతో సాయికృష్ణ మరణించినట్లు సిట్ గుర్తించింది.

## తల్లికి వందనం జాబితాను సిద్ధం గా ఉంచండి

### పిడుగురాళ్ల ఎంఈఓ ఎండి.ఖాసీం వెల్లడి




పిడుగురాళ్ల,**(భారత శక్తి)** :పిడుగురాళ్ల మండల విద్యాశాఖ అధికారి ఎండి ఖాసీం పిడుగురాళ్లలోని జానపాడు రోడ్డులో గల మోడల్ ప్రాథమిక పాఠశాల మెయిన్, తుమ్మల చెరువులో గల మోడల్ ప్రాథమిక పాఠశాల డిడబ్ల్యును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేసి ఈ విద్యా సంవత్సరంలో తీసుకోవలసిన చర్యలను వివరించారు. పాఠశాలలోని విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి పాఠశాలను సమర్థవంతంగా నిర్వహిస్తున్న ప్రధానోపాధ్యాయులు ప్రసాద్ మరియు నాగేశ్వరావు లను అభినందించారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనంనాణ్యత విషయంలో రాజీ పడవద్దని, త్వరలో జరిగే మెగా పేటీఎంకు ఇప్పటినుండే సన్నాహాలు చేసుకోవాలని, తల్లికి వందనం జాబితాను సిద్ధంగా ఉంచుకోవాలని అన్నారు.

## జనసేన పార్టీ నిర్మాణ సారధుల సమాచార సేకరణ కమిటీ పరిశీలకురాలు లోకం మాధవి కి దరఖాస్తు సమర్పించిన కొట్టే సాయి ప్రసాద్



శ్రీకాళహస్తి**(భారత శక్తి)** జనసేన పార్టీ నిర్మాణంలో భాగంగా జనసేన పార్టీ అధ్యక్షులు కొణిదెల పవన్ కళ్యాణ్ జనసేన పార్టీ నిర్మాణ సారధుల సమాచార సేకరణ కమిటీకి తిరుపతి పార్లమెంట్ పరిశీలకురాలిగా శ్రీమతి లోకం మాధవి ని నియమించారు. ఈ సందర్భంగా శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం చైర్మన్ మరియు జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి కొట్టే సాయి ప్రసాద్ శ్రీమతి లోకం మాధవి కి పార్టీ నిర్మాణ సారధుల సమాచార సేకరణకు సంబంధించిన దరఖాస్తు పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా కొట్టే సాయి ప్రసాద్ మాట్లాడుతూ, పార్టీ అధిష్ఠానం తీసుకున్న నిర్ణయాలకు పూర్తిస్థాయిలో కట్టుబడి ఉంటానని, పార్టీ నిర్మాణం మరియు బలోపేతం కోసం ఎల్లప్పుడూ ముందుండి సహకరిస్తానని తెలిపారు. పార్టీ మరింత బలపడేలా ప్రతి జన సైనికుడు, వీర మహిళ మరియు కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.

## ప్రజా సేవల్లో నిర్లక్ష్యం వద్దు

### తిరుపతి కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్



తిరుపతి,**(భారత శక్తి)** తిరుపతి నగర ప్రజలకు నాణ్యమైన పౌర సేవలు అందించడంలో ఎలాంటి అలసత్వాన్ని సహించేది లేదని జిల్లా కలెక్టర్, నగరపాలక సంస్థ ప్రత్యేకాధికారి డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ స్పష్టం చేశారు. శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో అన్ని విభాగాల అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..

నగరంలో జరుగుతున్న పెండింగ్ అభివృద్ధి పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. వర్షాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, డ్రైనేజీల్లో చెత్తను ఎప్పటికప్పుడు తొలగించి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలని పేర్కొన్నారు. అలాగే, నగర ప్రజలకు ప్రతిరోజూ సురక్షితమైన తాగునీరు నిరంతరాయంగా అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ -2026' ఓటరు జాబితా మ్యాపింగ్ ప్రక్రియను పగడ్బందీగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు.?ముందుగా ఇన్చార్జ్ కమిషనర్ శారదా దేవి పనుల పురోగతిని పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, హెల్త్ ఆఫీసర్ డా. యువఅన్వేష్ తదితర మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## 5 ఎకరాల వరకు రైతుభరోసా నిధులు విడుదల

**(భారత శక్తి)** రైతుభరోసా నిధుల విడుదల నాలుగో రోజూ కొనసాగింది. ఐదు ఎకరాల లోపు భూమి ఉన్న 4.41 లక్షల మంది రైతుల ఖాతాల్లో ప్రభుత్వం ఇవాళ రూ.1,188 కోట్లు జమ చేసింది. దీనితో ఇప్పటివరకు మొత్తం 65.76 లక్షల మంది రైతులకు రూ.6,590.37 కోట్ల పెట్టుబడి సాయం అందింది. రైతుల ఖాతాల్లో నిధులు జమ అవుతున్నాయి.

## ఫుడ్ సేఫ్టీ ప్రమాణాలను కట్టు దిట్టంగా

# అమలు చేయాలి



**గోదావరిఖని(భారత శక్తి):** పెద్దపల్లిజిల్లాలోని గోదావరిఖనిలోని హోటళ్లు, రెస్టారెంట్లలో ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన ఆహారం అందేలా ఫుడ్ సేఫ్టీ ప్రమాణాలను కచ్చితంగా అమలు చేయాలని, నిబంధనలు ఉల్లంఘించే సంస్థలపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఆహార పదార్థాల నిల్వ, తయారీ, పరిశుభ్రత, వడ్డింపు వంటి అన్ని అంశాల్లో ఫుడ్ సేఫ్టీ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. హోటళ్లు, రెస్టారెంట్లలో పనిచేసే సిబ్బందికి ఆహార భద్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని, వినియోగదారుల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు.నిబంధనలు ఉల్లంఘిస్తున్న హోటళ్లు, రెస్టారెంట్లను తాత్కాలికంగా మూసివేసి, అవసరమైన లోపాలను సరిదిద్దిన అనంతరం మాత్రమే తిరిగి నిర్వహణకు అనుమతులు ఇస్తున్నామని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజారోగ్య పరిరక్షణ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని హెచ్చరించారు.మే 29న మంథని మార్కెట్ ప్రాంతంలోని శ్రీ సాయి ఫ్యామిలీ రెస్టారెంట్ అండ్ మెస్, జూన్ 13న గోదావరిఖనిలోని డెస్టినేషన్ రెస్టారెంట్లో ఫుడ్ సేఫ్టీ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో అపరిశుభ్రత, నిబంధనల ఉల్లంఘనలను గుర్తించి ఆయా రెస్టారెంట్లను తాత్కాలికంగా మూసివేసినట్లు తెలిపారు.తదనంతరం ఆయా సంస్థల నిర్వాహకులు పరిశుభ్రత, ఆహార భద్రత ప్రమాణాలకు అనుగుణంగా అవసరమైన మార్పులు చేపట్టడంతో, ఫుడ్ సేఫ్టీ అధికారులు పునఃపరిశీలన అనంతరం శ్రీ సాయి ఫ్యామిలీ రెస్టారెంట్ అండ్ మెస్‌కు జూన్ 4న, డెస్టినేషన్ రెస్టారెంట్‌కు జూన్ 30న తిరిగి కార్యకలాపాలు ప్రారంభించేందుకు అనుమతులు జారీ చేసినట్లు తెలిపారు.జిల్లాలోని ఇతర హోటళ్లు, రెస్టారెంట్లలో కూడా ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, ఎక్కడైనా అపరిశుభ్రత లేదా నిబంధనల ఉల్లంఘన గుర్తించిన వెంటనే సంబంధిత సంస్థలను సీజ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. హోటల్, రెస్టారెంట్ నిర్వాహకులు ఫుడ్ సేఫ్టీ నిబంధనలను తూచా తప్పకుండా పాటించి ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన ఆహారాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ ప్రకటన లో పేర్కొన్నారు.

## గ్రామాలవారీగా సి ఏం రిలీఫ్ ఫండ్ పంపిణీ



**కొడిమ్యాల(భారత శక్తి),** కొడిమ్యాల మండలం లోని సూరం పేట, కొడిమ్యాల నాచుపల్లి గ్రామాల వారిగా కాంగ్రెస్ అధ్యక్షుడు నాగభూషణ్ రెడ్డి చేతుల మీదుగా సి ఏం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కేంద్రసహకార బ్యాంక్ డైరెక్టర్ గుడి మల్లి కార్జునరెడ్డి, మాజీ జెడ్పి టీసి చిలువేరి నారాయణగౌడ్, ముమ్మాడీ స్వామి పాల్గొన్నారు.

## బదిపల్లిలో సార్ ప్రత్యేక సమగ్ర కార్యక్రమం



**కొత్తపల్లి(భారత శక్తి)** బదిపల్లి గ్రామంలో నిర్వహించిన సార్ ప్రత్యేక సమగ్ర కార్యక్రమంలో గ్రామ ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీఎల్ఓతో కలిసి కాంగ్రెస్ నాయకులు కోడూరు శ్రీనివాస్ గౌడ్, మండల అధ్యక్షుడు పంజాల స్వామి గౌడ్, గ్రామ శాఖ అధ్యక్షుడు బత్తిని గణేష్, మండల ప్రధాన కార్యదర్శి మునిగల శ్రీనివాస్, గ్రామ ఉపాధ్యక్షుడు తాండ్ర సంజీవ్, గ్రామ ప్రధాన కార్యదర్శి తాండ్ర రాజకుమార్, ఐదో వార్డు సభ్యుడు గర్రెపల్లి వెంకటేష్, కారోబారి వెంగళం వాసరయ్య పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతంగా సాగేందుకు గ్రామ ప్రజలు సహకరించారు.

## ప్రతి ఓటర్ నుండి కచ్చితంగా

# సమాచారాన్ని సేకరించాలి!

### – ఆర్డీవో కిడారి సందీప్ కుమార్



**సి.బెళగల్(భారత శక్తి)** మండల పరిధిలోని ఎనగండ్ల గ్రామంలో కర్నూల్ ఆర్డీవో కిడారి సందీప్ కుమార్ పర్యటించారు. ఈ పర్యటనలో గ్రామంలో జరుగుతున్న ఎస్ ఐ ఆర్ ప్రక్రియను పరిశీలించి బిఎల్వోలకు పలు సూచనలు చేశారు. ప్రతి ఓటర్ నుండి ఖచ్చితమైన సమాచారాన్ని సేకరించాలని తెలిపారు. అనంతరం గ్రామంలో గల ప్రభుత్వ చౌకధర దుకాణాలను తనిఖీ చేసి,పలు రికార్డులను, కొలతలను, దుకాణాల్లో ఉన్న నిలువలను పరిశీలించారు. ప్రజలకు రేషన్ పంపిణీ సక్రమంగా జరగాలని ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ పరిశీలనలో తహసిల్దార్ వెంకటలక్ష్మి, పంచాయతీ సెక్రెటరీ శ్యామలమ్మ, వీఆర్వో శ్రీనివాసులు, బిఎల్వోలు వెంకటేశ్వరమ్మ, ఆరోని తదితర సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమకారులను అవమానించిన కేసీఆర్‌కు ప్రజలే గుణపాఠం చెప్పారు : మల్‌రెడ్డి రాంరెడ్డి

- తెలంగాణ కోసం పోరాడిన వారిని కేసీఆర్ పాలనలో పూర్తిగా విస్మరించారు
- కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాతే ఉద్యమకారులకు మళ్లీ గౌరవం దక్కుతోంది
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ఆశయాల సాధన దిశగా ప్రజా పాలన కొనసాగుతోంది



**ఎల్బీనగర్, జూలై 03 (భారత శక్తి):**ఎల్బీనగర్ నియోజకవర్గంలోని చింతల్ కుంట, మల్లికార్జున నగర్ కమ్యూనిటీ హాల్ లో ఉద్యమకారుల హక్కుల సాధన సమితి అధ్యక్షులు రొక్కం లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమావేశానికి తెలంగాణ రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.తెలంగాణ ప్రభుత్వ ఉద్యమ కారుల కమిటీ సభ్యులు మోతె శోభన్ రెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా మల్‌రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం వేలాది మంది విద్యార్థులు, యువత, ఉద్యోగులు, ప్రజాసంఘాలు, ఉద్యమకారులు చేసిన నిరంతర పోరాటం, త్యాగాల ఫలితంగానే సాధ్యమైందని అన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షను గౌరవించి, ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్న కాంగ్రెస్ అగ్రనేత శ్రీమతి సోనియా గాంధీ సేవలను తెలంగాణ సమాజం ఎన్నటికీ మరువదని పేర్కొన్నారు.ఉద్యమం పేరుతో అధికారంలోకి వచ్చిన కేసీఆర్ ఉద్యమకారులను మోసం చేశారని మల్‌రెడ్డి రాంరెడ్డి తీవ్రంగా విమర్శించారు. ఉద్యమ సమయంలో ముందుండి పోరాడిన వారిని పక్కనపెట్టి, అధికారాన్ని వారి కుటుంబంలోని వ్యక్తుల చేతుల్లో కేంద్రీకరించి, రాష్ట్రాన్ని కుటుంబ పాలనకు పరిమితం చేశారని మండిపడ్డారు. ఉద్యమంలో రక్తం చిందించిన వారికి గౌరవం ఇవ్వకుండా, "ఉద్యమకారుడు" అనే పదమే వినిపించకుండా చేయాలని ప్రయత్నించడం కేసీఆర్ దురహంకారానికి నిదర్శనమని అన్నారు.పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ ప్రజల ఆశయాలు, ఉద్యమ లక్ష్యాలు పూర్తిగా పక్కదారి పట్టాయని, ప్రజల సంపదను దోచుకుని రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారని విమర్శించారు. తెలంగాణ కోసం పోరాడిన వారి త్యాగాలను విస్మరించి, ప్రజా సమస్యలను గాలికొదిలేసినందుకే బీఆర్ఎస్‌కు ప్రజలు గత ఎన్నికల్లో చరిత్రాత్మక తీర్పు ఇచ్చారని అన్నారు.కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితి పూర్తిగా మారిందని ఆయన పేర్కొన్నారు. గౌరవ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఉద్యమకారులకు సముచిత గౌరవం కల్పించడంతో పాటు, వారి సంక్షేమం, సమస్యల పరిష్కారం, గుర్తింపుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని తెలిపారు. తెలంగాణ కోసం ప్రాణ త్యాగం చేసిన శ్రీకాంత చారి తల్లికి మహిళా కమీషన్ మెంబర్ గా పదవి ఇచ్చి గౌరవించింది. తెలంగాణ ఉద్యమ కారుల కమిటీ ఏర్పాటు చేసి ఉద్యమకారులకు గుర్తింపు తీసుకురావడానికి కృషి చేస్తుంది. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని కాపాడటం కాంగ్రెస్ పార్టీ చారిత్రాత్మక బాధ్యతగా భావిస్తోందని స్పష్టం చేశారు. అంతేకాకుండా రైతు భరోసా అమలు, రైతుల రుణమాఫీ, మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, గృహ జ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, యువతకు ఉపాధి అవకాశాల కల్పన, పారదర్శక ఉద్యోగ నియామకాలు, మూసీ పునరుజ్జీవనం, హైదరాబాద్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా మౌలిక వసతుల అభివృద్ధి వంటి అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను కాంగ్రెస్ ప్రభుత్వం వేగంగా అమలు చేస్తోందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజలు కోరుకున్న సామాజిక న్యాయం, పారదర్శక పాలన, సమగ్ర అభివృద్ధి దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని అన్నారు.తెలంగాణ సాధన కోసం పోరాడిన ప్రతి ఉద్యమకారుడి ఆత్మగౌరవాన్ని పరిరక్షించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, వారి త్యాగాలకు తగిన గుర్తింపు వచ్చేలా అన్ని విధాలా కృషి చేస్తామని మల్‌రెడ్డి రాంరెడ్డి హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు తిప్పర్తి రమణారెడ్డి, జెనిగె విష్ణువర్ధన్ గుర్రం గోపాల్ రెడ్డి, కొంతం యాదగిరి రెడ్డి, బట్టల రవి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పన్యాల జైపాల్ రెడ్డి, నేలపాటి రామారావు నాయకులు కుంట్లూర్ వెంకటేష్ గౌడ్, సురేష్ యాదవ్, సుర్వి రాజు గౌడ్, రొక్కం బాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో

# పరిశీలించిన జిల్లా కలెక్టర్

### ఓటరు జాబితా మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలి

### జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్



తిరుపతి,**(భారత శక్తి)** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని తిరుపతి జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.శుక్రవారం రేణిగుంట మండలం కరకంబాడి గ్రామం, తారకరామ నగరలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ లో భాగంగా నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ శ్రీ కాళహస్తి ఆర్ డి ఓ భాను ప్రకాశ్ రెడ్డి తో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇంటింటికీ నిర్వహిస్తున్న సర్వే, ఓటర్ల వివరాల ధృవీకరణ, దరఖాస్తుల స్వీకరణ, అవసరమైన పత్రాల పరిశీలన తదితర అంశాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ –2026 లో భాగంగా 2002 ఓటర్ల జాబితాలోని ఓటర్ల జాబితా కి ప్రస్తుత ఓటర్ల జాబితా మ్యాపింగ్ ప్రక్రియను నాణ్యమైన ఓటర్ల జాబితా తయారు చేయడమే లక్ష్యం అని తెలిపారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని, అర్హత లేని పేర్ల తొలగింపు, మార్పులు, చేర్పులు ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం మాత్రమే చేపట్టాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఓటరు నమోదు ప్రక్రియను సులభతరం చేయాలని, ప్రతి దరఖాస్తును జాగ్రత్తగా పరిశీలించి సకాలంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అర్హులైన ప్రతి ఓటరు వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా సర్వే నిర్వహించాలని ఆదేశించారు. నిర్ణీత గడువులోగా నాణ్యతతో సర్వే పూర్తి చేసి ప్రజలకు అవసరమైన అవగాహన కల్పించి ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో బూత్ లెవల్ అధికారులు బి ఎల్ ఎ లు పాల్గొన్నారు.

# మూడు విండోలకు కొత్త పాలకవర్గాలు

**కరీంనగర్(భారత శక్తి)** కరీంనగర్ జిల్లా మానకొండూర్ నియోజకవర్గం పరిధిలోని మానకొండూర్, తాడికల్, మెట్ పల్లి ప్రాథమిక సహకార పరపతి సంఘాలకు నూతనంగా ఛైర్మన్లు నియామకయ్యారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కె.సురేంద్ర మోహన్ ఉత్వర్వులు జారీ చేశారు.

మానకొండూర్ "విండో" ఛైర్మన్ నాగిశెట్టి రాజయ్యమానకొండూర్ సింగిల్ విండో ఛైర్మన్ గా కొండపలకల గ్రామానికి చెందిన నాగిశెట్టి రాజయ్య, డైరెక్టర్లుగా ఏనుగుల చొక్కారెడ్డి(సదాశివపల్లి), కత్తెర్ల రాజు (అన్నారం), మంగురపు నర్సవ్వ(అన్నారం), గోని తిరుపతిగౌడ్ (చెంజర్ల), గాలి మొగిలి(చెంజర్ల), కొట్టె అంజిరెడ్డి (ఈదుల గట్టెపల్లి), ఎం.రామకృష్ణ (గంగిపల్లి), దూలం దేవేంద్ర (కొండపలకల), కొలిపాక మొగిలి(కొండపలకల), బుర్ర శ్రీకాంత్ (మద్దికుంట), కుర్ర వెంకటస్వామి (మానకొండూర్), ఏగోళపు శ్రీనివాస్ గౌడ్(ముంజంపల్లి) నియామకయ్యారు.తాడికల్ "విండో" ఛైర్మన్ గా కీసర సంపత్‌శంకరపట్నం మండలం తాడికల్ సింగిల్ విండో ఛైర్మన్ తాడికల్ గ్రామానికి చెందిన కీసర సంపత్, డైరెక్టర్లుగా కల్లెపల్లి రాజయ్య(కేశవపట్నం), తుమ్మేటి కొండల్ రెడ్డి (అంబాలపూర్), గీట్ల గోపాల్ రెడ్డి( ఇప్పలపల్లి), సంబు తిరుపతి(కరీంపేట్), గాజుల లస్మవ్వ(కేశవపట్నం), సుద్దాల రాజేందర్ (ముత్తారం), జనగాం రాజయ్య(తాడికల్), తిరుపతి సమ్మయ్య(తాడికల్), పింగళి జయలక్ష్మి(తాడికల్), తాళ్లపల్లి కొమురయ్య(వన్నారం), ఓదెల రాజయ్య (ఎరడపల్లి), కలకుంట్ల సత్యనారాయణ రావు (ఎరపడపల్లి) నియామకయ్యారు.మెట్ పల్లి "విండో" ఛైర్మన్ గా గాజుల మహేష్‌మెట్ పల్లి సింగిల్ విండో ఛైర్మన్ గా మొలంగూర్ గ్రామానికి చెందిన గాజుల మహేశ్, డైరెక్టర్లుగా పొన్నోజు సదానందం(మెట్ పల్లి), నాంపెల్లి శ్రీనివాస్ (ఆముదాలపల్లి), పెద్ది ముత్తారెడ్డి (ఆముదాలపల్లి), వంగల కృష్ణారెడ్డి (కన్నాపూర్), కాల్వ మహేందర్ రెడ్డి (కన్నాపూర్), ఉప్పుగళ్ల రాజిరెడ్డి (కొత్తగట్టు), అంబాల కోటి (కొత్తగట్టు), గాజుల నిర్మల( లింగాపూర్), బొల్లిపల్లి శ్రీనివాస్ (లింగాపూర్), అంగిడి సారయ్య( మెట్పల్లి), బొమ్మెన గట్టయ్య (మెట్పల్లి), దుబ్బాల సమ్మక్క ( మొలంగూర్) నియామకయ్యారు.

**విండోల పరపతి పెంచేలా కృషి చేయండి :**

**ఎమ్మెల్యే కవ్వంపల్లి**

ప్రాథమిక సహకార పరపతి సంఘాల పరపతి పెంచడంతోపాటు రైతులకు మరింత మెరుగైన సేవలు అందించే దిశగా కొత్త పాలకవర్గాలు సమిష్టిగా కృషి చేయాలని మానకొండూర్ ఎమ్మెల్యే,టీపీసీసీ ఎస్సీ సెల్ ఛైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. నూతనంగా సింగిల్ విండో ఛైర్మన్లు నియామకమైన నాగిశెట్టి రాజయ్య, కీసర సంపత్, గాజుల మహేష్ తోపాటు డైరెక్టర్లకు అభినందనలు తెలియజేశారు. పాలకవర్గాల పదవీకాలం విజయవంతంగా సాగి, రైతు సంక్షేమం,సహకార రంగ అభివృద్ధికి విశేష సేవలందించాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.

# ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలి

### – కూన శ్రీశైలం గౌడ్

**కరీంనగర్(భారత శక్తి)** ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రతి పౌరుడికి ఉన్న వజ్రాయుధమని, 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ ఇంచార్జ్ కూన శ్రీశైలం గౌడ్ పిలుపునిచ్చారు.శుక్రవారం బెజ్జంకి మండలం గుగ్గిళ్ళ గ్రామంలో నిర్వహించిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ఓటరు నమోదు కార్యక్రమంలో మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ ఛైర్మన్ డా. కవ్వంపల్లి సత్యనారాయణతో కలిసి ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ, కొత్తగా ఓటు హక్కు పొందిన యువతీయువకులు, ఇళ్లు మారిన వారు, ఇంకా ఓటరు జాబితాలో పేరు లేని వారు వెంటనే దరఖాస్తు చేసుకొని పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. బూత్ స్థాయి అధికారులు, కాంగ్రెస్ కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయించాలన్నారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఆయన పేర్కొన్నారు.

**బీజేపీ కుట్రలను భగ్నం చేయాలి :**

**కవ్వంపల్లి**

మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ ఛైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ఓట్ల తొలగింపుతో అధికారంలోకి ఉద్దేశంతో కేంద్రప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తోందన్నారు. తమకు వ్యతిరేవర్గానికి చెందిన వారి పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించాలన్నదే కుట్రలో భాగమని ఆయన పేర్కొన్నారు. బీజేపీయేత రాష్ట్రాల్లో అధికారాన్ని పగ్గాలు చేపట్టాలనే ఉద్దేశంతోనే సర్ ప్రక్రియను చేపట్టిందని ఆయన ఆరోపించారు. అర్హులవారి పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగింపునకు గురికాకుండా చూడాలన్నారు.ఈ కార్యక్రమంలో బెజ్జంకి ఎంపీడీవో కె.ప్రవీణ్, తహశీల్దార్ శ్రీకాంత్, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ పులి కృష్ణ, మాజీ ఎంపీపీ ఒగ్గు దామోదర్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి చెట్టి రాజు, జిల్లా కార్యదర్శి అక్కరవేణి పోచయ్య ముదిరాజ్, మండల పార్టీ మాజీ అధ్యక్షుడు ముక్కిస రత్నాకర్ రెడ్డి, పార్టీ గుగ్గిళ్ల గ్రామశాఖ అధ్యక్షుడు రాజేందర్ రెడ్డి, పార్టీ నాయకులు బైర సంతోష్, చెప్యాల శ్రీనివాస్ గౌడ్,చెన్నారెడ్డి, రావుల నర్సయ్య తదితరులు పాల్గొన్నారు .

## తాడిపత్రిలో ఘనంగా ఆంజనేయస్వామి

# తృతీయ వార్షికోత్సవాలు

**తాడిపత్రి(భారత శక్తి)** తాడిపత్రి పట్టణ సమీపంలో ఉన్న పెన్నా నది ఒడ్డున ఉన్న సువర్చల ఆంజనేయస్వామి తృతీయ వార్షికోత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆంజనేయ స్వామి వారికి కుంకుమార్చన, కలసి పూజ, సహస్రనామార్చన ఇంకా అనేక పూజలను చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. నేటితో ఆంజనేయస్వామి తృతీయ వార్షికోత్సవాలు ఘనంగా ముగిశాయి. అనంతరం ఆలయ పురోహితుడు రామనాథ్ ను ఆలయ కమిటీ నిర్వాహకుడు ఈశ్వరయ్య సభ్యులు కలిసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంజన్న, శివ, గురప్ప, నాగరాజు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# యాపిల్ కన్నా 10 రెట్లు

## ఎక్కువ ప్రయోజనాలు..



**(భారత శక్తి)**మనం ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతిరోజూ మంచి పోషకాహారాన్ని తీసుకోవాలి. చాలా మంది ఆరోగ్యానికి మంచిదని యాపిల్ వంటి పండ్లను తింటారు. అయితే కొందరికి ప్రత్యేక ఔషధ గుణాలున్న ఆకుల గురించి పెద్దగా తెలియకపోవచ్చు. అలాంటి అద్భుతమైన మొక్కల్లో కర్పూరవల్లి (పనికూర/వాము ఆకు) ఒకటి. ఇది సాధారణంగా కనిపించేదే అయినా.. దీనిలోని ఆరోగ్య ప్రయోజనాలు మాత్రం చాలా గొప్పవి. కర్పూరవల్లి ఆకు మన ఆరోగ్యాన్ని మెరుగుపరిచే అనేక గుణాలు కలిగి ఉంటుంది. ఈ ఆకులను ప్రతిరోజూ తీసుకోవడం ద్వారా శరీరానికి అద్భుతమైన లాభాలు పొందవచ్చని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఈ ఆకుల్లో ఉండే యాంటీఆక్సిడెంట్ల మోతాదు యాపిల్ కంటే 10 రెట్లు ఎక్కువగా ఉంటుంది. అంటే రోజుకు నాలుగు కర్పూరవల్లి ఆకులు తినడం ఒక యాపిల్ తినడంతో సమానమైన ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. ఈ ఆకులు శరీరంలోని జీవక్రియను ప్రేరేపించి.. శక్తిని పెంచుతాయి. దీని వల్ల జీర్ణవ్యవస్థ సరిగ్గా పనిచేస్తుంది. నాలుగు కర్పూరవల్లి ఆకులను కొంచెం వేడి చేసి వాటి రసం తీసి తేనె కలిపి తీసుకోవడం వల్ల పొడి దగ్గుకు ఉపశమనం లభిస్తుంది. ఈ మిశ్రమాన్ని ఖాళీ కడుపుతో 48 రోజులు తీసుకుంటే మంచి ఫలితం కనిపిస్తుంది. మధుమేహంతో బాధపడేవారు తేనె మినహాయించాలి. రాత్రి పడుకునే ముందు రెండు ఆకులను నమలడం.. తర్వాత వేడి నీరు త్రాగడం వల్ల గ్యాస్ సమస్య తగ్గుతుంది. పీరియడ్స్ నొప్పితో బాధపడే మహిళలు ఉదయం 6 గంటలకు ఈ ఆకులను నమలితే నొప్పి తగ్గుతుంది.ఊబకాయం సమస్య ఉన్నవారు రోజుకు మూడు సార్లు ఈ ఆకులను తింటే శరీరంలోని.. ముఖ్యంగా బొడ్డులో ఉండే కొవ్వు కరుగుతుంది. కర్పూరవల్లి ఆకులు సాధారణంగా ఆకుపచ్చ రంగులో, ప్రత్యేకమైన వాసనతో ఉంటాయి. ఇవి రుచికరమైనవి కాకపోయినా.. ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఈ ఆకులను నేరుగా నమలవచ్చు లేదా కొంచెం వేడి చేసి ఉపయోగించవచ్చు. సువాసనతో కూడిన ఈ ఆకులు జలుబు, దగ్గు వంటి శ్వాస సంబంధిత ఇన్ఫెక్షన్లకు కూడా సహాయపడతాయి. ఈ ఆకులను రోజూ తీసుకోవడం వల్ల సాధారణంగా ఎటువంటి తీవ్రమైన సైడ్ ఎఫెక్ట్స్ కనిపించవు. అయినప్పటికీ.. మీరు ఏవైనా ప్రస్తుత ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లయితే, వైద్యుడి సలహాతోనే వాడటం ఉత్తమం. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు ముందుగా వైద్య సలహా తీసుకోవాలి.



# రెండే రెండు రెబ్బలు తింటే డాక్టర్‌తో పని ఉండదిక..

**మన వంటింట్లో ఎన్నో సహజ ఔషధాలు దాగున్నాయి.. మీరు తరచుగా జలుబు, ఇన్ఫెక్షన్లతో బాధపడుతుంటే.. పచ్చి వెల్లుల్లి మీకు అద్భుతంగా సహాయపడుతుంది. దీనికి బలమైన యాంటీ బాక్టీరియల్, యాంటీవైరల్ లక్షణాలు ఉన్నాయి. దీనిని రెగ్యులర్‌గా తీసుకోవడం వల్ల ఎన్నో సమస్యల నుంచి బయటపడొచ్చు. వెల్లుల్లిలో ఎన్నో ఔషధ గుణాలు దాగున్నాయి.. వెల్లుల్లి మన ఆహార రుచిని పెంచడమే కాకుండా.. ఇది అనేక అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉన్న సహజ సూపర్‌ఫుడ్ కూడా.**


వెల్లుల్లిని ఉడికించి తిన్నా.. లేదా పచ్చిగా.. ఇలా ఎలా తిన్నా మంచిదే.. కానీ పచ్చి వెల్లుల్లి తినడం వల్ల మీకు మరిన్ని పోషకాలు లభిస్తాయని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. మీ రోగనిరోధక శక్తిని పెంచడం నుండి గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడం వరకు, ఇది మీ శరీరానికి మంచిదిగా చెబుతున్నారు. అందుకే.. మీ దినచర్యలో పచ్చి వెల్లుల్లిని చేర్చుకుంటే అద్భుతమైన ప్రయోజనాలను పొందవచ్చు. వెల్లుల్లిలో విటమిన్లు, ఖనిజాలు, ఇతర పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. ఇది విటమిన్ సి, విటమిన్ బి6, మాంగనీస్, ఇతర పోషకాలకు మంచి వనరు. ఇది తక్కువ కేలరీలు కలిగి ఉంటుంది.. ఆరోగ్యానికి చాలా ఉపయోగకరంగా ఉంటుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. మీరు తరచుగా జలుబు, ఇన్ఫెక్షన్లతో బాధపడుతుంటే, పచ్చి వెల్లుల్లి మీకు సహాయపడుతుంది. ఇది బలమైన యాంటీ బాక్టీరియల్, యాంటీవైరల్ లక్షణాలను కలిగి ఉంటుంది.. ఇది మీ శరీరం వ్యాధులతో పోరాడటానికి సహాయపడుతుంది. ఒక అధ్యయనం ప్రకారం, పచ్చి వెల్లుల్లిలో అల్లిసిన్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది మీ రోగనిరోధక శక్తిని పెంచుతుంది. హానికరమైన బ్యాక్టీరియాను దూరంగా ఉంచుతుంది. పోషకాహార నిపుణుల ప్రకారం.. వెల్లుల్లి క్రమం తప్పకుండా తినడం వల్ల జలుబు, ఫ్లూ, ఇతర ఇన్ఫెక్షన్ల తీవ్రత తగ్గుతుంది. అధిక రక్తపోటు సైలెంట్ కిల్లర్.. అయితే.. పచ్చి వెల్లుల్లి దానిని నియంత్రణలో ఉంచడంలో సహాయపడుతుంది. వెల్లుల్లి రక్త నాళాలను సడలించి రక్త ప్రసరణను మెరుగుపరుస్తుందని, తద్వారా గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుందని అధ్యయనాలు చెబుతున్నాయి. వెల్లుల్లి హృదయ సంబంధ సమస్యలను నివారించడంలో ప్రభావవంతంగా ఉంటుందని పరిశోధనలు సూచిస్తున్నాయి. ఇది చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది.. మంచి కొలెస్ట్రాల్‌ను స్థిరంగా ఉంచుతుంది.. తద్వారా మొత్తం గుండె ఆరోగ్యాన్ని ప్రోత్సహిస్తుంది. మన శరీరం నిరంతరం ఆహారం, కాలుష్యం, ఇతర వనరుల నుండి విష పదార్థాలకు గురవుతూ ఉంటుంది. పచ్చి వెల్లుల్లి హానికరమైన పదార్థాలను బయటకు పంపడం ద్వారా మీ కాలేయాన్ని శుభ్రపరచడంలో సహాయపడుతుంది. ఇందులో సల్ఫర్ సమ్మేళనాలు కూడా ఉంటాయి. ఇవి హెవీ మెటల్ పాయిజనింగ్ నుంచి రక్షించాయి. కాలేయం, మూత్రపిండాలు వంటి అవయవాలకు జరిగే నష్టాన్ని తగ్గిస్తాయి. ఆరోగ్యకరమైన ప్రేగు మొత్తం ఆరోగ్యానికి చాలా ముఖ్యం. వెల్లుల్లి జీర్ణక్రియను మెరుగుపరచడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. ఇది జీర్ణ ఎంజైమ్‌ల ఉత్పత్తిని పెంచుతుంది, ఇది మీ శరీరం ఆహారాన్ని మరింత సమర్థవంతంగా జీర్ణం చేసుకోవడానికి సహాయపడుతుంది. అలాగే, దాని యాంటీ బాక్టీరియల్ లక్షణాలు హానికరమైన గట్ బాక్టీరియాను నియంత్రణలో ఉంచుతాయి. మంచి బ్యాక్టీరియా పెరుగుదలకు మద్దతు ఇస్తాయి. డాక్టర్ బన్సాల్ ప్రకారం.. వెల్లుల్లిలో ఫ్రీ రాడికల్స్‌తో పోరాడే యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఈ ఫ్రీ రాడికల్స్ కణాల నష్టం.. వృద్ధాప్యానికి కారణమవుతాయి. పచ్చి వెల్లుల్లిని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల కడుపు.. కొలొరెక్టల్ క్యాన్సర్ వంటి కొన్ని క్యాన్సర్ల ప్రమాదాన్ని తగ్గించవచ్చని పరిశోధనలు చెబుతున్నాయి. ఇది కణ ఉత్పరివర్తనను నిరోధిస్తుంది. కణితి పెరుగుదలను నెమ్మదిస్తుంది. పచ్చి వెల్లుల్లి రెండు రెబ్బలను ఉదయాన్నే తింటే చాలా మంచిది.. అయితే.. పచ్చి వెల్లుల్లి ఘాటైన రుచి మీకు నచ్చకపోతే.. ఈ చిట్కాలను అనుసరించండి. దానిని కోసి లేదా చూర్ణం చేసి తినడానికి ముందు 10 నిమిషాలు అలాగే ఉంచండి. ఇది అల్లిసిన్ మొత్తాన్ని సక్రియం చేస్తుంది. ఘాటైన రుచిని సమతుల్యం చేయడానికి తేనెతో కలపండి. తేలికపాటి రుచి కోసం స్మూతీలు లేదా సలాడ్లలో జోడించండి.

# అల్లం-నిమ్మకాయ టీతో ఆ సమస్యలకు చెక్..



కొంతమంది తిన్న తర్వాత కడుపులో అసౌకర్యానికి గురవుతారు. కడుపు ఫుల్ అయినప్పుడు లేదా కారంగా ఉండే ఆహారం తిన్నప్పుడు ఇలాంటి సమస్య తలెత్తుతుంది. కానీ అలాంటి సమయంలో మీ కడుపును కూల్ చేయడానికి, ఆహారాన్ని వేగంగా జీర్ణం చేయడానికి కొన్ని మార్గాలు ఉన్నాయి. అల్లం-నిమ్మకాయ టీ అనేది రుచికరమైన, ఆరోగ్యకరమైన డ్రింక్. ఇది అనేక ప్రయోజనాలను కలిగి ఉంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరచడంలో, రోగనిరోధక శక్తిని పెంచడంలో, నొప్పి నుండి ఉపశమనం పొందడంలో సహాయపడుతుంది. అల్లం-నిమ్మకాయ టీ ఈ సమస్యలకు చక్కని పరిష్కారం. జీర్ణక్రియకు సహాయపడటం నుండి రోగనిరోధక శక్తిని పెంచడం వరకు ఈ టీ ఉపయోగపడుతుంది. ఇది చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి కూడా మంచిది. ఆమ్లతను తగ్గించడానికి, బరువు తగ్గడానికి లేదా కడుపులో కలిగే ఏదైనా అసౌకర్యాన్ని తొలగించడానికి అల్లం-నిమ్మకాయ టీ చాలా బాగా పనిచేస్తుంది. అల్లం జీర్ణ ఎంజైమ్‌లను ప్రేరేపిస్తుంది. గ్యాస్, విరేచనాలు, ఆమ్లత్వం వంటి సమస్యలను తగ్గిస్తుంది. నిమ్మకాయ కాలేయాన్ని డిటాక్స్‌ఫై చేయడంలో, పిత్త ఉత్పత్తిని పెంచడంలో సహాయపడుతుంది. ఇది కొవ్వులను మరింత సమర్థవంతంగా తొలగించడంలో కూడా సహాయపడుతుంది. కలిపి తీసుకున్నప్పుడు, ఇది జీర్ణవ్యవస్థను మెరుగుపరుస్తుంది. భోజనం తర్వాత బద్ధకాన్ని నివారిస్తుంది. బరువు తగ్గాలనుకునే వారికి కూడా ఇది చాలా మంచిది. నిపుణుల అభిప్రాయం ప్రకారం.. అల్లం జీవక్రియను పెంచుతుంది. శరీరం కొవ్వును మరింత సమర్థవంతంగా కరిగించడానికి సహాయపడుతుంది. సిట్రిక్ యాసిడ్ అధికంగా ఉండే నిమ్మకాయ డిటాక్స్‌ఫైకి మద్దతు ఇస్తుంది. కోరికలను నియంత్రిస్తుంది. భోజనం తర్వాత క్రమం తప్పకుండా తీసుకుంటే, ఇది ఆరోగ్యకరమైన బరువును నిర్వహించడానికి మీకు సహాయపడుతుంది. చలికాలంలో లేదా అతిగా తిన్న తర్వాత మనం తరచుగా నీరు త్రాగడం మర్చిపోతాము. అల్లం-నిమ్మకాయ టీ హైడ్రేషన్‌ను పెంచడంతో పాటు అదనపు ప్రయోజనాలను అందిస్తుంది. ముఖ్యంగా శీతాకాలంలో దాహం తక్కువగా ఉన్నప్పుడు, ద్రవ సమతుల్యతను కాపాడుతుంది. డీహైడ్రేషన్ ప్రమాదాన్ని


# వర్షాకాలంలో ఆకుకూరలు తింటున్నారా..?



ఆకుకూరలు ఆరోగ్యానికి మంచివనే విషయం దాదాపు అందరికీ తెలిసిందే. ఆకు కూరలలో మన ఆరోగ్యానికి మేలు చేసే ఎన్నో పోషకాలు నిండి ఉంటాయి. అందుకే నిత్యం ఏదో ఒక ఆకుకూరను ఆహారంలో భాగం చేసుకోవాలని నిపుణులు చెబుతుంటారు. అయితే, వర్షాకాలంలో ఆకు కూరలు తినటం మంచిదేనా..? వర్షాకాలంలో ఆకుకూరలు తినకూడదని ఇంట్లో పెద్దలు తరచూ చెబుతుంటారు. వర్షాకాలంలో ఆకు కూరలు తింటే కడుపు నొప్పి, విరేచనాలు అవుతాయని చెబుతుంటారు. అయితే, ఇవన్నీ అపోహలు మాత్రమే అని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. కూరగాయలతో పోలిస్తే ఆకుకూరలు భూమికి దగ్గరగా పెరుగుతాయి. వర్షపు జల్లుల వల్ల బ్యాక్టీరియా, ఫంగస్ సులభంగా వృద్ధి చెందుతాయి. అంతేకాకుండా ఆకుకూరలపై మట్టి, కీటకాలు లేదా వాటి గుడ్లు ఉండే అవకాశం ఉంటుంది. కాబట్టి వీటన్నింటిని కారణాలుగా పేర్కొంటూ ఆకుకూరలు తింటే ఆరోగ్య సమస్యలు వస్తాయని చెబుతుంటారు. వర్షాకాలంలో మన శరీరానికి అవసరమయ్యే కాల్షియం, మెగ్నీషియం, ఐరన్, ఫోలిక్ ఆమ్లాలు ఆకుకూరల నుంచి ఎక్కువ మొత్తంలో లభిస్తాయని నిపుణులు చెబుతున్నారు. అందుకే, రోజువారీ ఆహారంలో 50 గ్రాముల చొప్పున ఏదో ఒక ఆకుకూరని చేర్చుకోవాలని సూచిస్తున్నారు. ఆకు కూరలు వండేముందు ఉప్పు లేదా వెనిగర్ కలిపిన నీటితో రెండు లేదా మూడు సార్లు బాగా కడిగి ఎక్కువసేపు ఉడికించాలని నిపుణులు చెబుతున్నారు. ఈ కాలంలో పచ్చి ఆకుకూరలు తినడం కంటే, వాటిని బాగా ఉడికించి తినడం మంచిదని, ఇలా చేయడం వల్ల అందులో ఉండే సూక్ష్మజీవులు నశిస్తాయని చెబుతున్నారు. ఆకులు కొనే ముందు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు చెబుతున్నారు. మురికిగా లేదా వాడిపోయిన వాటిని కొనుగోలు చేయకుండా, తాజాగా కనిపించే ఆకుకూరలనే ఎంచుకోవాలని సలహా ఇస్తున్నారు. వీలైతే సేంద్రీయ పద్ధతిలో పండించిన ఆకుకూరలను ఎంచుకోవడం మంచిదని, ఎందుకంటే వాటిపై రసాయన అవశేషాలు తక్కువగా ఉంటాయని పేర్కొన్నారు.

# నిద్రలో అకస్మాత్తుగా

## ఊపిరి ఆగిపోయినట్లు అనిపిస్తుందా?



ఇది నిశబ్దంగా మన నిద్రను భంగం కలిగిస్తుంది. తద్వారా దీర్ఘకాలిక అలసటకు దారితీస్తుంది. శ్వాస అకస్మాత్తుగా ఆగిపోయినప్పుడు వెంటనే మెలకువ వచ్చేస్తుంది. సరైన నిద్ర లభించదు. ఫలితంగా, పొద్దున్నే లేచిన తర్వాత తలనొప్పిగా ఉండడం, నీరసం, మూడ్ సరిగా ఉండకపోవడం. నిద్ర లేమికీ, శారీరక మానసిక ఆరోగ్యానికీ మధ్య ఉన్న సంబంధం గురించి అవగాహన ఏర్పడవలసిన అవసరాన్ని గతంలో కరోనా మహమ్మారి తెలియజేసింది. ఈ రోజుల్లో చాలా మందికి రకరకాల అనారోగ్య సమస్యలు వెంటాడుతున్నాయి. ప్రతి ఒక్కరికి నిద్ర అవసరం. నిద్రలేమి వల్ల ఎన్నో అనారోగ్య సమస్యలు వస్తుంటాయి. ప్రతి ఒక్కరికి సరైన నిద్ర లేకుంటే డయాబెటిస్‌తో పాటు కార్డియో వాస్క్యులర్ డిసీజెస్, బ్లడ్ ప్రెషర్ ఇష్యూస్, మెంటల్ హెల్త్ ఇష్యూస్ వంటివాటికి కారణం కావచ్చు. నిద్రిస్తున్న సమయంలో గొంతు భాగంలో ఉన్న కండరాలు ఎక్కువగా రిలాక్స్ అవుతాయి. దీంతో నాలుక లేదా టాన్సిల్స్ లాంటి మృదు కణ జాలాలు ఉండే భాగాలు గాలి వెళ్లే ద్వారాన్ని అడ్డుకుంటాయి. దీన్నే అబ్?స్ట్రక్టివ్? స్లీప్? ఆప్నియా అంటాం. ఈ బ్లాకేజీ కండిషన్? కొన్ని సెకండ్ల నుంచి ఒక నిమిషం పాటు ఉంటుంది. ఈ సమయంలో మెదడుకు ఆక్సిజన్ తక్కువ అందుతుంది. అలాగే ఊపిరి పీల్చుకోవడంలో ఇబ్బందిగా మారుతుంది. ఇది కొన్ని క్షణాలపాటే ఉండడం వల్ల దీనిని పెద్దగా ఎవరు గమనించి ఉండదరు.

ఇది గాఢనిద్రలోకి వెళ్లకుండా అప్పుడప్పుడు అకస్మాత్తుగా మెలకువ వస్తూ ఉంటుంది. తద్వారా శరీరానికి సరిపడా నిద్ర ఉండదు. ఊపిరి తీసుకోవడంలో కలిగే ఈ ఇబ్బందులు లేదా ఆప్నియాలు ఒక్కరాత్రిలోనే పది నుంచి వందలసార్లు కూడా వస్తాయి. చాలా మందికి నిద్రలో గురక వస్తుంటుంది. దీని వల్ల చాలా మందికి ఇబ్బందిగా ఉంటుంది. దాంతో పక్కనవాళ్లు ఇబ్బంది పడడం సహజం. కానీ, గురక వల్ల ఎంతసేపు నిద్రపోయినా వాళ్లకు విశ్రాంతి తీసుకున్నట్టు అనిపించదు. కానీ, ఈ సమస్యను చాలామంది గుర్తించరు. తమంతట తాముగా గుర్తించలేరు కూడా. దీనిని అబ్‌స్ట్రక్టివ్ స్లీప్ ఆప్నియా (ఒఎస్?ఎ) అంటారు. ఇది నిశబ్దంగా మన నిద్రను భంగం కలిగిస్తుంది. తద్వారా దీర్ఘకాలిక అలసటకు దారితీస్తుంది. శ్వాస అకస్మాత్తుగా ఆగిపోయినప్పుడు వెంటనే మెలకువ వచ్చేస్తుంది.

సరైన నిద్ర లభించదు. ఫలితంగా, పొద్దున్నే లేచిన తర్వాత తలనొప్పిగా ఉండడం, నీరసం, మూడ్ సరిగా ఉండకపోవడం, డిప్రెషన్ వంటివి కూడా కలుగవచ్చు. నిద్ర లేమి సమస్య పెరుగుతున్న కొద్దీ బ్రెయిన్ తో చేసే పనుల్లో సామర్థ్యం తగ్గుతుందని తెలుస్తోంది. పైగా రోజులు గడిచే కొద్దీ ఇది ఇంకా పెరుగుతూనే ఉంటుంది. అంతేకాదు ముమ్ముందు మరిన్ని సమస్యలు చుట్టుముట్టే ప్రమాదం ఉందని, ఇదో సంకేతామని వైద్యులు చెబుతున్నారు. కానీ మన శరీరంలో అప్పుడప్పుడు ఏర్పటే సంకేతాలను అర్థం చేసుకుంటే జీవితాన్ని మరింత ముందుకు తీసుకెళ్లవచ్చని వైద్యులు చెబుతున్నారు.

# రాత్రిపూట పెరుగు తింటే సమస్యలా..?



పెరుగు శరీరానికి మంచిది. జీర్ణక్రియను మెరుగుపరచడానికి, రోగనిరోధక శక్తిని పెంచడానికి, పేగు ఆరోగ్యానికి పెరుగు మంచిది. పెరుగులో కాల్షియం, ప్రోటీన్ కూడా అధికంగా ఉంటాయి. ఇది ఎముకలు, కండరాలకు ప్రయోజనకరంగా ఉంటుంది. కానీ రాత్రిపూట పెరుగు తినవచ్చా..? ఆహార నియంత్రణ ఆరోగ్యానికి చాలా ముఖ్యమైన అంశం. మనం చాలా రుచికరమైన ఆహారాలను తగ్గించాల్సి రావచ్చు. రాత్రిపూట పెరుగు తినడం కూడా నివారించాల్సిన వాటిలో ఒకటి. పెరుగు చాలా మందికి ఇష్టం. అన్నింటికంటే, ఒక కప్ పెరుగు తినాలని ప్రతి ఒక్కరికి ఉంటుంది.

కానీ రాత్రిపూట పెరుగు తినడం ఆరోగ్యానికి అంత మంచిది కాదు. రాత్రిపూట పెరుగు తినడం వల్ల జీర్ణ సమస్యలు ఉన్నవారికి మరిన్ని సమస్యలు రావచ్చు. ఇందులో కొవ్వు, ప్రోటీన్ ఉంటాయి. రాత్రిపూట జీవక్రియ తక్కువగా ఉంటుంది కాబట్టి, జీర్ణం కావడం కూడా కష్టం.ఆయుర్వేదం ప్రకారం.. పెరుగు శరీరంలో కఫాన్ని పెంచుతుంది. కఫం సాధారణంగా రాత్రిపూట ఎక్కువగా కనిపిస్తుంది. ఈ సందర్భంలో పెరుగుతో తినడం వల్ల మరిన్ని సమస్యలు వచ్చే అవకాశం ఉంది. అయితే ఈ సమస్యలు అందరికీ ఒకేలా ఉండకపోవచ్చు. ఉబ్బసం, దగ్గు, జలుబు ఉన్నవారు రాత్రిపూట పెరుగు తినకుండా ఉండాలి.

ఉదయం లేదా భోజనంతో పెరుగు తినడం ఉత్తమం. సరైన సమయంలో తీసుకుంటే పెరుగు శరీరానికి మంచిది. పెరుగు జీర్ణక్రియను మెరుగుపరచడానికి, రోగనిరోధక శక్తిని పెంచడానికి, పేగు ఆరోగ్యాన్ని పెంచడానికి మంచిది. పెరుగులో కాల్షియం, ప్రోటీన్ కూడా ఎక్కువగా ఉంటుంది. ఇది ఎముకలు, కండరాలకు ప్రయోజనకరంగా ఉంటుంది. పెరుగు జుట్టు, చర్మ ఆరోగ్యానికి కూడా మంచిది. పెరుగు ప్రోబయోటిక్స్‌కు కూడా మూలం. ఇంట్లో తయారుచేసిన తాజా పెరుగు తీసుకోవడం మంచిది. పెరుగు సాధారణంగా అందరికీ ప్రయోజనకరంగా ఉన్నప్పటికీ, పాల ఉత్పత్తులకు అలెర్జీ ఉన్నవారు దీనిని నివారించడం మంచిది. మూత్రపిండాల సమస్యలు లేదా అధిక కొలెస్ట్రాల్ ఉన్నవారు పెరుగును మితంగా మాత్రమే తినాలి.

# అర్హులందరికీ ప్రభుత్వ పథకాల ఫలాలు చేరాలి: ఎంపీ గోడం నగేశ్

**- ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి:జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**






నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూలై 03 (భారత శక్తి ):జిల్లాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలును మరింత సమర్థవంతంగా చేపట్టి, అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ పథకాల ఫలాలు చేరేలా అధికారులు కృషి చేయాలని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్, జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా సూచించారు.శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశం ఎంపీ గోడం నగేశ్ అధ్యక్షతన నిర్వహించగా, జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్, మున్సిపల్ చైర్‌పర్సన్, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.సమావేశంలో గత ఏడాది కాలంగా వివిధ శాఖల ద్వారా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలు, పెండింగ్ పనులు, భౌతిక, ఆర్థిక పురోగతిపై శాఖల వారీగా సమగ్ర సమీక్ష నిర్వహించారు.గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఉపాధి హామీ పనులు, ఈజీఎస్, మెటీరియల్ వర్క్స్, 'ఏరువాక--మన ఊరు మన చేను' కార్యక్రమం, బ్యాంకు లింకేజీ, పంచాయతీరాజ్ శాఖ ద్వారా ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు, వ్యవసాయ శాఖ ద్వారా పీఎంకేఎస్‌వై అమలు, యూరియా నిల్వలు, విద్యుత్ శాఖ మౌలిక సదుపాయాలు, వైద్య ఆరోగ్య శాఖ నేషనల్ హెల్త్ మిషన్, విద్యాశాఖ సర్వ శిక్ష అభియాన్, పీఎం శ్రీ, మధ్యాహ్న భోజన పథకం, మహిళా శిశు సంక్షేమ శాఖ ఐసీడీఎస్, ఉద్యానవన, అటవీ, గిరిజన సంక్షేమ, క్రీడలు, పౌర సరఫరాలు, బీఎస్ఎన్ఎల్, నేషనల్ హైవే, లీడ్ బ్యాంక్ తదితర శాఖల పనితీరును సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల అమలుపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రతి శాఖ పనితీరును విడివిడిగా సమీక్షించి సమస్యలకు తక్షణ పరిష్కారాలు చూపాలని, అభివృద్ధి పనులు జాప్యం లేకుండా పూర్తి చేయాలని ఆదేశించారు. ఉపాధి హామీ కింద అర్హులైన ప్రతి జాబ్‌కార్డు దారుకు ఉపాధి కల్పించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని, అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలు వేగవంతం చేయాలని సూచించారు. అవసరమైన ప్రాంతాల్లో బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్లు, అటవీ ప్రాంతాల్లో సోలార్ విద్యుత్ సౌకర్యాలు కల్పించాలని, రేషన్ బియ్యం పారదర్శకంగా పంపిణీ చేయాలని తెలిపారు.నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, ఉపాధి హామీ పనుల్లో సమాన పనిదినాలు, సమాన వేతనం అమలు చేయాలని, అనుమతులు లభించిన అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. యూరియా సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలని, రైతులకు యూరియా యాప్ వినియోగంపై క్షేత్రస్థాయిలో సహాయం అందించాలని పేర్కొన్నారు.ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు అటవీ అనుమతుల సమస్యలు ఉన్నచోట పరిష్కారం చూపాలని, నిర్మాణాల్లో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ మాట్లాడుతూ, భైంసా సమీప జాతీయ రహదారిపై ప్రమాదకర బ్లాక్‌స్పాట్లను గుర్తించి ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టాలని, బాసర వంతెనను ప్రమాదరహితంగా తీర్చిదిద్దాలని కోరారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి పారదర్శకంగా అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అభివృద్ధి పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించి పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో రెవెన్యూ మ్యాప్‌లు లేని 14 గ్రామాల్లో సర్వేలు, 70 గ్రామాల్లో రీ-సర్వే చేపడుతున్నట్లు వెల్లడించారు.శాఖల వారీగా అధికారులు తమ పురోగతిని వివరించారు. జిల్లాలో 1.74 లక్షల జాబ్‌కార్డుదారులకు ఉపాధి కల్పిస్తున్నట్లు, ఇందిరమ్మ ఇండ్ల కింద 2,136 గృహాలు పూర్తిచేసి రూ.146 కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన పథకానికి రూ.17.74 కోట్లు వ్యయం చేసినట్లు, 20 పీఎం శ్రీ పాఠశాలలకు రూ.1.34 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. జిల్లాలో 2.49 లక్షల రేషన్ కార్డుల ద్వారా ప్రతి నెల ఉచిత సన్నబియ్యం పంపిణీ చేస్తున్నట్లు, 41,950 కొత్త రేషన్ కార్డులు జారీ చేసినట్లు వివరించారు. పీఎం కిసాన్ పథకం కింద 53 వేల మంది రైతులకు రూ.32 కోట్ల ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు.

ఈ సమావేశంలో ఖానాపూర్ మున్సిపల్ చైర్ పర్సన్ అంకం మౌనిక, భైంసా మున్సిపల్ చైర్మన్ దత్తాద్రి, అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, డీఎఫ్‌వో సుశాంత్ సుఖదేవ్ బోబడే, డీఆర్‌వో రాథోడ్ రమేష్, డీఆర్‌డీవో విజయలక్ష్మి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# డిజిటల్ ఇండియా 11 ఏళ్ల ప్రస్థానం

**-పౌరులు, వ్యాపారాల ప్రగతికి నూతన మార్గం - (ఎస్ కృష్ణన్, కార్యదర్శి, ఎలక్ట్రానిక్స్ మరియు సమాచార సాంకేతికత శాఖ)**



కేవలం దశాబ్దం క్రితం, ఉత్తరప్రదేశ్‌లోని ఓ మారుమూల గ్రామ రైతు సబ్సిడీలను పొందడానికో లేదా దిగుబడిని పెంచుకునే సలహాల తెలుసుకోవాలనుకుంటే చాలా ఇబ్బంది పడేవారు. పైగా కార్యాలయాల దగ్గర పొడవాటి వరుసల్లో నిలబడాల్సి వచ్చేది. కానీ నేడు అదే రైతు తన పంటలకు సంబంధించిన సహాయాన్ని సులభంగా పొందగలుగుతున్నాడు, ఎలాంటి మధ్యవర్తులు ప్రమేయం లేకుండా సబ్సిడీలు నేరుగా అతని బ్యాంక్ ఖాతాలో జమ అవుతున్నాయి.ఏ వీధిలో నడిచి వెళ్తున్నా ప్రజల జీవన విధానాన్ని సులభతరం చేసిన నిశ్శబ్ద విప్లవాన్ని చూడొచ్చు. ఒకప్పుడు నగదు మార్పిడిపైనే పూర్తిగా ఆధారపడిన స్థానిక పండ్ల వ్యాపారో, ఆటోరిక్షా డ్రైవరో.. ఇప్పుడు తన దగ్గరున్న క్యూఆర్ కోడ్‌ను గర్వంగా చూపిస్తున్నాడు.భారత్ నేడు ఇంటర్నెట్ సౌకర్యం ఉన్న 102.86 కోట్ల మంది పౌరులు, 99.56 కోట్ల భారీ బ్రాడ్‌బ్యాండ్ వినియోగదారులున్నారు. మొబైల్ డేటా ధర ఒక జీబీకి కేవలం రూ.8--10 మాత్రమే ఉండడంతో, సగటున ఒక వ్యక్తి నెలకు ఉపయోగించే డేటా అసాధారణంగా 24.01 జీబీకి చేరింది. ఈ డిజిటల్ పునాది పౌరుడికి, ప్రభుత్వానికి మధ్య సంబంధాన్ని పూర్తిగా మార్చేసింది; దీనిని నమ్మకం, పారదర్శకత, డిజిటల్ స్వయంప్రతిపత్తితో సుస్థిరం చేసింది. ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో, పౌరులకు సమాన అవకాశాలను కల్పించే ప్రజాస్వామ్య సాధనంగా సాంకేతికత పనిచేయాలని, వారి జీవనాన్ని, వ్యాపార నిర్వహణను సులభతరం చేయాలని డిజిటల్ ఇండియా నిరూపించింది.అంతరాలను తొలగించడంఈ విప్లవంలో మొదటి అడుగు సాంకేతికతను అందరికీ అందుబాటులోకి తీసుకురావడం, సాంకేతిక స్వావలంబనకు హామీ ఇచ్చే బలమైన, స్వదేశీ డిజిటల్ గుర్తింపు వ్యవస్థను నిర్మించడం. భారత్‌నెట్ చొరవను భారీ స్థాయిలో అమలు చేసి, దాదాపు 2.2 లక్షల గ్రామ పంచాయతీలను హై-స్పీడ్ బ్రాడ్‌బ్యాండ్‌తో విజయవంతంగా అనుసంధానించారు, దీనివల్ల ఆర్థిక అవకాశాలకు భౌగోళిక ప్రాంతం ఇకపై ఎంతమాత్రం అడ్డంకి కాకుండా పోయింది.ఈ మౌలిక సదుపాయాల పురోగతి, 144 కోట్లకు పైగా ఆధార్ గుర్తింపుల సృష్టి, జన్ ధన్-ఆధార్-మొబైల్ (జీఏఎం) త్రయానికి బలాన్నిచ్చాయి. ఈ సార్వభౌమ డిజిటల్ గుర్తింపు చట్రాన్ని ఉపయోగించడం ద్వారా, ప్రభుత్వం ప్రత్యక్ష ప్రయోజన బదిలీ ద్వారా రూ.51.5 లక్షల కోట్లను నేరుగా పౌరుల ఖాతాల్లోకి విజయవంతంగా బదిలీ చేసింది. ఈ వ్యవస్థ లోటుపాట్లను సమర్థవంతంగా అరికట్టింది, మధ్యవర్తులను తొలగించింది, ఆర్థిక స్వయంప్రతిపత్తిని నేరుగా పౌరుల చేతుల్లో పెట్టడం ద్వారా లక్షలాది కుటుంబాల జీవన విధానాన్ని అనూహ్యంగా మెరుగుపరిచింది.డిజిటల్ వ్యవస్థల ప్రభావం: దైనందిన జీవితం, వ్యాపారాల మార్పుభారతదేశపు డిజిటల్ ప్రజా మౌలిక సదుపాయాలు (DPI) వాస్తవ ప్రపంచ సమస్యలను పరిష్కరించే మార్గాలను సృష్టించడం ద్వారా పౌరుల దైనందిన జీవితాలను మార్చేశాయి. 'డిజీలాకర్' వంటి వేదికలు పౌరులు, వ్యాపారాల పనులను సులభతరం చేశాయి. 70 కోట్లకు పైగా నమోదిత వినియోగదారులు, 900 కోట్లకు పైగా డిజిటల్ పత్రాలను కలిగి ఉన్న ఈ వ్యవస్థ, కాగితాలను భౌతికంగా తీసుకెళ్లే శ్రమను తప్పించి, కేవైసీ ప్రక్రియలను, పత్రాల ధృవీకరణ తక్షణమే పూర్తయ్యేలా చేసింది. వ్యాపారాల పరంగా..ఇది వినియోగదారులను చేర్చుకునే ఖర్చును, సమయాన్ని గణనీయంగా తగ్గించింది; బ్యాంకులు, టెలికాం ఆపరేటర్లు, ఫిన్‌టెక్ సంస్థలు ఇప్పుడు కస్టమర్ వివరాలను రోజుల తరబడి కాకుండా కేవలం సెకన్లలో ధృవీకరిస్తున్నాయి. గవర్నమెంట్ ఇ-మార్కెట్‌ప్లేస్ (GeM) ద్వారా, ప్రభుత్వం రూ.19.51 లక్షల కోట్లకు పైగా విలువైన కొనుగోళ్లను నిర్వహించింది. ఒక చిన్న తయారీదారు లేదా మొదటి సారి వ్యాపారం ప్రారంభించిన విక్రేతకు, ఇది మధ్యవర్తుల ప్రమేయం లేకుండా ప్రభుత్వ కాంట్రాక్టులను పొందే వ్యాపార అవకాశంగా మారింది.ప్రజా సేవలను రిమోట్‌గా పొందేందుకు, ఉమాంగ్ అప్లికేషన్ కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వ సేవలను నేరుగా పౌరుల అరచేతిలోకి తీసుకువచ్చింది. ఇది 11.6 కోట్లకు పైగా నమోదిత వినియోగదారులకు సేవలందిస్తోంది, 2,572 ప్రభుత్వ సేవలకు అవకాశాన్ని ఇస్తూ, ఇప్పటివరకు 797.84 కోట్ల లావాదేవీలను సులభతరం చేసింది.ఈ సాంకేతిక వ్యవస్థలో ప్రతిష్టాత్మకమైనది యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (UPI). ప్రస్తుతం రోజుకు 75 కోట్ల లావాదేవీలను నిర్వహిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా జరిగే మొత్తం రియల్ టైమ్ డిజిటల్ చెల్లింపులలో దాదాపు సగం భారతదేశంలోనే జరుగుతున్నాయి, ఐఎమ్ఎఫ్ కూడా యూపీఐ ని ప్రపంచంలోనే అతిపెద్ద రియల్ టైమ్ చెల్లింపు వ్యవస్థగా గుర్తించింది.భారత్ తన డిజిటల్ పరిపాలన వేదికల అనురణ, స్వీకరణ కోసం అధికారికంగా అవగాహన ఒప్పందాలపై సంతకాలు చేసిన 24 దేశాలలో సేవలందిస్తోంది. అలాగే.. యూపీఐ ఇప్పుడు యూఏఈ, సింగపూర్, ఫ్రాన్స్‌తో సహా 9 దేశాలలో అందుబాటులో ఉంది.సాంకేతికతను ప్రజా ప్రయోజనంగా పరిగణించే విధానం.. ఆరోగ్య సమానత్వానికి కూడా వర్తిస్తుంది. ఈ-సంజీవని వేదిక ద్వారా, భారత్ 48 కోట్లకు పైగా ఉచిత టెలి-కన్సల్టేషన్లను అందించింది, దీనివల్ల మారుమూల, వైద్య సదుపాయాలు లేని ప్రాంతాల్లోని రోగులు కూడా నిపుణులైన వైద్యుల్ని సంప్రదించగలుగుతున్నారు. అలాగే.. ప్రపంచంలోనే అతిపెద్ద వ్యాక్సినేషన్ కార్యక్రమానికి స్వదేశీ వేదిక ఆసరా అయ్యింది. 220 కోట్లకు పైగా కోవిడ్-19 వ్యాక్సిన్ డోసులు పారదర్శకంగా పంపిణీ, ట్రాకింగ్ చేయబడ్డాయి. ఇది ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలు అధ్యయనం చేసిన బలమైన సాంకేతికతను ఏర్పాటు చేసింది.

### భవిష్యత్ దిశగా

డిజిటల్ ఇండియా 11వ సంవత్సరాన్ని పూర్తి చేసుకుంటున్న తరుణంలో, ఈ మిషన్ కీలక సాంకేతికతల పై దృష్టి సారిస్తోంది. ఇవి భారత్, గ్లోబల్ సౌత్ ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించడానికి ప్రజా ప్రయోజనాలుగా ఉపయోగపడేలా చూస్తోంది. దశాబ్దాలుగా కంప్యూటింగ్ పవర్ వ్యయం కారణంగా చిన్న పట్టణాల్లోని ఆవిష్కర్తలు అధునాతన సాంకేతికతకు దూరంగా ఉన్నారు. ఇండియా-ఏఐ మిషన్ కింద, స్టార్టప్‌ల వ్యాపార నిర్వహణను సులభతరం చేయడానికి ప్రభుత్వం ఈ అడ్డంకిని క్రమంగా తొలగిస్తోంది. అందరికీ సమాన అవకాశాలు కల్పించడానికి భారీ, ఉమ్మడి కంప్యూట్ సదుపాయాన్ని ఏర్పాటు చేసింది. స్వదేశీ స్టార్టప్‌లు, విద్యార్థులకు గంటకు కేవలం రూ.65 కే ప్రపంచ స్థాయి కంప్యూటింగ్ సామర్థ్యాన్ని అందించడం ద్వారా, క్షేత్రస్థాయిలో ఆవిష్కరణలను ప్రోత్సహించడం దీని లక్ష్యం. భారత్ ను ప్రపంచంలోనే ఏఐ అప్లికేషన్ల రాజధానిగా మార్చడమే దీని ధ్యేయం, తద్వారా మన ప్రతిభావంతులైన శ్రామిక శక్తి అన్ని రంగాలలోని వ్యాపారాలలో ఉత్పాదకతను పెంచుతుంది.అదే సమయంలో, భారత్ తన హార్డ్‌వేర్ భవిష్యత్తును సురక్షితం చేసుకుంటోంది. సెమికాన్ ఇండియా కార్యక్రమం కింద, దేశవ్యాప్తంగా రూ.1.65 లక్షల కోట్ల పెట్టుబడితో 12 సెమీకండక్టర్ తయారీ, ప్యాకేజింగ్ ప్రాజెక్టులకు ఆమోదం లభించింది. ఈ ప్రగతిని కొనసాగిస్తూ, కేంద్ర బడ్జెట్ 2026--27 లో ఇండియా సెమీకండక్టర్ మిషన్ 2.0 ను ప్రకటించారు. సెమీకండక్టర్ పరికరాలు, మెటీరియల్స్‌పై దృష్టి సారించడం, పూర్తి-స్థాయి భారతీయ మేధో సంపత్తిని రూపొందించడం, ప్రపంచ సరఫరా గొలుసులను బలోపేతం చేయడం ద్వారా తయారీ రంగాన్ని మించి ముందుకు వెళుతుంది. ఈ పథకం కింద 24 సెమీకండక్టర్ డిజైన్ స్టార్టప్‌లకు ఆమోదం లభించడంతో, భారతదేశం దాని సామర్థ్య సృష్టిని వేగంగా బలమైన సాంకేతిక పరిజ్ఞానంగా మారుస్తోంది. ఇది ఆధునిక ప్రపంచానికి శక్తినిచ్చే చిప్‌లను రూపొందించే శక్తివంతమైన దేశీయ పర్యావరణ వ్యవస్థను పెంపొందిస్తోంది.ఈ ప్రయత్నం అందించిన నిజమైన వారసత్వం దేశ ఆలోచనా విధానంలోనే కనిపిస్తోంది. ఎందుకంటే నేడు ప్రజలు సరికొత్త ఆవిష్కరణలు, సులువైన వ్యాపార లావాదేవీలు, పరిపాలన వంటి సేవలు నేరుగా తమ చేతివేళ్ల వద్దే లభించాలని ఆశిస్తున్నారు. సాంకేతికత అనేది అందరికీ భాగస్వామ్యం కల్పించేలా, సులభంగా అందుబాటులో ఉండేలా, దేశ సార్వభౌమ బలానికి సాధనంగా నిలిచేలా చేయడం ద్వారా, డిజిటల్ ఇండియా మనం 2047 నాటికి కలలుగంటున్న 'వికసిత్ భారత్' నిర్మాణానికి నిశ్శబ్దంగా పునాది వేస్తోంది.

## కాంగ్రెస్ పార్టీ సూర్యాపేట పట్టణ అధ్యక్షులుగా వెలుగు వెంకన్న



**సూర్యాపేట (భారతశక్తి ప్రతినిధి) జూలై 3:**కాంగ్రెస్ పార్టీ సూర్యాపేట పట్టణ అధ్యక్షులుగా జిల్లా కేంద్రానికి చెందిన 48వ వార్డు కౌన్సిలర్ వెలుగు వెంకన్న నియామక మయ్యారు. 2000 సంవత్సరంలో పెద్దిరెడ్డి రాజా ఆధ్వర్యంలో టీడీపీలో పనిచేసిన ఆయన 2016 నుంచి పటేల్ రమేష్ రెడ్డితో కలిసి పార్టీ అభివృద్ధి కోసం పనిచేస్తున్నారు. 2014లో టీడీపీ పట్టణ కార్యదర్శి పని చేశారు. 2014లో టీడీపీ పార్టీ తరపున ఆయన సతీమణి వెలుగు సంతోషి కౌన్సిలర్‌గా గెలుపొందారు. 2017లో పటేల్ రమేష్ రెడ్డితో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. 2019, 2026 సంవత్సరంలో 48వ వార్డు కౌన్సిలర్ గా రెండుసార్లు గెలుపొందారు. 2014లో చైర్మన్ పదవి అవకాశం కోల్పోయారు. 2026లో వైస్ చైర్మన్ పదవి ఆశించినా దక్కలేదు. శుక్రవారం పట్టణ పార్టీ అధ్యక్షులుగా నియామకం కావడంతో ఆయన అభిమానులు సంబురాలు జరుపుకున్నారు. బాణా సంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. ఆయనకు పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వెలుగు వెంకన్న మాట్లాడుతూ పట్టణ అధ్యక్షులుగా తన నియామకానికి సహకరించిన పట్ల సీఎం రేవంత్ రెడ్డి, జిల్లా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, తెలంగాణ టూరిజం కార్పోరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, ఏఐసీసీ నాయకులు సర్వోత్తమ్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

## అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా కాంగ్రెస్ శ్రేణులు కృషి చేయాలి

**గోదావరిఖని(భారత శక్తి):** రామగుండం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం రామగుండం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ాఎఖీ?ఃఒం ఇంచార్జులతో రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ గారు, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబు గారు సమీక్షా సమావేశం నిర్వహించారు.

నియోజకవర్గంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ాఎఖీ) కార్యక్రమం పురోగతి, ఃఒంలు చేపట్టాల్సిన బాధ్యతలు, ప్రజలకు అందించాల్సిన సహకారంపై విస్తృతంగా చర్చించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ.. భారత ఎన్నికల కమిషన్ చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం అత్యంత కీలకమైనదని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటు హక్కు ఎంతో విలువైనదని, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఃఒంలు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ప్రతి బూత్ పరిధిలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ాఎఖీ ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పించాలని, అవసరమైన దరఖాస్తులు నింపడంలో సహకరించాలని తెలిపారు.ఓటరు జాబితాలో పేర్లు లేకపోవడం, తప్పులు ఉండడం, చిరునామా మార్పులు, కొత్త ఓటర్ల నమోదు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఎలాంటి అర్హత కలిగిన ఓటరు కూడా జాబితా నుంచి మినహాయించబడకుండా అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు ఎప్పటికప్పుడు అవసరమైన సమాచారం అందించాలని అన్నారు.

## దుర్గగుడిలో అర్చకులకు అడుగడుగునా అవమానం

**(భారత శక్తి)**దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఏఈవో తీరుపై అర్చకస్వాములు, వేద పండితులు తీవ్ర ఆగ్రహంవ్యక్తం చేస్తున్నారు. ఎటువంటి కారణం లేకుండా ఏఈవో చంద్ర శేఖర్ తమను అసభ్యకరంగా దూషించి బెదిరిస్తున్నాడని వారు ఆరోపిస్తున్నారు. తీరు మార్చుకోకపోతే దేవస్థానంలో విధులు బహిష్కరిస్తామని అర్చకులు, వేదపండితులు హెచ్చరించారు... ఈ మేరకు ఏఈవోపై ఈవో క్కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దేవస్థానంలో పొన్నపల్లి సత్యనారాయణమూర్తి అర్చక విభాగంలో కేర్‌టేకర్‌గా, వివిధ ఉత్సవాలలో, వేద పాఠశాలలో పనిచేస్తున్నారు. ఆలయ వైదిక కమిటీ, ఈవో ఆదేశాల మేరకు ఇటీవల ఆయన్ను పోరంకిలోని వేద పాఠశాల నుంచి ఆలయంలో కుంకుమార్చన, పల్లకీసేవ, దర్బార్‌సేవలకు బదిలీచేశారు. జూన్ 30న సత్యనారాయణమూర్తి ఆలయంలో విధుల్లో ఉండగా ఏఈవో చంద్రశేఖర్ అతడి వద్దకు వెళ్లి ఇక్కడున్నావేంటి.. ఆర్డర్ ఉందా.. ఎవరిచ్చారు? అంటూ ప్రశ్నించడంతో సత్యనారాయణమూర్తి దేవస్థానం వైదిక కమిటీ, ఈవో ఇచ్చిన ఆర్డర్‌ను ఏఈవోకు చూపించాడు. అందరిముందు అసభ్యకరంగా దూషించడమ్ కాకుండా బెదిరించాడని.. సత్యనారాయణమూర్తి ఆరోపిస్తున్నారు. తమపై పెత్తనం చేస్తున్నారంటూ అర్చకులు, వేద పండితులు ఆరోపిస్తున్నారు. తీరు మార్చుకోకపోతే విధులు బహిష్కరిస్తామని అర్చకులు, వేద పండితులు చెబుతున్నారు. ఏఈవో తీరుపై అర్చకులు, సత్యనారాయణమూర్తి ఈవోకు ఫిర్యాదు చేయడంతో.. గురువారం ఏఈవో చంద్రశేఖర్‌ను పిలిపించి అర్చకులు, వేదపండితులతో ఎటువంటి గొడవలు పడవద్దని సున్నితంగా మందలించినట్టు తెలిసింది. అర్చకుడి ఫిర్యాదుపై ఈవోను వివరణ కోరగా విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## యూట్యూబర్ ప్రశ్న రావణ్ అరెస్ట్

**మచిలీపట్నం(భారత శక్తి),** రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పై అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణల నేపథ్యంలో యూట్యూబర్ ప్రశ్న రావణ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. జనసేన నాయకులు అందించిన ఫిర్యాదు మేరకు శుక్రవారం తెల్లవారుజామున ఆయనను అదుపులోకి తీసుకుని మచిలీపట్నం సమీపంలోని ఇనకుదురు పోలీస్ స్టేషన్‌కు తరలించారు.ఈ ఘటన నేపథ్యంలో ఇనకుదురు పోలీస్ స్టేషన్ వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా స్టేషన్ గేట్లను మూసివేసి, భద్రతా చర్యలను కట్టుదిట్టం చేశారు.డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌పై ప్రశ్న రావణ్ చేసిన వ్యాఖ్యలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మచిలీపట్నం 31వ డివిజన్ జనసేన ఇన్‌చార్జి ఉడుముల బుజ్జి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు ప్రశ్న రావణ్‌ను అదుపులోకి తీసుకున్నారు.

## పద్మారావునగర్ దోపిడి కేసులో నలుగురు అరెస్టు

**సికింద్రాబాద్(భారత శక్తి)** ఐదు రోజుల క్రితం పద్మారావు నగర్ లో జరిగిన చోరీ కేసును చిలకలగూడ పోలీసులు ఛేదించారు. నలుగురు ముఠా సభ్యులను అరెస్ట్ చేసారు. దోపిడీకి ఉపయోగించిన షట్టర్ కటింగ్ పరికరాలు, ఆయుధాలు, వాహనాలు స్వాదీనం చేసుకున్నట్లు ఏసీపీ శశాంక్ రెడ్డి వెల్లడించారు. జ్యోతి మెడికల్ హాల్ పెంట్ హౌస్ లో పెద్ద మొత్తంలో నల్లధనం ఉన్నదని దోచుకోవడం కోసం 15రోజుల క్రితమే ప్రణాళిక ముఠా వేసింది. ఆదివారం తెల్లవారు జామున ప్రణాళిక ప్రకారం దోపిడీ చేసింది. సెక్యూరిటీ గార్డులను తాళ్లతో బందించడంతో పాటు కత్తులతో బెదిరించింది. షట్టర్ కటింగ్ యంత్రాలతో దుండగులు షట్టర్ తాళాలు పగులగొట్టారు. షట్టర్ లోపల 27,500 నగదుతో పాటు, సెక్యూర్టీ సిబ్బంది దగ్గర ఉన్న 2500 నగదు దోపిడీ చేసారు. ప్రధాన నిందితుడు సాయి తో పాటు మిగతా నిందితుల కోసం గాలింపు కొనసాగుతోంది.

## రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలకు వ్యతిరేకిస్తూ నిరసన




**(భారత శక్తి)** రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్ మరియు స్టాంపులు శాఖ లో జీవో ఎంఎస్-396 ప్రకారం రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలు(ఖీూఐ) ఏర్పాటును ఎన్టీఆర్ జిల్లా దస్తావేజులేఖర్ల వృత్తి పరిరక్షణ సమితి తీవ్రంగా వ్యతిరేకిస్తుంది..!!అందులో భాగంగా ఈరోజు శుక్రవారం విజయవాడ గాంధీనగర్ జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట దస్తావేజు లేఖరులు,అసిస్టెంట్లు, డిటిపి ఆపరేటర్లు,స్టాంప్ వెండర్లు నల్లరిబ్బన్లు ధరించి రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలను వ్యతిరేకిస్తూ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దస్తావేజు లేఖరుల సంక్షేమ సంఘం అధ్యక్షులు శ్రీ చింతకాయల నాగ సత్యనారాయణ మూర్తి గారు పాల్గొని ఎక్కడో మహారాష్ట్రలో అది కూడా ముంబై,పూనే నగరాల్లో మాత్రమే ఈ తరహా వ్యవస్థను ఏర్పాటు చేసి లీజు,తనఖా వంటి రిజిస్ట్రేషన్లు మాత్రమే చేస్తున్నారని కానీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలు ఏర్పాటు చేసి అన్ని రకాల రిజిస్ట్రేషన్లు చేయడానికి రంగం సిద్ధం చేస్తూ ,దస్తావేజు లేఖర్ల పొట్ట కొట్టడం భావ్యం కాదని తెలిపారు. రిజిస్ట్రేషన్ సేవా కేంద్రముల ఏర్పాటు తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ, అలా ఉపసంహరించుకోకుంటే భవిష్యత్తులో తాము మరిన్ని నిరసన కార్యక్రమాలను చేస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా దస్తావేజు లేఖర్ల వృత్తి పరిరక్షణ సమితి అధ్యక్షులు పైలా సతీష్ మాట్లాడుతూ తాము అభివృద్ధికి, టెక్నాలజీకి ఎప్పుడు వ్యతిరేకం కాదని కానీ రిజిస్ట్రేషన్ఢ స్టాంపుల శాఖకు అనుబంధంగా తాము 100 సంవత్సరాలకు పైబడి దస్తావేజు లేఖర్లగా సేవలందిస్తున్నామని, రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్ శాఖలో ఎన్ని కొత్త తరహ విధానాలు తీసుకొచ్చిన వాటన్నింటినీ నేర్చుకొని అటు ప్రజలకు ఇటు ప్రభుత్వానికి వారధిగా పనిచేస్తూ, చట్టపరంగా దస్తావేజులు రాస్తూ, ప్రభుత్వానికి,ప్రజలకు సహాయ సహకారాలు అందిస్తున్నామని తెలిపారు. అయితే ప్రస్తుతం పిపిపి విధానంలో ఈ రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల్లో కొత్తవారికి ట్రైనింగ్ ఉపయోగించుకోవడం కన్నా, ఎంతో అనుభవం నైపుణ్యం గల దస్తావేజు లేఖర్లకు లైసెన్సులు/ఐడెంటిటీ ఇచ్చి తమ జీవన భృతిని కొనసాగించుకునే ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.!!ఈ కార్యక్రమంలో విజయవాడ గాంధీనగర్ దస్తావేజు లేఖరులు ఎం చక్రధర్,ఏ వరహాల రావు, సాంబశివరావు, వెంకటేశ్వరరావు,నరేంద్ర, కాజా రమేష్,సూర్యనారాయణ పలువురు యువ దస్తావేజు లేఖరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఇల్లందకుంట నూతన తహసిల్దార్ కు సన్మానం..

**- దేవస్థానం చైర్మన్ ఇంగిలే రామారావు..**



**జమ్మికుంట,(భారత శక్తి)** .ఇల్లంధకుంట మండలానికి నూతన తాసిల్దార్ గా వచ్చి బాధ్యతలు స్వీకరించిన మనోజ్ కుమార్ ను శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం చైర్మన్ ఇంగిలే రామారావు, మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానం చేసి దేవస్థానం మెమెంటో, ముత్యాల తలంబ్రాలు అందజేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ విద్యార్థుల సౌకర్యార్థం కుల ఆదాయ ధ్రువీకరణ పత్రాలు త్వరితగతిన అందజేయాలన్నారు. ప్రజల సమస్యల పైన సత్వరమే పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ధర్మకర్తలు గొడిశాల పరమేష్, గోలి కిరణ్, యూత్ కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి గుండారపు సాయి, తదితరులు పాల్గొన్నారు..

# థ్రిల్లింగ్ కథాంశంతో 'నాగబంధం'

## ఉత్తరాది ప్రేక్షకులకు అదిరిపోయే ఆఫర్!




పాన్-ఇండియా స్థాయిలో వస్తున్న మైథలాజికల్ ఫాంటసీ థ్రిల్లర్ 'నాగబంధం: ది సీక్రెట్ ట్రెజర్' జులై 3న ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమైంది. విరాట్ కర్ణ, నభా నటేష్, ఐశ్వర్య మీనన్ ప్రధాన పాత్రలలో నటించిన ఈ చిత్రంపై ప్రేక్షకులలో మంచి అంచనాలు ఉన్నాయి. అయితే, విడుదల రోజున ప్రేక్షకులను థియేటర్లకు ఆకర్షించేందుకు చిత్రబృందం ఒక వినూత్న ఆఫర్‌ను ప్రకటించింది. మొదటి రోజు 'ఒక టికెట్ కొంటే మరొకటి ఉచితం' (BOGO) ఆఫర్‌ను అందిస్తున్నట్లు తెలిపింది. అయితే, ఇందులో ఒక కీలకమైన మెలిక ఉంది. ఈ ఆఫర్ కేవలం హిందీ వెర్షన్‌కు మాత్రమే వర్తిస్తుంది. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం భాషల్లో ఈ ఆఫర్ అందుబాటులో ఉండదని నిర్మాతలు స్పష్టం చేశారు. బాలీవుడ్ మార్కెట్‌లో తొలిరోజు భారీగా వసూళ్లు రాబట్టే వ్యూహంలో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. హిందీ మార్కెట్‌లో పోటీ ఎక్కువగా ఉండటంతో, ఇలాంటి ప్రమోషన్ ద్వారా ఉత్తరాది రాష్ట్రాల్లో ఎక్కువ మంది ప్రేక్షకులను థియేటర్లకు రప్పించాలని చిత్ర యూనిట్ భావిస్తోంది. అభిషేక్ నామా దర్శకత్వంలో, నిక్ స్టూడియోస్ మరియు అభిషేక్ పిక్చర్స్ పతాకాలపై సుమారు రూ.100 కోట్ల భారీ బడ్జెట్‌తో ఈ చిత్రం తెరకెక్కింది. పురాతన విష్ణు దేవాలయాలు, నాగబంధం రహస్యం, గుప్త నిధుల చుట్టూ తిరిగే ఈ కథలో భారీ వీఎఫ్ఎక్స్, యాక్షన్ సన్నివేశాలు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్‌కు అద్భుతమైన స్పందన లభించింది.

జగపతి బాబు, మహేష్ మంజ్రేకర్, మురళీ శర్మ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషించారు. అడ్వాన్స్ బుకింగ్స్ కూడా ఆశాజనకంగా ఉండటంతో, చిత్రం భారీ ఓపెనింగ్స్ సాధిస్తుందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

## పురాతన రహస్యాల

# ఛేదనలో..



నటుడు గణేశ్ కథానాయకుడిగా రూపొందుతున్న ఫిక్షనల్ మూవీ 'పినాక'. ధనంజయ దర్శకుడు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మిస్తున్న ఈచిత్రం అక్టోబర్ 2న గ్రాండ్‌గా విడుదల కానున్నది. ఆదివారం హీరో గణేశ్ పుట్టిన రోజు. ఈ సందర్భంగా సినిమాలోని ఆయన ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేసి, శుభాకాంక్షలు అందించారు. పురాతన రహస్యాన్ని ఛేదించడంలో నిమగ్నమైన గణేశ్‌ని ఈ పోస్టర్‌లో చూడొచ్చు. పురాణాలు, రహస్యాలతో నిండిన అద్భుత ప్రయాణం ఈ సినిమా అని, అన్ని వర్గాలనూ ఆకట్టుకునేలా సినిమా ఉంటుందని మేకర్స్ చెబుతున్నారు. ఈ చిత్రానికి కెమెరా: కర్మ్ చావ్లా, సంగీతం: గౌర హరి.

# నా చిరునవ్వుల సింగారి



అశోక్ గల్లా, శ్రీగౌరీప్రియ జంటగా నటిస్తున్న రొమాంటిక్ ఎంటర్‌టైనర్ 'విసా'- వింటారా సరదాగా'. ఉద్భవ్ రఘు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మిస్తున్నారు. గురువారం ఈ సినిమా నుంచి 'చింగారి' అనే పాటను విడుదల చేశారు. విజయ్ బుల్గానిన్ స్వరపరచిన ఈ గీతాన్ని సనారే రచించారు. సిద్ శ్రీరామ్, లిప్సిక ఆలపించారు. 'చింగారి.. నా చిరునవ్వుల ఓ సింగారి.. బాగుందే నువ్వొచ్చాక' అంటూ మెలోడీ ప్రధానంగా ఈ పాట సాగింది. ప్రేమలోని మధుర భావాల్ని ఆవిష్కరిస్తూ చక్కటి సాహిత్యంతో ఈ గీతం ఆకట్టుకునేలా ఉంది. అమెరికాలోని తెలుగు విద్యార్థుల నేపథ్య కథాంశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. రాహుల్ విజయ్, శివాత్మిక ంా జ శే ఖ ర్ తదితరులు చిత్ర తారాగణం.

# 'లెనిన్' ట్రైలర్‌పై

## సినీ తారల ప్రశంసలు

### - అఖిల్‌పై మహేష్ బాబు స్పెషల్ పోస్ట్ వైరల్




అక్కినేని యువ హీరో అఖిల్ అక్కినేని నటిస్తున్న తాజా చిత్రం లెనిన్ విడుదలకు సిద్ధమవుతోంది. మురళీ కిశోర్ అబ్బూరు దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం జూలై 10న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. చాలా కాలంగా భారీ విజయం కోసం ఎదురుచూస్తున్న అఖిల్‌కు ఈ సినిమా కీలకంగా మారింది. ఇటీవల విడుదలైన ట్రైలర్‌కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించడంతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. ట్రైలర్ చూసిన తర్వాత సూపర్ స్టార్ మహేష్ బాబు సోషల్ మీడియా వేదికగా చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు. లెనిన్ ట్రైలర్ చాలా ఎంజాయ్ చేశాను. అఖిల్ తన పాత్రలో హృదయాన్ని, ఆవేశాన్ని అద్భుతంగా చూపించాడు. ప్రతి ఫ్రేమ్‌లో అతని నటన ఆకట్టుకుంది. జూలై 10న విడుదల కానున్న ఈ సినిమాతో మొత్తం చిత్ర బృందానికి భారీ విజయం దక్కాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అంటూ ఆయన పోస్టు చేశారు. మహేష్ బాబు చేసిన ఈ పోస్టుకు స్పందించిన అఖిల్.. "అన్నా.. మీ పోస్టు మా ముఖాల్లో పెద్ద చిరునవ్వు తీసుకొచ్చింది. మీకు ఎంత థ్యాంక్స్ చెప్పినా తక్కువే" అంటూ కృతజ్ఞతలు తెలిపాడు. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ కూడా ట్రైలర్‌పై ప్రశంసలు కురిపించారు. ట్రైలర్ అద్భుతంగా ఉంది. నా ప్రియమైన సోదరుడు అఖిల్ అదరగొట్టాడు అంటూ ఆయన అభినందించారు. అలాగే హీరో నాని కూడా ట్రైలర్‌పై స్పందిస్తూ, లెనిన్‌తో అఖిల్ పెద్ద విజయాన్ని అందుకోవాలని కోరుకుంటున్నాను. ట్రైలర్ చాలా బాగుంది. ప్రతి ఫ్రేమ్‌లో అతని కష్టపడిన తీరు కనిపిస్తోంది. ఈ సినిమా తప్పకుండా విజయాన్ని అందుకుంటుందనే నమ్మకం ఉంది అని పేర్కొన్నారు. దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి కుమారుడు ఎస్.ఎస్. కార్తికేయ కూడా ట్రైలర్‌పై ప్రశంసలు కురిపించారు. లెనిన్ ట్రైలర్ బ్లాస్ట్ అయింది. అఖిల్.. ఇది నీ కెరీర్‌లోనే అత్యుత్తమ చిత్రంగా నిలిచేలా కనిపిస్తోంది. ఈ పాత్ర కోసమే నువ్వు పుట్టినట్టుంది. నీలో కనిపించిన ఫైర్, కమిట్‌మెంట్ అద్భుతంగా ఉన్నాయి. సినిమా కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను. చిత్రబృందానికి శుభాకాంక్షలు అని ఆయన సోషల్ మీడియాలో పేర్కొన్నారు. ఈ పోస్టులకు కూడా అఖిల్ స్పందిస్తూ అందరికీ ధన్యవాదాలు తెలిపారు. 'లెనిన్' రాయలసీమ నేపథ్యంలో సాగే యాక్షన్, ఎమోషనల్ లవ్ స్టోరీగా తెరకెక్కుతోంది. జూలై 10న విడుదల కానున్న ఈ సినిమాతో అఖిల్ కమ్‌బ్యాక్ ఇవ్వాలని అభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## బేబీ బంప్‌తో వర్కౌట్ చేస్తున్న

# సమంత

స్టార్ హీరోయిన్ సమంత రూత్ ప్రభు సోషల్ మీడియాలో మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. ఆమె తన ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్న తాజా ఫోటో డంప్‌లో వర్కౌట్ చేస్తున్న వీడియో అభిమానుల దృష్టిని ఆకర్షిస్తోంది. ముఖ్యంగా వీడియోలో ఆమె లుక్‌పై నెట్టింట విస్తృతంగా చర్చ జరుగుతోంది.తాజా వీడియోలో సమంత జిమ్‌లో అప్పర్ బాడీ వ్యాయామాలు చేస్తూ కనిపించింది. ఫిట్‌నెస్‌కు ఎప్పుడూ ప్రాధాన్యం ఇచ్చే సమంత, కఠినమైన వ్యాయామాలను ఎంతో నిబద్ధతతో పూర్తి చేస్తున్నట్లు వీడియోలో కనిపిస్తోంది. ప్రతి సెట్ అనంతరం కొద్దిసేపు విశ్రాంతి తీసుకుంటూ మళ్లీ వ్యాయామం కొనసాగించింది. అయితే, ఈ వీడియో నేపథ్యంలో సోషల్ మీడియాలో సమంత వ్యక్తిగత జీవితానికి సంబంధించిన అనేక ఊహాగానాలు కూడా వైరల్ అవుతున్నాయి. ప్రస్తుతం ఆమె గర్భవతిగా ఉన్నారనే ప్రచారం కొద్ది రోజులుగా జరుగుతూ రాగా, దీనిపై సామ్ క్లారిటీ ఇచ్చింది. ఇటీవల మా ఇంటి బంగారం సక్సెస్ మీట్‌లో తాను ప్రగ్నెంట్ చెప్పుకొచ్చింది. అయితే ఫిట్‌నెస్ నిపుణుల అభిప్రాయం ప్రకారం, గర్భధారణ సమయంలో వ్యాయామం చేయాలనుకునే వారు తప్పనిసరిగా వైద్యుల సూచనలు, పర్యవేక్షణలోనే తగిన వ్యాయామాలు చేయాలి. ప్రతి వ్యక్తి ఆరోగ్య పరిస్థితి భిన్నంగా ఉండటంతో, ఒకరికి అనుకూలమైన వ్యాయామం మరొకరికి సరిపోవాల్సిన అవసరం లేదు. మరోవైపు, సమంత తన కెరీర్‌లో వరుస ప్రాజెక్టులతో బిజీగా కొనసాగుతోంది. నటిగా మాత్రమే కాకుండా నిర్మాతగానూ కొత్త అడుగులు వేస్తూ విభిన్న కథలను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడంపై దృష్టి సారిస్తోంది. ప్రస్తుతం ఆమె పంచుకున్న ఫిట్‌నెస్ వీడియో మాత్రం సోషల్ మీడియాలో వైరల్ అవుతూ అభిమానుల ప్రశంసలు అందుకుంటోంది.



# ఫీచర్ ఫిల్మ్‌గా వనజీవి రామయ్య



కోటి మొక్కల రామయ్యగా దేశవ్యాప్తంగా పేరుపొందిన ప్రముఖ పర్యావరణ ఉద్యమకారుడు, పద్మశ్రీ పురస్కార గ్రహీత వనజీవి దరిపల్లి రామయ్య సేవలను స్మరిస్తూ రూపొందించిన లఘు చిత్రం 'వనజీవి రామయ్య'. వేముగంటి దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని నిడిగొండ నరేశ్‌కుమార్ ప్రజాపతి నిర్మించారు. గద్దర్ అవార్డ్సులో ఈ సినిమా ఉత్తమ లఘుచిత్రంగా ఎంపికైన విషయం తెలిసిందే. బుధవారం వనజీవి రామయ్య జయంతిని పురస్కరించుకొని పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేస్తున్న స్వచ్ఛంద సేవకులను ఘనంగా సత్కరించారు.

# హృద్యమైన కాగితం పడవలు



వర్ధన్, కృష్ణప్రియ జంటగా నటిస్తున్న ప్రేమకథాచిత్రం 'కాగితం పడవలు'. ఎంజీఆర్ తుకారం దర్శకుడు. కీర్తన నరేశ్, టీఆర్ ప్రసాద్‌రెడ్డి వెంకట్రాజుల, గాయిత్రమ్మ అంజనప్ప నిర్మాతలు. ఇప్పటికే ప్రచార చిత్రాలకు మంచి స్పందన వస్తున్నదని మేకర్స్ ఆనందం వెలిబుచ్చారు. తాజాగా ఈ చిత్రం విడుదల తేదీని మేకర్స్ ప్రకటించారు. ఈ నెల 24న ఏషియన్ సురేశ్ ఎంటర్‌టైన్‌మెంట్ ద్వారా సినిమా విడుదల కానున్నది. అందర్నీ అలరించే హృద్యమైన ప్రేమకథాచిత్రమిదని మేకర్స్ చెబుతున్నారు. ఈ చిత్రానికి కెమెరా: రుద్రసాయి, సంగీతం: ఏఐఎస్ నౌఫల్ రాజా, నిర్మాణం: ఎస్ఎల్ఎన్ సినీ క్రియేషన్స్, ప్రణది క్రియేషన్స్, నవ నారాయణ సినీ క్రియేషన్స్.



# మూడింతల

# పారితోషికం

**హిందీ చిత్రసీమలో ప్రతిభావంతురాలైన కథానాయికగా గుర్తింపును తెచ్చుకుంది శ్రద్ధాకపూర్. ప్రస్తుతం ఆమె ప్రసిద్ధ మరాఠీ నృత్యకారిణి, తమాషా కళాకారిణి విఠాబాయి జీవిత కథ ఆధారంగా రూపొందిస్తున్న 'ఈథ' చిత్రంలో నటిస్తున్న విషయం తెలిసిందే. పాన్ ఇండియా స్థాయిలో భారీ అంచనాలు నెలకొన్న ఈ సినిమా ఆగస్ట్ 28న విడుదలకానుంది. ఇదిలావుండగా ఈ సినిమాకు శ్రద్ధాకపూర్ దాదాపు 15కోట్ల రెమ్యునరేషన్ తీసుకున్నదని తెలిసింది.వీశీజఅవం రెండేళ్ల క్రితం చేసిన 'స్త్రీ-2' చిత్రం కోసం ఆమె కేవలం ఐదుకోట్ల పారితోషికాన్ని మాత్రమే తీసుకుందట. అయితే 'ఈథ' సినిమాలో పాత్రపరమైన సవాళ్లతో పాటు దాదాపు ఏడాది పాటు డేట్స్ కేటాయించాల్సి రావడంతో నిర్మాతలు ఆమెకు 15 కోట్ల భారీ మొత్తాన్ని అందించారని చెబుతున్నారు.**

# హోమ్ మంత్రిగారి మౌనమెందుకో...



**విజయవాడ,(భారత శక్తి)** ఏపీ హోం మినిస్టర్ వంగలపూడి అనిత యమా యాక్టివ్‌గా ఉంటారు. పొలిటికల్ ప్రత్యర్థులపై ఓ రేంజ్‌లో విరుచుకుపడుతుంటారు. ప్రతిపక్ష నేత జగన్‌ను ఉద్దేశించి పులివెందుల ఎమ్మెల్యే అని సెటైరికల్‌గా మాట్లాడ్డం ఆమెతోనే మొదలైందని చెప్పుకుంటాయి రాజకీయవర్గాలు. అంతవరకు సరే.. రాజకీయ వ్యవహారాల్లో ఎవరి లెక్కలు వారికి ఉంటాయి. కానీ, మంత్రి హోదాలో ఉండి సంబంధింత శాఖ వ్యవహారాల గురించి పట్టించుకోకుండా అనిత కేవలం పొలిటికల్ స్టేట్‌మెంట్స్‌కే పరిమితం అవుతున్నారా అన్నది చాలా మందికి వస్తున్న లేటెస్ట్ డౌట్.ఎందుకంటే.. రాష్ట్రాన్ని కుదిపేసిన సాయికృష్ణ కస్టోడియల్ డెత్ కేసుపై హోం మినిస్టర్ సక్రమంగా స్పందించలేదన్నది రాజకీయవర్గాల విస్తృతాభిప్రాయం. ఆ వ్యవహారానికి సంబంధించి ఇప్పటివరకు ఒకే ఒక్కసారి స్పందించారామె. అదీ కూడా కేవలం ఐదు సెకన్ల రియాక్షన్. సాధారణంగా పొలిటికల్ స్టేట్‌మెంట్స్ విషయంలో అనర్గళంగా మాట్లాడే అనిత అత్యంత కీలకమైన కేసు విషయంలో కేవలం ఐదు సెకన్లకే ఎందుకు పరిమితం అయ్యారన్నది బిగ్ క్వశ్చన్. రాష్ట్ర హోం మంత్రిగా అంత సీరియస్ సమస్య మీద సరిగా స్పందించకపోవడంపై వివిధ వర్గాల్లో అనుమానాలు వ్యక్తం అవుతున్నాయట.కస్టోడియల్ డెత్ కేసు విషయంలో ఎందుకొచ్చిన గొడవ అనుకుంటూ మంత్రే మాట్లాడ్డం లేదా? లేక స్పందించవద్దని ఆమెకు ఆదేశాలున్నాయా అన్న చర్చలు సైతం పెరుగుతున్నాయి. ఇదే విషయాన్ని విపక్షాలు సైతం నిలదీస్తున్నాయి. అత్యంత ముఖ్యమైన కేసు విషంలో హోం మంత్రి స్పందన అత్యంత పేలవంగా ఉండటం ఏంటి? హోం మంత్రి నోరు కట్టేస్తోంది ఎవరో తేల్చాలంటూ డిమాండ్ చేస్తున్నారు ప్రతిపక్ష నాయకులు. ఈ కేసుకు సంబంధించి హోం మంత్రి రియాక్షన్‌పై రాజకీయవర్గాలతో పాటు సామాన్యుల్లో సైతం రకరకాల డౌట్స్ పెరుగుతున్నాయట.రాష్ట్రానికి చెందిన మాజీ మంత్రి ఒకరు హోం మినిస్టర్ మేకప్‌పై వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తే.. అంతా ఖండించారు. అలాంటిది ఒక ప్రాణం విషయంలో ఆ స్థాయి స్పందన లేకపోవడం ఏంటన్న మాటలు వినిపిస్తున్నాయి. పై నుంచి వచ్చిన ఆదేశాలతోనే అనిత అలా వ్యవహరిస్తున్నారా అన్న సందేహాలు చాలామందిలో వ్యక్తం అవుతున్నాయి. ఈ విషయంలో సంబంధిత మంత్రికంటే ఎక్కువగా ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ స్పందించారు. అయినాసరే ఆమె నుంచి నో రియాక్షన్ అంటే? దీన్నెలా అర్థం చేసుకోవాలంటూ క్వశ్చన్ మార్క్ ఫేస్ పెడుతున్నారు పరిశీలకులు. ఇదే సమయంలో చాలామంది ఇప్పుడు డిప్యూటీ సీఎం వ్యాఖ్యలను కోట్ చేస్తున్నారట. నేనే హోమ్ మంత్రి అయిఉంటే పరిస్థితి వేరే విధంగా ఉండేదని పవన్ వ్యాఖ్యానించడం..అనిత విషయంలో సరిగ్గా సరిపోతుందా అనే చర్చలు సైతం నడుస్తున్నాయి. పవన్‌కళ్యాణ్ ఏ ఉద్దేశ్యంతో అలాంటి వ్యాఖ్యలు చేశారోగానీ.. వాతావరణం మాత్రం అలాగే కనిపిస్తోందని అభిప్రాయపడుతున్నారు కొందరు.కారణం ఏదైనాసరే.. రాష్ట్రంలో ఇంత పెద్ద ఘటన జరిగితే హోమ్ మంత్రి నోరు మెదపక పోవడం మాత్రం తీవ్ర చర్చనీయాంశం అయింది

# టూ టైర్ సిటీస్‌లో విల్లా కల్చర్

**కాకినాడ,(భారత శక్తి)** ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా స్థిరాస్తి మార్కెట్ ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా స్థిరమైన వృద్ధి రేటుతో దూసుకుపోతోంది. ముఖ్యంగా రాజమండ్రి రూరల్ పరిసర ప్రాంతాలతో పాటు కాకినాడ అచ్యుతాపురం ఎకనామిక్ జోన్ వైపు వెళ్లే ప్రధాన రహదారుల వెంబడి రియల్ ఎస్టేట్ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. పారిశ్రామిక విస్తరణ, మౌలిక వసతుల కల్పన వేగవంతం కావడంతో ఈ కారిడార్‌లోని ల్యాండ్ మార్కెట్ వైపు మదుపరులు భారీగా ఆకర్షితులవుతున్నట్లు ఈ వారం పత్రికల బిజినెస్ పేజీలు ప్రత్యేక విశ్లేషణాత్మక కథనాలను ప్రచురించాయి.ఈ ప్రాంతంలో రియల్ ఎస్టేట్ ఇంతలా పుంజుకోవడానికి ప్రధాన బలం గోదావరి జిల్లాల్లోని సంపన్న వర్గాల నుంచి వస్తున్న పెట్టుబడులేనని మార్కెట్ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. జిల్లాలో అత్యంత లాభదాయకంగా సాగుతున్న ఆక్వా రంగానికి చెందిన ప్రముఖులు, స్థానిక పారిశ్రామికవేత్తలు తమకు వస్తున్న లాభాలను సురక్షితమైన ఇన్వెస్ట్‌మెంట్ మార్గంగా భావించి భూములపై పెడుతున్నారు. షేర్ మార్కెట్, ఇతర వ్యాపారాల కంటే స్థిరాస్తి రంగానికే దీర్ఘకాలంలో తిరుగులేని లాభాలు వస్తుండటంతో, వీరంతా గ్రూపులుగా ఏర్పడి మరీ కనెక్టింగ్ రోడ్ల వెంబడి వందల ఎకరాలను కొనుగోలు చేస్తున్నారు.రాజమండ్రి రూరల్ పరిధిలోని శాటిలైట్ సిటీ పరిసరాలు, కడియం, జేగురుపాడు వైపు వెళ్లే మార్గాలతో పాటు.. కాకినాడ నుంచి అచ్యుతాపురం సెజ్ కనెక్టివిటీ ఉన్న రహదారుల ఇరువైపులా కొత్త కొత్త వెంచర్లు వెలుస్తున్నాయి. డీటీసీపీ అనుమతులతో మౌలిక వసతులు కల్పిస్తూ రియల్టర్లు వేస్తున్న లేఅవుట్లకు హాట్ కేకుల్లా డిమాండ్ ఏర్పడింది. మధ్యతరగతి వర్గాలు సొంత ఇంటి కల కోసం ఓపెన్ ప్లాట్లను ఎంచుకుంటుంటే, హైవే ఫేసింగ్ ఉన్న బిట్లను కమర్షియల్ అవసరాల కోసం కొనుగోలు చేసేందుకు పెద్ద ఎత్తున పోటీ నడుస్తోంది.స్థానిక పారిశ్రామిక వేత్తల అండదండలు, నిరంతర నగదు సరఫరా పుష్కలంగా ఉండటంతో ఇక్కడి స్థిరాస్తి వ్యాపారానికి ఎటువంటి ధోకా లేదన్న అభిప్రాయం వినిపిస్తోంది. అటు ఐటీ, ఇటు పారిశ్రామికంగా కాకినాడ-రాజమండ్రి జంట నగరాల మధ్య రీజినల్ గ్రోత్ కారిడార్ వేగంగా విస్తరిస్తుండటంతో రాబోయే రోజుల్లో ఇక్కడ చదరపు గజం ధరలు మరింతగా పెరగడం ఖాయమని, ఫలితంగా సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల ఆదాయం కూడా భారీగా పెరుగుతోందన్న అంచనాలున్నాయి.

# ఇంకా రాజధాని లొల్లే....

**విజయవాడ,(భారత శక్తి)** రాజకీయాల్లో ఎపుడూ దూకుడు అవసరమే. అదే సమయంలో ప్రజలను దృష్టిలో పెట్టుకుని ప్రతీ అడుగూ పడాలి. ఇక చెప్పాలీ అంటే విపక్షంలో ఉన్న వారికి బోలెడు అడ్వాంటేజెస్ ఉంటాయి. వారు ఏమైనా చెప్పవచ్చు. తాము అధికారంలోకి వస్తే కొండ మీద కోతిని అయినా తీసుకుని వస్తామని అనవచ్చు. అయితే ఇలాంటి వాటికి హద్దులు లేకపోయినా కొన్ని కీలక పాలసీల విషయంలో మాత్రం పరిమితంగానే చేయాల్సి ఉంటుంది. అలాగే కొన్ని సెంటిమెంట్ల విషయంలో ఆచీ తూచీ ముందుకు సాగాల్సి ఉంటుంది. అంటే సంక్షేమ పథకాల విషయంలో కానీ కొన్ని నూతన నిర్ణయాల విషయంలో కానీ జనాలను తమ వైపునకు తిప్పుకునేందుకు విపక్షానికి అధికార పక్షానికి లేని వెసులుబాటు ఉంటుంది కానీ అదే సమయంలో విధానపరమైన నిర్ణయాల విషయంలో మాత్రం అంతగా అవకాశం ఉండదు అని అంటున్నారు. ఎప్పటి రాజధాని చర్చ, రాజకీయ రచ్చగా అదెప్పటికి తీరెను అన్నది జనంలో ఉన్న వేదన. అయితే వైసీపీ మాత్రం అమరావతి విషయంలో ప్రతీ ఎన్నికలోనూ తన విధానాలను మార్చేసుకుని ముందుకు పోతోంది. 2014 ఎన్నికల్లో జగన్ బ్రహ్మాండమైన రాజధాని అని హామీతో జనం ముందుకు వచ్చారు. బహుశా వైసీపీకి ఆనాడు ఆలోచనలు ఒంగోలు జిల్లా సమీప ప్రాంతంలో కోస్తాకు గ్రేటర్ రాయలసీమ జిల్లాలకు మధ్య రాజధాని నిర్మాణం చేద్దామని అయి ఉండొచ్చు. దొనకొండ వద్ద రాజధాని అని కూడా అప్పట్లో వైసీపీ చాయిస్ గా వినిపించింది. కానీ తొలి చాన్స్ మాత్రం టీడీపీకి దక్కింది. దాంతో అమరావతి పేరుతో టీడీపీ ప్రభుత్వం తన ప్రతిపాదనలను ఆచరణలో పెట్టేందుకు వీలు కలిగింది. ఇక దాని మీద విపక్ష నేతగా అసెంబ్లీలో జగన్ అమరావతికి మద్దతు ప్రకటించారు. అయితే పూర్తిగా ప్రభుత్వ భూములలోనే అన్న కండిషన్ తమ మద్దతులో అని తరువాత చెప్పారు వైసీపీ నేతలుఇక 2019 కి వచ్చేసరికి అమరావతి రాజధానిగా గుర్తిస్తున్నట్లుగా వైసీపీ నేతలు ప్రకటించారు. జగన్ ఏకంగా అక్కడ ఇల్లు కట్టుకున్నారని వారంతా గట్టిగానే చెప్పారు. దాంతో టీడీపీ హయంలో మందగమనంలో సాగుతున్న రాజధాని జగన్ హయాంలో పుంజుకుంటుంది అని భావించే ఆయనకు మద్దతుగా రాజధాని ప్రాంతంతో సహా అంతా ఓటెత్తారు అని విశ్లేషణ ఉంది. అందుకే 151 సీట్లు దక్కాయని కూడా చెబుతారు. ఇక 2019 నుంచి 2024 మధ్యలో అయిదేళ్ల కాలమంతా మూడు రాజధానుల నినాదంతో గడిపారు. ఇక 2024 ఎన్నికల వేళ వైసీపీ మూడు రాజధానులకు జనాలు వ్యతిరేకమని స్పష్టం అయింది అన్నట్లుగా తీర్పు వెలువరించింది. దాంతో మూడు రాజధానులు అనడం వైసీపీ తగ్గించింది. కానీ దానికి ఆల్టర్నేషన్ ని చూసుకోవడానికి వైసీపీకి రెండేళ్ళ కాలం పట్టింది. 2026 ఏప్రిల్ 1న జగన్ ప్రెస్ మీట్ పెట్టి మావిగన్ పేరుతో ఒక సంచలన ప్రకటన చేశారు. దాంతో ఇది పెద్ద చర్చగా మారింది. ఇక 2029 ఎన్నికలకు జగన్ మావిగన్ రాజధానిగా తాము జనంలోకి వెళ్తామని అంటున్నారు. పైగా ఎన్నికల మేనిఫెస్టోలో దానిని పెడతామని ఆయన అంటున్నారు. అమరావతికి వ్యతిరేకం కాదంటూనే కొత్త ఆల్టర్నేషన్ ని తీసుకుని వచ్చారు.

దాంతో వైసీపీ రాజధాని స్టాండ్ ఏంటి అన్న ప్రశ్నకు క్లియర్ గా జవాబు వచ్చినట్లు అయింది. అది కూడా ఎన్నికలకు మూడేళ్ళు సమయం ఉండగానే. ఒక విధంగా వైసీపీ ఈ విషయంలో రిస్క్ చేస్తోందా అన్న చర్చ కూడా సాగుతోంది. ఎందుకంటే ముందే చెప్పుకున్నట్లుగా రాజధాని అన్నది ఒక సెంటిమెంట్. ఇక 2024 లో కూటమి అధికారంలోకి వచ్చాక అమరావతి కేంద్రంగా నిర్మాణం పనులు జోరుగా సాగుతున్నాయి. అక్కడ అవినీతి అక్రమాలు జరిగాయి అంటే వాటి మీద వైసీపీ పోరాడవచ్చు, అంతే కాదు ఏపీలో కొత్తగా తాము ఇతర నగరాలను అభివృద్ధి చేస్తామని కూడా వైసీపీ చెప్పుకోవచ్చు. కానీ రాజధాని అంటూ మావిగన్ ని తీసుకుని రావడం మాత్రం సాహసంతో కూడిన అంశంగానే చూస్తున్నారు. ఇది టీడీపీతో వైసీపీ రాజకీయ సమరం అనే దాని కంటే ప్రజల రాజధాని సెంటిమెంట్ మీదనే వైసీపీ కొత్త చాన్స్ తీసుకుంటున్నట్లుగా విశ్లేషిస్తున్నారు. బహుశా వైసీపీకి ఇంతకంటే ఆల్టర్నేషన్ లేదని అనుకోవాలా అన్నది కూడా ఉంది. మరి దీని మీద టీడీపీ మాత్రమే కాదు న్యూట్రల్ జనాలు ఏ విధంగా రియాక్ట్ అవుతారు అన్న దాని మీదనే వైసీపీ మావిగన్ ఇష్యూ ఆధారపడి ఉంటుంది.

# మావిగన్ అయితే... విశాఖ సంగతేంటీ

**విశాఖపట్టణం(భారత శక్తి)** విశాఖ మన రాజధాని అని వైసీపీ అధినేత జగన్ గతంలో చెప్పారు. తాను 2024లో మరోసారి గెలిస్తే విశాఖ నుంచే ప్రమాణం చేస్తాను అని కూడా చెప్పారు. విశాఖలో అన్నీ ఉన్నాయి అది సహజసిద్ధమైన రాజధాని అని వైసీపీ నేతలు పలు మార్లు చెప్పుకొచ్చారు. అయితే 2024 ఎన్నికల్లో చేదు ఫలితాలు దక్కిన తరువాత కానీ వైసీపీ నేతలకు తత్వం బోధపడలేదని అంటున్నారు. అందుకే కొన్నాళ్ళ పాటు సైలెంట్ గా ఉండి ఇపుడు దాదాపుగా టీడీపీ రూట్లోనే వెళ్తున్నారు అని అంటున్నారు. టీడీపీ కూడా అమరావతి రాజధాని అన్నది. విజయవాడ గుంటూరులకు దూరంగా కొత్త నగరం నిర్మించే పనిలో టీడీపీ ఉంది. అయితే వైసీపీ మాత్రం రెడీ మేడ్ గా మావిగన్ అని అంటోంది. అంటే విశాఖకు బదులుగా మావిగన్ తెచ్చినా రెడీ మేడ్ సిటీ విషయంలో మాత్రం వైసీపీ పక్కకు జరగలేదు అన్నది స్పష్టం అవుతోంది. ఇక విశాఖ రాజధాని అన్నారు. బీచ్ రోడ్డులో రుషికొండ మీద టూరిజం రిసార్ట్స్ ని తొలగించి అక్కడ సీఎం క్యాంప్ ఆఫీసు అని నివాసం అని దాని పేరుతో భారీ భవనాలు కట్టారు. నాలుగు వందల కోట్ల రూపాయలు దాని కోసం ఖర్చు చేశారు. విశాఖలో సముద్రం ఉంది, రైల్ రోడ్డు ఎయిర్ కనెక్టివిటీ ఉందని కూడా చెప్పారు. ఉత్తరాంధ్రా వెనకబాటుతనం అంతా పోయేలా విశాఖ క్యాపిటల్ ద్వారా అభివృద్ధి సాగుతుందని కూడా ప్రకటించారు. కానీ ఇపుడు విశాఖను వెనక్కి తీసుకున్నారు. ఆశ పెట్టి తగ్గిపోయారు అని అంటున్నారు. మరి దీని మీద ఉత్తరాంధ్రా వైసీపీ నేతల రియాక్షన్ ఎలా ఉంటుంది అన్నది కూడా చర్చకు వస్తోంది. ఇక విశాఖ రాజధాని అన్నపుడు మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు వంటి వారు గట్టిగా సమర్ధించారు. మా ప్రాంతం బాగు పడవద్దా అని కూడా ప్రశ్నించారు. మాకు రాజధాని వస్తూంటే టీడీపీ నేతలు అడ్డుకుంటున్నారు అని కూడా విమర్శించారు. మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం అలాగే బొత్స సత్యనారాయణ వంటి వారు కూడా విశాఖ రాజధానికి జై కొట్టారు. మరి ఇపుడు వైసీపీ అయితే మావిగన్ అని తన రూట్ మార్చి ప్లేట్ తిప్పేసింది. దాంతో ఈ మాజీ మంత్రులు ఇంకా వైసీపీలోని కీలక నేతలు సీనియర్ నేతలు ఏమంటారు అని ప్రశ్నలు వస్తున్నాయి. అలాగే విశాఖ రాజధాని అని వైసీపీ నేతలు ఎంత గట్టిగా చెప్పినా మరెంత ఆర్భాటం చేసినా జనాల మద్దతు అయితే ఏ కోశానా లేదని తేలిపోయింది.

విశాఖ రాజధాని అన్న తరువాతనే 2023లో ఉత్తరాంధ్రా ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగితే ప్రజలు యువత ఉద్యోగులు విద్యావంతులు అంతా కలసి టీడీపీకే ఓటేశారు. ఆ తరువాత 2024లో విశాఖ జిల్లా మొత్తం ఒక్క సీటూ వైసీపీకి లేకుండా చేశారు. ఇంతే కాదు గత అయిదేళ్లలో వైసీపీ విశాఖ రాజధాని అని ఎంతగా చెప్పినా జనాల నుంచి పాజిటివ్ రియాక్షన్ అయితే పెద్దగా రాలేదని గుర్తు చేస్తున్నారు. అందుకే వైసీపీ కూడా తన నిర్ణయం మార్చేసుకుంది అని అంటున్నారు. అయితే చెప్పుకోవడానికి ఈ రీజన్ బాగుంది కానె విశాఖ సహా ఉత్తరాంధ్రా అభివృద్ధి మీద వైసీపీ చిత్తశుద్ధి ఇంతేనా అన్న చర్చ కూడా మరో వైపు సాగుతోంది. మరి వైసీపీ ఏ విధంగా దీని మీద జనాలకు చెప్పుకుంటుందో చూడాల్సి ఉంది.


# వై నాట్ 174 టీడీపీ నినాదమా

**శ్రీకాకుళం,(భారత శక్తి)** తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు రాజ్యసభకు కొత్తగా ఎన్నికైన చింతకాయల విజయ్ తాజాగా ఘాటైన వ్యాఖ్యలు చేశారు. నర్సీపట్నంలో తనకు జరిగిన సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నారా లోకేష్ ని దమ్మున్న నాయకుడిగా కొనియాడారు. లోకేష్ తనది కాని నియోజకవర్గంలో టీడీపీకి అంతగా విజయావకాశాలు లేని సీట్లో గెలిచి చూపించారు అని విజయ్ గుర్తు చేశారు. మంగళగిరిలో ఒకసారి ఓటమి పాలు అయినా పట్టు వీడకుండా లోకేష్ మళ్లీ అదే స్థానం నుంచి గెలిచారు అంటే అదే లోకేష్ సత్తా అని అన్నారు. కానీ విపక్ష నేత జగన్ మాత్రం పులివెందుల దాటి బయటకు వచ్చి ఎక్కడైనా పోటీ చేసే సత్తా ఉందా అని విజయ్ ప్రశ్నించారు. జగన్ పులివెందులకు మాత్రమే పరిమితం అని విజయ్ ఎద్దేవా చేసారు. తెలుగుదేశం పార్టీకి సమర్ధుడు అయిన నాయకుడు నారా లోకేష్ అని అన్నారు. ఆయన చేతుల్లోనే టీడీపీకి మంచి భవిష్యత్తు ఉందని విజయ్ అన్నారు. లోకేష్ నాయకత్వాన్ని ప్రతీ కార్యకర్త పూర్తి స్థాయిలో బలపరుస్తున్నారని కూడా విజయ్ చెప్పారు. లోకేష్ తన కుటుంబంగానే పార్టీలోని అందరినీ చూసుకుంటారు అని ఆయన తమ కుటుంబం మీద చూపించే అభిమానం ఆప్యాయతలు ఎంతో గొప్పవని అని విజయ్ చెప్పారు. ఇందుకు గానూ తాను లోకేష్ కి రుణపడి ఉంటాను అని విజయ్ చెప్పారు.టీడీపీ అధినేత చంద్రబాబు గురించి విజయ్ చెబుతూ ఆయనను నమ్ముకుంటే చాలు అందరికీ న్యాయం తప్పకుండా జరుగుతుందని అన్నారు. తాను మూడు సార్లు అనకాపల్లి ఎంపీ సీటు కోసం ప్రయత్నం చేశాను అని విజయ్ చెప్పారు. అయితే ఆ మూడు సార్లు నిరాశ ఎదురైంది అని అన్నారు. అయితే అదే సమయంలో చంద్రబాబు తనను పిలిచి నన్ను నమ్ము విజయ్ నీకు మంచి స్థానం ఇస్తాను అని చెప్పేవారు అని విజయ్ గుర్తు చేసుకున్నారు. ఇపుడు బాబు ఏకంగా తనకు రాజ్యసభ సీటు ఇచ్చి తన మాటను నిలబెట్టుకున్నారు అని బాబుకు సదా కృతజ్ఞతలు అని విజయ్ చెప్పారు. తమ కుటుంబానికి మొదటి నుంచి చంద్రబాబు ఆదరణ మద్దతు ఉందని విజయ్ చెప్పారు. తాను తెలుగుదేశం పార్టీకి జెండా కూలీగా పనిచేస్తాను అని విజయ్ చెప్పారు. పార్టీ ఆదేశాలు తుచ తప్పకుండా పాటిస్తాను అని ఆయన స్పష్టం చేశారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు ఏ అన్యాయం జరిగినా తాను ముందు ఉంటాను అని విజయ్ హామీ ఇచ్చారు. తాను పార్టీ కోసం ఎంతైనా చేసేందుకు సిద్ధమని ప్రకటించారు. నర్సీపట్నంలో అభివృద్ధి కార్యక్రమాలకు ఎంపీగా తన వంతుగా కష్టపడి పనిచేస్తాను అని విజయ్ చెప్పారు. నర్సీపట్నంలో సృష్టి క్షేత్రం పనులు పూర్తి చేసి ప్రారంభోత్సవానికి ప్రధాని నరేంద్ర మోడీని ఆహ్వానిస్తామని విజయ్ తెలిపారు. సృష్టి క్షేత్రంలో ప్రపంచంలోనే ఎత్తైన పార్వతీపరమేశ్వరుల విగ్రహాలను నెలకొల్పుతామని విజయ్ చెప్పారు. నర్సీపట్నంలో అభివృద్ధి పనులకు ఎవరు ఆటంకం కలిగించినా సహించేది లేదని విజయ్ స్పష్టం చేశారు. మొత్తానికి చూస్తే అయ్యన్నపాత్రుడు వారసుడిగా విజయ్ సింహ గర్జన చేశారు. రానున్న రోజుల్లో అయ్యన్న ప్లేస్ లో పూర్తి స్థాయి రాజకీయానికి విజయ్ సిద్ధపడుతున్నారు అనడానికి తాజా సభ ఒక నిదర్శనంగా చెబుతున్నారు.

# లోకల్ బాడీ ఎలక్షన్స్ గురి

**విజయవాడ,(భారత శక్తి)** వైసీపీ అధినేత జగన్ పార్టీ నియోజకవర్గాల ఇంచార్జులు, మాజీ ఎమ్మెల్యేలతో భేటీ అవుతున్నారు. ఈ సందర్భంగా పార్టీపరంగా కొన్ని దిశానిర్దేశాలు చేస్తున్నారు. ఇదే సమయంలో స్థానిక ఎన్నికలకు సంబంధించి కూడా వారికి సూచనలు, సలహాలు ఇస్తున్నారు. ముఖ్యంగా గత ప్రభవం తిరిగి తీసుకురావాలన్నదే జగన్ లక్ష్యంగా కనిపిస్తోంది. అయితే.. ఇది సాధ్యమేనా? అనేది ప్రశ్న. ఎందుకంటే.. ఎవరు అధికారంలో ఉంటే వారే స్థానికంగా విజయం దక్కించుకునేందుకు ప్రయత్నాలు చేస్తారు. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ అసలు పోటీ నుంచే తప్పుకొంది. అయినా.. కొందరు టీడీపీ నాయకులు పోటీ చేశారు. ఇక, ఇప్పుడు వైసీపీ స్థానికంలో అయినా.. గెలుపు గుర్రం ఎక్కి.. విజయం దక్కించుకుని గత ఎన్నికల్లో జరిగిన పరాభవం నుంచి బయట పడేందుకు ప్రయత్నాలు చేస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. కానీ, క్షేత్రస్థాయిలో కూటమి ప్రభుత్వంపై ఉన్న సానుకూలత వైసీపీకి కలసి వచ్చేలా లేదు. పింఛన్ల పంపిణీ నుంచి గ్రామీణ స్థాయిలో జరుగుతున్న అభివృద్ధి వంటివి వైసీపీకి వ్యతిరేకతను కొనసాగిస్తున్నాయి. నాడు వైసీపీ పనులు చేసి ఉంటే ఇప్పుడు చెప్పుకొనేందుకు అవకాశం ఉండేదని కూటమి నాయకులు కూడా వ్యాఖ్యానిస్తున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ ఈ ఎఫెక్ట్ ఎక్కువగా పడే ప్రభావం ఉందని అంటున్నారు. దీనికితోడు క్షేత్రస్థాయిలో నాయకుల మధ్య ఐక్యత కూడా కనిపించడం లేదు. జగన్ రావాలి.. పార్టీని పట్టించుకోవాలని అనే నాయకుల సంఖ్య ఎక్కువగా ఉందే తప్ప.. వ్యక్తిగతంగా బాధ్యత తీసుకుని ముందుకు సాగాలన్న లక్ష్యంతో నాయకులు ముందుకు కదలడం లేదు.మరోవైపు.. కూటమికి ఉన్న బలమైన వాయిస్ కూడా వైసీపీకి లేదనే చెప్పాలి. టీడీపీ, జనసేన అధినేతలు..తమ బలమైన గళంతో ప్రజల మధ్యకు వెళ్తుంటే.. వైసీపీ అధినేత మీడియా సమావేశాలకు.. చూసి చదువుతున్న స్క్రిప్టు లకు మాత్రమే పరిమితం అవుతున్నారు. ఇవన్నీ.. వైసీపీని ఇరకాటంలో నెడుతున్నాయి. ట్రోల్స్‌కు గురయ్యేలా కూడా చేస్తున్నాయి. ఈ ప్రభావం కూడా స్థానిక ఎన్నికలపై పడే అవకాశం ఉందని పరిశీలకులు అంచనా వేస్తున్నాయి. ముఖ్యంగా ప్రభుత్వ వ్యతిరేకతను నమ్ముకున్న వైసీపీకి దానిని చేరువ కావడం సాధ్యం కాదన్న అంచనాలు కూడా వస్తున్నాయి

## రావిపాడులో ఘనంగా ధ్వజస్తంభ శంకుస్థాపన వేడుకలు



**నరసరావుపేట(భారత శక్తి)** పల్నాడు జిల్లా నరసరావుపేట మండలం రావిపాడు గ్రామంలో శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ధ్వజస్తంభం శంకుస్థాపన మహోత్సవ వేడుకలు వెంగళ్ రెడ్డి నగర్ లో నూతనముగా నిర్మాణంలో ఉన్న శ్రీదేవి భూదేవి సహిత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవాలయ నిర్మాణంలో భాగంగా శుక్రవారం ధ్వజస్తంభ నిర్మాణమునకు, ప్రహరీ గోడ నిర్మాణమునకు, నీటి బోరు నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహించబడినవి. ఈ కార్యక్రమంలో దేవస్థానం ధర్మకర్తలు బిల్లా రాంబాబు, రమేష్ అన్నదమ్ములు, కొల్లి బ్రహ్మయ్య, బత్తుల మురళి, కృపాకర్ రావు, చేగు వెంకటేశ్వరరావు, ఏ వి ఆర్ కే సత్యనారాయణ, బొడ్డు వెంకట ఆంజనేయులు, కొత్తూరి ప్రసాదరావు, జగదీష్, రెడ్డి మురళీకృష్ణ, తాడువాయి శ్రీనివాసరావు, అరవపల్లి ప్రదీప్ కృష్ణ, జొన్నలగడ్డ నాగరాజేశ్వరి, కూకుట్ల పద్మావతి అనేక మంది భక్తులు మరియు దేవాలయ నిర్మాణానికి సహకరించిన దాతలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# కమలం వైపు నేతల చూపు



**నెల్లూరు(భారత శక్తి)** ఏపీలోని అధికార, ప్రతిపక్ష పార్టీల్లోని కీలక నాయకులు కొందరు బీజేపీ వైపు చూస్తున్నారన్న చర్చ జోరుగా సాగుతోంది. వీరిలో అధికార పార్టీ ఎమ్మెల్యేలుగా , ఎంపీలుగా ఉన్న ఒకరిద్దరు నాయకుల పేర్లు కూడా తరచుగా వినిపిస్తున్నాయి. 'ఏమో.. వచ్చే ఎన్నికల నాటికి పరిస్థితులు ఎలా ఉంటాయో.. తప్పేముంది. ఈ పార్టీ కాకపోతే.. మరొకటి. నాకు సత్తా ఉంది. ఆ పార్టీకి చేర్చుకునేందుకు అవకాశం ఉంది.' అని క్షత్రియ సామాజిక వర్గానికి చెందిన ఓ కీలక నాయకుడు ఆఫ్ ది రికార్డుగా వ్యాఖ్యానించారు. ఇక, ఎంపీల విషయంలోనూ ఇదే తరహా వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఉమ్మడి కోస్తా జిల్లాల్లోని ఓ ఎంపీ గత ఎన్నికలకు ముందు చివరి నిమిషంలో టీడీపీ బీ ఫాం దక్కించుకున్నారు. కానీ, ఆయన పార్టీపరంగా కంటే.. జాతీయస్థాయి నేతలతోనే ఎక్కువగా టచ్‌లో ఉంటున్నారు. దీనికి కారణం.. అవసరమైతే.. వచ్చే ఎన్నికల్లో మార్పు కోసమేనని ఆయన చెబుతున్నారు. ఇది వినేందుకు చిత్రంగా ఉన్నా.. ఎవరికి వారు అప్పుడే కర్చీఫ్‌లు రెడీ చేసుకుంటున్నారు.ఇక, వైసీపీలోనూ కొందరు ఎమ్మెల్యేలు ఇదే బాటలో ఉన్నారన్న చర్చ కూడా ఉంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన ఓ సీనియర్ నాయకుడు బీజేపీతో టచ్‌లోకి వెళ్లారు. అయితే.. ఆయన కీలక పదవిని ఆశించారని.. ఆ పదవి ఇచ్చే విషయంలో బీజేపీ వెనక్కి తగ్గడంతో ఆయన మౌనంగా ఉన్నారని వైసీపీలోనే చర్చ సాగుతోంది. ఇక, ఓ ఎంపీ అయితే.. నేరుగా బీజేపీ నేతలతోనే కలివిడిగా ఉంటున్నారు. ఢిల్లీలోనే ఎక్కువ సమయం గడిపేస్తున్నారు. బీజేపీ మంత్రుల కార్యాలయాల్లోనూ ఆయన కనిపిస్తున్నారు. ఎంపీగా పనులు చేయించుకునేందుకు వచ్చానని సదరు పార్లమెంటు సభ్యుడు సెలవిస్తున్నారు. అయితే.. ఇదంతా ఎందుకంటే.. అధికార పార్టీకి చెందిన నాయకుల్లో టికెట్ల బెంగ కనిపిస్తోంది. వారిపై చేయిస్తున్న సర్వేల్లో మార్కులు తగ్గడం... వచ్చే ఎన్నికల్లో టికెట్లు దక్కుతాయోలేదో నన్న బెంగ వెంటాడుతుండడంతో సదరు నేతలు ముందుగానే వచ్చే ఎన్నికలకు ప్రిపేర్ అవుతున్నారు. ఇక, వైసీపీ నాయకుల్లో వచ్చే ఎన్నికలపై పెద్దగా ఆశలు లేకుండా పోతున్నాయన్న వాదన ఉంది. ఏమో మళ్లీ విపక్షంలో కూర్చునే పరిస్థితి వస్తుందేమోనని వారు బెంగ పెట్టుకున్నారని అంటున్నారు.

# సొంత రాష్ట్రంలోనే పట్టు కోల్పయిన సంతోష్

**బెంగళూరు,(భారత శక్తి)** భారతీయ జనతా పార్టీలో అత్యంత శక్తివంతమైన జాతీయ ప్రధాన కార్యదర్శి పదవి నుండి బీఎల్ సంతోష్ ను తప్పించి, తిరిగి రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ కు పంపాలని ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా నిర్ణయించారని ప్రచారం జరుగుతోంది. సుదీర్ఘ కాలంగా పార్టీ అంతర్గత చక్రం తిప్పిన సంతోష్, ఇటీవల కాలంలో మోదీ-షాల నమ్మకాన్ని నిలబెట్టుకోవడంలో పూర్తిగా విఫలమయ్యారనే టాక్ బలంగా వినిపిస్తోంది. ముఖ్యంగా కీలక ఎన్నికల్లో ఆయన అనుసరించిన ఏకపక్ష వ్యూహాలు పార్టీకి భారీ నష్టాన్ని చేకూర్చడమే కాకుండా, శ్రేణుల్లో తీవ్ర అసంతృప్తికి దారితీయడం వల్లే ఈ నిర్ణయమని అంటున్నారు.బీఎల్ సంతోష్‌పై మోదీ-షాలకు నమ్మకం సడలడానికి ప్రధాన కారణం ఆయన సొంత రాష్ట్రమైన కర్ణాటక. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల సమయంలో బలమైన మాస్ లీడర్, లింగాయత్ దిగ్గజం బీఎస్ యడియూరప్ప ప్రభావాన్ని తగ్గించేందుకు సంతోష్ గట్టిగా ప్రయత్నించడం. టికెట్ల కేటాయింపులో యడియూరప్ప వర్గాన్ని పక్కనబెట్టి, కేవలం సిద్ధాంతాల ప్రాతిపదికన కొత్తవారికి సీట్లు ఇవ్వాలనే సంతోష్ పట్టుదల కారణంగా పార్టీ అక్కడ ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. క్షేత్రస్థాయి రియాలిటీని కాదని, కేవలం తన ఇగో కోసమే సంతోష్ తీసుకున్న నిర్ణయాలు దక్షిణ భారతదేశంలో బీజేపీ ఏకైక కోటను కూల్చేశాయని, దీనిని మోదీ-షాలు ఇప్పటికీ క్షమించలేకపోతున్నారని అంటున్నారు.బీఎల్ సంతోష్ సంస్థాగత కార్యదర్శిగా ఉన్నప్పటికీ, మాతృ సంస్థ అయిన ఆరెస్సెస్‌కు, బీజేపీ అధినాయకత్వానికి మధ్య సరైన సఖ్యత ఏర్పాటు చేయలేకపోయారన్న విమర్శలు కూడా ఉన్నాయి. జాతీయ స్థాయిలో ఆరెస్సెస్ గ్రౌండ్ క్యాడర్‌తో సమన్వయం చేసుకోవడంలో ఆయన విఫలమయ్యారని, పైగా పార్టీలో తన పట్టును నిలుపుకోవడానికే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారని నివేదికలు చెబుతున్నాయి. దీనివల్ల గత సార్వత్రిక ఎన్నికల్లో చాలా చోట్ల ఆరెస్సెస్ కార్యకర్తలు ఉత్సాహంగా పనిచేయలేదు, ఫలితంగా బీజేపీ సొంతంగా మ్యాజిక్ ఫిగర్ సాధించలేక కూటమిపై ఆధారపడాల్సి వచ్చింది. ఈ తీవ్రమైన సమన్వయ లోపం నేరుగా ప్రధాని మోదీ గ్రాఫ్‌పైనే ప్రభావం చూపడంతో, ఆరెస్సెస్ అగ్రనాయకత్వం కూడా సంతోష్‌ను మార్చడమే శ్రేయస్కరమని ఢిల్లీ పెద్దలకు సూచించినట్లు టాక్.బీఎల్ సంతోష్ వర్కింగ్ స్టైల్ చాలా కఠినంగా, రాష్ట్ర స్థాయి నాయకులను అణచివేసేలా ఉంటుందనే ఫిర్యాదులు మోదీ, అమిత్ షాల వద్దకు వెల్లువలా చేరాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు వంటి దక్షిణాది రాష్ట్రాల ఇన్‌ఛార్జ్‌ల నియామకాల్లో కానీ, స్థానిక వ్యూహాల అమలులో కానీ ఆయన స్థానిక నేతలకు కనీస ప్రాధాన్యత ఇవ్వలేదనే వాదన ఉంది. అధికారం కేంద్రీకృతం కావడం వల్ల కొత్త నాయకత్వం ఎదగకుండా పోతోందని అధిష్ఠానం గుర్తించింది. ప్రధాని మోదీ 3.0 హయాంలో పార్టీని మరింత ఆధునికంగా, అందరినీ కలుపుపోయేలా తీర్చిదిద్దే క్రమంలో.. వివాదాలకు కేంద్రబిందువుగా మారిన బీఎల్ సంతోష్ శకానికి స్వస్తి పలకడమే ఉత్తమమని మోదీ-షాల ద్వయం భావించి, ఆయనను సున్నితంగా సంఘ్‌కు పంపేందుకు రోడ్ మ్యాప్ సిద్ధం చేసిందని అంటున్నారు.

# తెలంగాణలో రీవెంజ్ పాలిట్రిక్స్...

**హైదరాబాద్,(భారత శక్తి)** తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న పరిపాలనాపరమైన బదిలీల నిర్ణయాలపైనా రాజకీయం చేస్తున్నారు బీఆర్ఎస్ నేతలు. బీఆర్ఎస్ నేత, మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సతీమణి, సీనియర్ ప్రభుత్వ అధికారిణి లక్ష్మీబాయిని ప్రభుత్వం వ్యవసాయ మార్కెటింగ్ డైరెక్టర్ పోస్టు నుండి సహకార శాఖ పరిధిలోని హౌసింగ్ ఫెడరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ బదిలీ నేరుగా ముఖ్యమంత్రి చేయించారని కనీసం వాహన సౌకర్యం కూడా లేకుండా చేయాలనే కుట్రతోనే అప్రాధాన్య పోస్టుకు పంపారంటూ విమర్శలు ప్రారంభఇంచారు.ఇప్పటికే ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ వ్యక్తిగత సిబ్బందితో పాటు కారు సౌకర్యాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవడంపై ఆయన హైకోర్టును ఆశ్రయించి పాక్షిక ఉపశమనం పొందారు. అక్కడ రిలీఫ్ దక్కడంతో తట్టుకోలేకే, ప్రభుత్వం తనపై కక్ష సాధింపు చర్యల్లో భాగంగా భార్యను టార్గెట్ చేసిందని, రేవంత్ రెడ్డి హిట్లర్‌లా వ్యవహరిస్తూ చిల్లర రాజకీయాలు చేస్తున్నారని ఆర్ఎస్పీ అంటున్నారు. అయితే ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ భార్య అయినంత మాత్రాన ఆమెకు ఎప్పుడూ లూప్‌లైన్ కాకుండా కేవలం ప్రాధాన్యత కలిగిన పోస్టులనే కేటాయించాలా అనే ప్రశ్న ఇతరుల నుంచి వస్తోంది.ఒక ప్రభుత్వ అధికారిగా నియమితులైనప్పుడు ఏ శాఖలోనైనా, ఏ బాధ్యతలనైనా నిర్వహించాల్సి ఉంటుంది. ఆమె భర్త బీఆర్ఎస్‌లో ఉన్నారని చెప్పి, గతంలో అనుభవించిన అన్ని లగ్జరీలు, వాహన సౌకర్యాలు ఎప్పటికీ అలాగే ఉండాలని కోరుకోవడం.. బదిలీ చేస్తేనే భయపడి వేధించినట్లు కలరింగ్ ఇవ్వడం విడ్డూరంగా ఉందనే కామెంట్లు వస్తున్నాయి. లక్ష్మీబాయిని ఉద్యోగం నుంచి తొలగించలేదు కదా, కేవలం ఒక విభాగం నుండి మరో విభాగానికి బదిలీ చేసిన దానికి ప్రభుత్వం భయపడిపోయింది అంటూ సింపతీ నరేటివ్స్ బిల్డ్ చేయడం హాస్యాస్పదంగా ఉందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.ఈ విధమైన మైండ్ గేమ్స్ , కక్షసాధింపు కార్డ్ ప్లే చేయడం ద్వారా ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, బీఆర్ఎస్ పార్టీ రాజకీయంగా ఏం సాధిస్తారో కానీ.. పరిపాలనలో బదిలీలు అనేవి ప్రభుత్వాల విచక్షణాధికారాలనే ప్రాథమిక నిజాన్ని వారు ముందుగా తెలుసుకోవాలని పెదవి విరుస్తున్నారు. రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగంగానే రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఈ బదిలీలు చేస్తోందని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మండిపడ్డారు. కానీ.. తాము అన్నింటికీ తెగించిన తర్వాతే రాజకీయాల్లోకి అడుగు పెట్టామని ఆయన తేల్చి చెప్పారు. రాజకీయంగా తమను ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారని ఆరోపించారు. ఇందులో భాగంగానే మొదట తన సెక్యూరిటీని తగ్గించారని.. ఇప్పుడు తన భార్యను ట్రాన్స్‌ఫర్ చేశారని విమర్శించారు. తనకు భద్రతను తగ్గించడంపై తెలంగాణ హైకోర్టును ఆశ్రయించగా.. అక్కడ తనకు పాక్షికంగా ఉపశమనం లభించిందని గుర్తు చేశారు.హైకోర్టులో తనకు రిలీఫ్ రావడంతో దాన్ని జీర్ణించుకోలేక.. రేవంత్ రెడ్డి సర్కార్.. తన సతీమణిని అన్యాయంగా టార్గెట్ చేసుకున్నారని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు.

తన భార్యకు అసలే సంబంధం లేని వేరే డిపార్ట్‌మెంట్‌కు ఆమెను ట్రాన్స్‌ఫర్ చేశారని మండిపడ్డారు. బెదిరింపులు, కక్షసాధింపు చర్యలకు భయపడేది లేదని తేల్చి చెప్పారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా.. తాము వెనకడుగు వేసే ప్రసక్తే లేదని.. తెలంగాణ ప్రజల పక్షాన నిలబడి నిత్యం పోరాటం చేస్తూనే ఉంటామని స్పష్టం చేశారు.విపక్షంలో ఉన్నప్పుడు ప్రతీ చిన్న అడ్మినిస్ట్రేటివ్ ఆర్డర్‌ను కూడా రాజకీయ కోణంలోనే చూస్తూ, హిట్లర్ పాలన అంటూ పెద్ద పెద్ద పదాలతో బురదజల్లడం చూస్తుంటే.. ప్రభుత్వ పనితీరుపై అవగాహన లేమితో పాటు కేవలం పొలిటికల్ మైలేజ్ కోసమే ఈ రకమైన రచ్చ చేస్తున్నారని కాంగ్రెస్ వర్గాలంటున్నాయి.

## ప్రభుత్వ పాఠశాలల సమస్యలు పరిష్కరించాలి: బీడీఎస్ఎఫ్ వినతి.



నిర్మల్ జిల్లా ప్రతినిధి జూలై 03(భారత శక్తి) భైంసా మండల విద్యాశాఖ అధికారి (వీజూా)కి దీణాఖీ (బహుజన డెమోక్రటిక్ స్టూడెంట్స్ ఫెడరేషన్) ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్ చాకటి ఆనంద్ కుమార్ శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు విద్యాశాఖ అధికారులు ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలను క్రమం తప్పకుండా సందర్శించి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించాలని కోరారు. పాఠశాలలు, హాస్టళ్లలో సరిపడా తరగతి గదులు, మరుగుదొడ్లు, తాగునీరు తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే వర్షాకాలంలో విద్యార్థులకు సోకే వ్యాధులను దృష్టిలో ఉంచుకుని అవసరమైన మందులను పాఠశాలలు, హాస్టళ్లలో అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలను విద్యాశాఖ అధికారులు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## శుభకార్యాల్లో పాల్గొని మెడికల్ స్టోర్ ప్రారంభించిన చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి





జగిత్యాల, జూలై 3 (భారత్ శక్తి): ధర్మపురి పట్టణంలో నిర్వహించిన పలు శుభకార్యాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి పాల్గొని నూతన వధూవరులు, గృహప్రవేశం నిర్వహించిన కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గాంధీచౌక్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన "శైనీ మెడికల్ స్టోర్"ను ముఖ్య అతిథిగా రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజలకు నాణ్యమైన మందులు అందుబాటు ధరల్లో అందించడం ప్రతి మెడికల్ స్టోర్ బాధ్యత అని పేర్కొన్నారు. ధర్మపురి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో స్టోర్ ప్రారంభించిన యాజమాన్యాన్ని అభినందించారు. కార్యక్రమాల్లో జిల్లా గ్రంథాలయ చైర్మన్ సంఘనబట్ల దినేష్, కౌన్సిలర్ విరవేణి నాగలక్ష్మి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిలుముల లక్ష్మణ్, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## రామచంద్రరావుకు ఆయురారోగ్యాలు కోరుతూ ప్రత్యేక పూజలు



**జగిత్యాల, జూలై 3 (భారత శక్తి ప్రతినిధి):** బీజేపీ తెలంగాణ ఎండోమెంట్, ధార్మిక శాఖ పిలుపుమేరకు రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు పదవీకాలం ఏడాది పూర్తైన సందర్భంగా ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జగిత్యాల జిల్లా ఎండోమెంట్, ధార్మిక శాఖ కో-కన్వీనర్ కలకోట రాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర అభివృద్ధికి రామచంద్రరావుకు మరింత శక్తి, సంకల్పం కల్పించాలని స్వామివారిని ప్రార్థించారు. కార్యక్రమంలో గాజు భాస్కర్, పిల్లి శ్రీనివాస్, తిరుమాందాస్ సత్యనారాయణ, మండలోజి సూరజ్, సుంకు మధుసూదన్, కాశెట్టి హరీష్ తదితరులు పాల్గొన్నారు.


## 24 గంటల్లో చోరీ కేసు ఛేదించిన ధర్మపురి పోలీసులు

### బంగారం, వెండి ఆభరణాలు, ద్విచక్ర వాహనం స్వాధీనం





**జగిత్యాల, జూలై 3 (భారత్ శక్తి ప్రతినిధి):** ధర్మపురి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన చోరీ కేసును పోలీసులు కేవలం 24 గంటల్లోనే ఛేదించి నిందితుడిని అరెస్టు చేసి చోరీకి గురైన 2 తులాల బంగారు ఆభరణాలు, 14 తులాల వెండి ఆభరణాలను పూర్తిగా స్వాధీనం చేసుకున్నారు. అలాగే నిందితుడు గతంలో చోరీ చేసిన ద్విచక్ర వాహనాన్ని కూడా రికవరీ చేశారు. జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, ఐపీఎస్ ఆదేశాలు, డీఎస్పీ పురుషోత్తం రెడ్డి పర్యవేక్షణలో, సీఐ ఎ. రాంనర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ జి. మహేష్, పోలీసు సిబ్బంది సాంకేతిక ఆధారాలు, సీసీటీవీ ఫుటేజీల సహాయంతో కేసును ఛేదించారు. కేసును వేగంగా పరిష్కరించి చోరీ సొత్తును పూర్తిగా రికవరీ చేసిన పోలీసు బృందాన్ని జిల్లా ఎస్పీ అభినందించారు. ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లే సమయంలో విలువైన వస్తువులను భద్రంగా ఉంచాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే డయల్ 100 లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని పోలీసులు ప్రజలకు సూచించారు.

## సంకష్టహర చతుర్థి సందర్భంగా హేరంబ గణపతికి ప్రత్యేక పూజలు



జగిత్యాల, జూలై 3 (భారత శక్తి): సంకష్టహర చతుర్థి సందర్భంగా ధర్మపురిలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయ అనుబంధ ఆలయమైన శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో గణపతికి గణపతి ఉపనిషత్‌లతో అభిషేకం, హారతి, మంత్రపుష్పం కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు విశేషంగా పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థాన సీనియర్ అసిస్టెంట్ అల్వాల శ్రీనివాస్, వేదపండితులు పాలెపు ప్రవీణ్ కుమార్ శర్మ, అర్చకులు విశ్వనాథ శర్మ, ద్యావళ్ల సాయికుమార్, అభిషేక పురోహితులు బొజ్జ సంతోష్ కుమార్, రాజగోపాల్, స్థానిక వేదపండితులు మదు రామశర్మతో పాటు అధిక సంఖ్యలో భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ ఎర్రబెల్లి ఉషాదయాకర్ రావు



**జనగామ(భారత శక్తి)జులై 3:** దేవరుప్పుల మండలం కోలుకొండ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు భాషంపెల్లి కృష్ణమూర్తి యాదమ్మ దంపతుల తృతీయ కుమారుడు భాషం పెల్లిమహేష్ డసంధ్యారాణి వివాహ మహోత్స కార్యక్రమానికి హాజరై నూతన వధూవరులను ఉషా దయాకర్ రావు ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన నాయకులు కోతి ప్రవీణ్ గౌడ్, కామారెడ్డి గూడెం సర్పంచ్ చింత రవి, జిల్లా నాయకులు ఏల సుందర్, మండల్ నాయకులు జోగు సోమనరసయ్య, సీనియర్ నాయకులు కన్న రామ్మూర్తి, బాషంపెల్లి కొమురెల్లి, రమేష్, యువజన నాయకులు బాషం పెల్లి రాజు, కుటుంబ సభ్యులు భాషంపల్లి మధు, కిషోర్ ,సాయి తదితరులు అందరు పాల్గొన్నారు.

## బాచుపల్లి లోని పూజిత ఎంక్లేవ్‌లో డ్వాక్రా మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ



**కుత్బుల్లాపూర్, జూలై 03(భారత శక్తి ):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని బాచుపల్లి లోని పూజిత ఎంక్లేవ్ ప్రాంగణంలో డ్వాక్రా మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హన్మంతన్న, మాట్లాడుతూ మహిళల సంక్షేమం, సాధికారతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు ప్రతి అర్హ కుటుంబానికి చేరే విధంగా కృషి కొనసాగుతోందని అన్నారు. ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం ద్వారా మహిళల్లో ఆనందం, ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని పేర్కొన్నారు. అలాగే ప్రజలకు అవసరమైన ప్రతి సందర్భంలో ప్రభుత్వం అండగా నిలుస్తూ సంక్షేమ పథకాలను మరింత సమర్థవంతంగా అమలు చేస్తోందని తెలిపారు. మహిళల అభివృద్ధి సమాజ అభివృద్ధికి మూలమని, ఇలాంటి కార్యక్రమాలు మహిళల పాత్రను మరింత బలోపేతం చేస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో డ్వాక్రా గ్రామ అధ్యక్షురాలు ఇందిరా కడియాల, యశోద, శ్రీవాణి, జ్యోతి మరియు కాలనీ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అంగన్వాడి కేంద్రాలకు పిల్లల తల్లిదండ్రుల ఆదరణ

- అంగన్వాడి కేంద్రంలో ఎస్సై కుమారునికి అక్షరాభ్యాసం.



రేగొండ,జూలై 3 (భారత శక్తి): అంగన్వాడి కేంద్రాల్లో పిల్లలకు ఆటపాటల నిలయంగా కొనసాగుతూ విద్యకు అక్షరాభ్యాసానికి మొదటి ప్రాధాన్యత అంగన్వాడి కేంద్రాలు రూపుదిద్దుకోవడం తో పిల్లల ఆదరణ సెంటర్లలో పెరుగుతుంది. శుక్రవారం రేగొండ మండల కేంద్రంలోని ,4. 2 అంగన్వాడి కేంద్రాలలో అంగన్వాడి టీచర్లు నామాల రజిత, మాడగాని సుజాత లు ఏర్పాటుచేసిన బాలామృతం, అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక సర్పంచ్ వారణాసి మౌనిక , డ్వాక్రా గ్రూప్ మహిళ అధ్యక్షురాలు మార్క సుమలత, తల్లుల కమిటీ సభ్యులు పాల్గొని బాలామృతం ప్యాకెట్లను, గ్రుడ్లు అందజేశారు. అనంతరం స్థానిక ఎస్సై సుధాకర్ కుమారునికి సర్పంచి మౌనిక, అంగన్వాడి టీచర్ రజిత చేతుల మీదుగా అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే మాడగాని సుజాత ఏర్పాటు చేసిన అక్షరాభ్యాసం కార్యక్రమంలో సర్పంచ్ మౌనిక పాల్గొని పిల్లలకు అక్షరాభ్యాసాన్ని చేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మౌనిక మాట్లాడుతూ పిల్లల సంరక్షణ ఆటపాటలు, ఆరోగ్యం, పరిశుభ్రతతో పాటు విద్యకు మొదటి నిలయంగా పొందుతున్న అంగన్వాడి కేంద్రాలను పిల్లలను పంపించాలని సర్పంచ్ కోరారు. ప్రైవేటు విద్యార్కు బదులు అందుబాటులో ఉన్న అంగన్వాడి కేంద్రాలకు ప్రముఖులు విద్యావేత్తలు వ్యాపారస్తుల, పోలీస్ సిబ్బంది పిల్లల సైతం అంగన్వాడి కేంద్రాలకు తీసుకురావడంతో అంగన్వాడి కేంద్రాలకు ఆదరణ పెరుగుతుందని కేంద్రాల టీచర్లు రజిత సుజాత ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి మౌనిక తో పాటు పిల్లల తల్లులు, డ్వాక్రా గ్రూప్ మహిళ సంఘం అధ్యక్షురాలు మార్క సుమలత, ఆశ వర్కర్లు సాధనపెల్లి సప్న, మదర్స్ కమిటీ సభ్యురాలు పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందజేసిన నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి



**కుత్బుల్లాపూర్,జూలై 03(భారత శక్తి ):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో పలువురు పేద ప్రజలు గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ, చికిత్స ఖర్చులకు సరిపడా ఆర్థిక స్థోమత లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో వారు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి ని సంప్రదించగా, ఆయన వెంటనే స్పందించి రాష్ట్ర మంత్రివర్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా శస్త్ర చికిత్స నిమిత్తం ఆర్థిక సహాయం మంజూరు చేయించారు. ఈరోజు బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ మంజూరి పత్రాలు (చెక్కులు) అందజేశారు.

మహ్మద్ అజారుద్దీన్ - రూ. 60,000/-, అనుగుల లావణ్య - రూ . 35000/-, బి. సబన్న -రూ. 60,000/-,ఆడారి లక్ష్మి - రూ. 25,000/-,ఎన్. విజయలక్ష్మి - రూ. 60,000/-, ఎన్. విజయలక్ష్మి - రూ. 15,000/-, నార్లకంటి తులసి రాణి - రూ. 31,000/- లకు అందజేశారు. ఈ సందర్భంగా హన్మంతన్న మాట్లాడుతూ, ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పేద ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందని, అనారోగ్యం బారిన పడిన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా పిరినాకి నవీన్

- సన్మానించి శుభాకాంక్షలు తెలియజేసిన పార్టీ శ్రేణులు




**మణుగూరు, జూలై 03 (భారతశక్తి):** కాంగ్రెస్ పార్టీ మణుగూరు మండల అధ్యక్షులుగా నియమితులైన పిరినకి నవీన్ ను పట్టణ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వార్డ్ నెంబర్లు, యువజన నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, మహిళ నాయకులు,కార్యకర్తలు, అభిమానులు శుక్రవారం అత్యంత ఘనంగా సన్మానించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా, శాలువాతో ఘనంగా సత్కరించి, స్వీట్లు తినిపిస్తూ నూతన బాధ్యతల స్వీకరణ సందర్భంగా అభినందనలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను మరింత బలోపేతం చేస్తూ, మండల ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ, పార్టీని బలోపేతం చేయడానికి అంకితభావంతో పనిచేసి పార్టీని విజయపథంలో నడిపించాలని ఆకాంక్షించారు. పార్టీ బలోపేతం, కార్యకర్తల సంక్షేమం, ప్రజలకు మరింత చేరువయ్యే నాయకత్వాన్ని అందించాలని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. పిరినకి నవీన్ నాయకత్వంలో మణుగూరు మండలంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలపడుతుందని, ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండి సేవలందిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకులు బల్లెం సురేష్, హరి శంకర్, వార్డ్ నెంబర్స్ రాజేష్ , మానస, శ్వేతన్, సీనియర్ నాయకులు, తుపూడి శ్రీను, యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు చైతన్య నాయుడు,14 టైర్ లారీ యూనియన్ సెక్రెటరి నాగభూషన్, ట్రెజరర్ శాంతికుమార్, నాయకులు తమ్మిశెట్టి సాంబ, సోషల్ మీడియా సభ్యులు నగేష్ నాయుడు, మహేష్, ఉప్పయ్య, మహిళ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446,
Cell: 9550336688,94405 08078 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy,Executive Editor: M.Venugopal Reddy